అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 18-4-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 సంచిక : 58 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



మొదటి దశలో హాట్ సీట్లు

బరిలో కీలక నాయకులు

- వీరిలో ఎనిమిది మంది కేంద్రమంత్రులు
- ఇద్దరు మాజీ సీఎంలు, మాజీ గవర్నర్
- 19 నుంచి లోక్‌సభ తొలి విడత ఎన్నికలు
- 21 రాష్ట్రాల్లోని 102 లోక్‌సభ స్థానాలకు పోలింగ్
- పలు స్థానాల్లో బీజేపీ, కాంగ్రెస్ మధ్య గట్టి పోటీ

ముగిసిన ప్రచారం

న్యూఢిల్లీ : లోక్‌సభ తొలిదశ ఎన్నికల్లో భాగంగా ఈనెల 19న 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యుటీ)లో 102 స్థానాలకు పోలింగ్ జరగనున్నది. తొలి దశ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్న వారిలో ఎనిమిది మంది కేంద్ర మంత్రులు, ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, ఒక మాజీ గవర్నర్ ఉన్నారు.

వీరిలో బీజేపీ అగ్రనాయకులు, కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ నాగ్‌పూర్ స్థానం నుంచి హ్యాట్రిక్ విజయం సాధించాలని చూస్తున్నారు. 2014లో ఆయన ఏడుసార్లు ఎంపీగా ఎన్నికైన విలాస్ ముత్తెంవార్‌ను 2.84 లక్షల ఓట్ల తేడాతో ఓడించారు. 2019లో ప్రస్తుత మహారాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలేను 2.16 లక్షల ఓట్లతో ఓడించి సీటును నిలబెట్టుకున్నాడు.

కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు అరుణాచల్ పశ్చిమ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన 2004 నుంచి మూడుసార్లు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించారు. రిజిజు ప్రధాన ప్రత్యర్థి మాజీ ముఖ్యమంత్రి, ప్రస్తుత అరుణాచల్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నబమ్ టుకీ కావటం

...2లో

నేటి నుంచి నామినేషన్లు

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలకు కౌంట్‌డౌన్ షురూ

- ఏర్పాట్లలో అధికారులు బిజీ బిజీ
- మే 13న రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్
- జూన్ 4న కౌంటింగ్
- మరింతగా పెరగనున్న పొలిటికల్ హీట్



వివరాలు 10లో



కమల సంకల్పం న్యాయ హస్తం

చర్చనీయాంశమవుతున్న బీజేపీ, కాంగ్రెస్ మ్యానిఫెస్టోలు

- పాత హామీలకే రంగులద్దిన కమలనాథులు
- కాంగ్రెస్ అమ్ములపొది నుంచి కొత్త అస్త్రాలు

న్యూఢిల్లీ : సార్వత్రిక ఎన్నికల సమరానికి సిద్ధపడుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇప్పటికే తమ మ్యానిఫెస్టోలను ప్రజల ముందు ఉంచాయి. కాంగ్రెస్ తన ఎన్నికల ప్రణాళికకు 'న్యాయ్ పత్ర' అని పేరు పెట్టింది. బీజేపీ తన 'సంకల్ప్ పత్ర'ను విడుదల చేయడానికి పది రోజుల ముందే కాంగ్రెస్ తన ప్రణాళికను ఓటర్లకు చేర్చింది. ఈ రెండు ప్రణాళికలను పరిశీలిస్తే ప్రధాన రాజకీయ ప్రత్యర్థులైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు సార్వత్రిక ఎన్నికలను ఎలా చూస్తున్నాయో అర్థమవుతుంది. ఓటర్లపై ప్రభావం చూపేందుకు, సానుకూల ఫలితాలు రాబట్టేందుకు రెండు పార్టీలు ప్రయత్నిస్తున్నాయి.

రాజకీయ పార్టీలు వరాల జల్లులు కురిపిస్తూ ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు శతవిధాలా ప్రయత్నిస్తూనే ఉంటాయి. కాంగ్రెస్ పార్టీ తన అమ్ములపొది నుండి అనేక వరాల అస్త్రాలను బయటికి తీసింది. బీజేపీ మాత్రం గతంలో తాను ఇచ్చిన హామీలనే గుర్తు చేస్తూ వాటి అమలును కొనసాగిస్తామని చెప్పుకొచ్చింది.

కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రాష్ట్రాల ప్రణాళికలు

నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో పలు విమర్శలు సంధించింది. బీజేపీ మాత్రం పాడిందే పాటరా పాచిపళ్ల దాసుడా అన్న చందంగా 2047 నాటికి భారత్‌ను సంపన్న దేశంగా తీర్చిదిద్దుతామని తెలిపింది. ఇక సంక్షేమానికి రెండు పార్టీలు కొత్త నిర్వచనాన్ని ఇచ్చాయి. పార్టీ పాలనలో ఉన్న రాష్ట్రాలలో అమలు చేస్తున్న కొన్ని సంక్షేమ పథకాలనే కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చేర్చింది. మహాలక్ష్మి



పథకం కింద ప్రతి పేద కుటుంబానికి లక్ష రూపాయలు అందజేస్తామని, లక్ష రూపాయల వార్షిక స్టయిఫండ్‌తో అప్రెంటిస్‌షిప్ హక్కు కల్పిస్తామని, ప్రభుత్వ పరీక్షలు, నియామక టెస్టులకు దరఖాస్తు ఫీజును రద్దు చేస్తామని, విద్యా రుణాలను మాఫీ చేస్తామని, పాతిక లక్షల రూపాయల నగదు రహిత ఆరోగ్య బీమా కల్పిస్తామని...ఇలా హామీల వరద పారించింది. అన్నింటికంటే ముఖ్యంగా కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పిస్తామని తెలిపింది.

పాత పథకాలతోనే ముందుకొచ్చిన బీజేపీ

దీనికి భిన్నంగా బీజేపీ ప్రస్తుత సంక్షేమ పథకాల పైనే ఆధారపడింది. భారీ హామీలేవీ ఇవ్వలేదు. అంటే దీనర్థం బీజేపీ మ్యానిఫెస్టోలో హామీలే లేవని కాదు. ఆదాయంతో నిమిత్తం లేకుండా 70 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఐదు లక్షల రూపాయల వరకూ ఉచితంగా ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసింది. పైప్‌లైన్ల ద్వారా చౌకగా వంట గ్యాస్ సరఫరా చేస్తామని గ్యారంటీ ఇచ్చింది. ముద్ర రుణాల పరిమితిని రూ.20 లక్షలకు పెంచుతామని చెప్పింది. అయినప్పటికీ ప్రత్యర్థి కాంగ్రెస్‌తో పోలిస్తే బీజేపీ ఇచ్చిన హామీలు తక్కువేనని చెప్పాలి.

రాష్ట్రాల పైనే భారం

హామీల విషయంలో తేడాలు ఉన్నప్పటికీ రెండు పార్టీలు ప్రధానంగా సంక్షేమ రాజకీయాల పైనే ఆధారపడ్డాయి. అధికారంలోకి వస్తే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలు వాస్తవానికి రాష్ట్రాల పైనే ఆర్థిక భారం మోపుతాయి. పథకం లేదా కార్యక్రమం కేంద్రానిదే అయినప్పటికీ రాష్ట్రాలు తమ వంతు వాటాగా కొంత మొత్తాన్ని అందజేయాల్సి ఉంటుంది. దీంతో అసలే వనరుల కొరతతో కునారిల్లుతున్న రాష్ట్రాల పరిస్థితి మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా తయారవుతోంది.

కులాలపై కాంగ్రెస్ దృష్టి

రాహుల్ చేపట్టిన భారత్ జోడో యాత్ర, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పాతిక హామీలు యువత, మహిళలు, కార్మికులు, రైతులను పార్టీ వైపు ఆకర్షించేందుకు ఉపకరించవచ్చు. సమానత్వం,

...11లో

ఆయన అవినీతికి ఛాంపియన్

మోడీపై మండిపడిన రాహుల్

- బాండ్ల పథకం ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ స్కీమ్
- బీజేపీ స్కోరు 150 దాటదు
- అమేథీలో పోటీపై పార్టీదే నిర్ణయం

వివరాలు 11లో

పోరాటాల గడ్డపై ఎర్రజెండా ఎగరాలి

భువనగిరి కోట నుంచి పార్లమెంట్‌కు కమ్యూనిస్టు బిడ్డను పంపాలి

- 19న సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ జహంగీర్ నామినేషన్
- భారీప్రదర్శన, బహిరంగ సభ
- హాజరుకానున్న అగ్రనేతలు బీవీ రాఘవులు,తమ్మినేని : పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ -నకిరేకల్

పోరాటాల గడ్డ నుంచి ఎర్రజెండా ముద్దుబిడ్డ సీపీఐ(ఎం) ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను పార్లమెంట్‌కు పంపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ పెద్ద మోసగాడు అని, మూడోసారి గెలిస్తే

...11లో



ప్రజాస్వామ్య ఫలాలు అందడం లేదు

- ఉద్యోగ కల్పన లేకపోవడమే దీనికి కారణం
- చిప్ పరిశ్రమకు భారీగా సబ్సిడీలెందుకు?
- ఉద్యోగావకాశాలు ఉన్న రంగాలలో ఉపాధి ఏది?
- అవకాశాల కోసం విదేశాల బాట పడుతున్న యువత : ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్

వాషింగ్టన్ : ప్రజాస్వామ్య ఫలాల ప్రయోజనాలను భారత్ అందిపుచ్చుకోలేకపోతోందని రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. మానవ పెట్టుబడిని పెంచాల్సిన అవసరం ఉన్నదని, వారి నైపుణ్యాలను

...11లో

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రభుత్వం తరపున సీఎస్ లాంఛనాలు

- నేడు పట్టాభిషేక మహోత్సవం





నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అభిజిత్ లగ్న మూహూర్త సమయాన సీతమ్మ మెడలో రామయ్య తాళి కట్టడంతో కల్యాణ క్రతువు పూర్తయింది. మిథులా స్టేడియంలోని మండపంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ వైభవంగా నిర్వహించారు. బుధవారం ఉదయం రామాలయంలో మూలవరులకు మొదట కల్యాణం జరిగింది. ఆపై ఉత్సవమూర్తులను ఆలయం నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా మిథులా కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం 10:30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కాగా.. అభిజిత్ లగ్నంలో సీతారామయ్యలకు రుత్వికులు జీలకర్ర బెల్లం పెట్టారు. ఆపై సీతమ్మ మెడలో రామయ్య మాంగళ్యధారణ గావించారు. తరువాత భక్తులు గోటితో ఒలిచిన తలంబ్రాలను సీతారాముల శిరస్సుపై పోశారు. తదనంతర కార్యక్రమాలను అర్చకులు సంప్రదాయబద్ధంగా పూర్తి చేశారు. పట్టాభిషేక

...11లో

సీన్ రిపీట్...

- ఇప్పుడు కూడా అందరికన్నా ముందే..
- ఈసారైనా వ్యూహం ఫలించేనా..?
- నేడు బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఫాంల అందజేత
- ఒక్కో అభ్యర్థికి రూ.95 లక్షల చెక్కును ఇవ్వనున్న కేసీఆర్

3లో..

ముంచెత్తిన వరదలు

- యూఏఈ, ఒమన్‌లో కుండపోత..18 మంది మృతి
- భారత్..యూఏఈ విమానాలు రద్దు



వివరాలు 2లో

భారత జనాభా 144 కోట్లు

- 0-14 ఏండ్ల వయస్సు వారు 24 శాతం మంది
- ప్రసూతి మరణాలు 8 శాతం
- 'ఆ మహిళల' పట్ల ఎక్కువ లింగ వివక్ష
- ఆరోగ్య సంరక్షణలోనూ అసమానతలు : యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక



వివరాలు 2లో

కేసీఆర్.. నీ పార్టీని మూడు నెలల్లో

బొంద పెడతాం

కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బీఆర్‌ఎస్ పునాదులుండవు

- కవిత జైలుకుపోయినా బుద్ధి రాలేదా?
- ధైర్యం లేకనే అసెంబ్లీకి దూరం
- ఎంపీ ఎన్నికల్లో 14 సీట్లు మావే.. : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ-నల్గొండ కలెక్టరేట్

'కేసీఆర్ నిన్ను.. నీ పార్టీని మూడు నెలల్లో రాజకీయంగా బొంద పెడతాం. కాంగ్రెస్‌ను టచ్ చేస్తే బీఆర్‌ఎస్‌కు పునాదులుండవు. కుమార్తె కవిత జైలుకుపోయినా మీకు ఇంకా బుద్ధి రాలేదా' అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేయించి.. ఇంట్లో భార్యాభర్తలు మాట్లాడుకునేవి కూడా విని దేశంలో ఎక్కడా లేని దరిద్రమైన పాలన చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికైన ప్రభుత్వాన్ని ఏడాదిలో ఎలా పడగొడతావు? దోపిడీ దొంగవై మా ఎమ్మెల్యేలను కొనాలనుకుంటున్నావా అని ప్రశ్నించారు. తాము తలుచుకుంటే మీ బంధువులు ముగ్గురు, నలుగురు తప్ప

...11లో



రాములమ్మ ఎక్కడ..!

మూగపోయిన విజయశాంతి ట్విట్టర్ .. మెదక్ సీటు ఇవ్వనందుకు అలిగారా?

- ఇమడలేక ఇంటికే పరిమితమయ్యారా?
- పార్టీలో చేర్చుకుని పదవి ఇవ్వకుండా అవమానిస్తున్నారా?
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకే ఒక్కసారి గాంధీభవన్‌కు...
- పార్లమెంటు ఎన్నికల ప్రచారానికి వచ్చేనా?
- పని చేయని సీనియర్ల రాయబారం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సినీనటి, కాంగ్రెస్ సీనియర్ నేత విజయశాంతి ప్రస్తుతం ఎక్కడా కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో పొలిటికల్ ఫైర్ బ్రాండ్ జాడ ఎక్కడా లేకపోవడంతో రాములమ్మ ఏమైంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజా సమస్యలు, ప్రత్యర్థుల విమర్శలకు పదునైన మాటలతో ఎప్పటికప్పుడు ట్విట్టర్ ద్వారా ధీటైన కౌంటర్లు ఇచ్చే రాములమ్మ ఎందుకిలా మారిపోయారనే చర్చ జరుగుతున్నది. ప్రస్తుతానికి విజయశాంతి ట్విట్టర్ పిట్ట కూడా మూగపోయింది. ఈ క్రమంలో విజయశాంతి ఎక్కడ ఉన్నారు? ఏం చేస్తున్నారు? రాజకీయాలకు ఎందుకు దూరంగా ఉంటున్నారు? అనే చర్చ ఆసక్తికరంగా మారింది.

నిరాశ పరిచిన మెదక్ సీటు

గతంలో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలోనే మెదక్ ఎంపీ సీటును విజయశాంతి ఆశించారు. ఈ విషయంలో పార్టీ హామీ ఇవ్వకపోయినా ఆమె మాత్రం ఆసీటుపై బలంగానే పట్టుపట్టారు. కానీ మారిన రాజకీయ సమీకరణాల్లో భాగంగా సీటును నీలం మధుకు కేటాయించింది. ఈ విషయంలో పార్టీ కనీసం తన అభిప్రాయాన్ని కూడా తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ కారణంగానే మనస్థాపానికి గురై ఆమె రాజకీయ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది రోజుల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన రాములమ్మ...ఆ తర్వాత ఏ కార్యక్రమంలోనూ పాల్గొనడం లేదు. ఇటీవల

...11లో

భారత జనాభా 144 కోట్లు

న్యూఢిల్లీ : భారత్ ఇప్పటికే ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా తయారైంది. తాజాగా ఆ జనాభా 144 కోట్లకు చేరినట్టు అంచనా. ఇందులో 0-14 ఏండ్ల మధ్య వయస్సున్నవారు 24 శాతంగా ఉన్నారు. యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్స్ (యూఎన్ఎఫ్‌పీఏ) స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్-2024 నివేదిక "ఇంటర్‌వోవెన్ లైవ్స్, థ్రెడ్స్ ఆఫ్ హోప్: ఎండింగ్ ఇనాక్విలిటీస్ ఇన్ సెక్సువల్ అండ్ రి అండ్ ప్రొడక్టివ్ హెల్త్ అండ్ రైట్స్" వెల్లడించింది. ఇది భారతదేశ జనాభా 77 ఏండ్లలో రెట్టింపవుతుందని అంచనా వేసింది. 144.17 కోట్ల మంది జనాభాతో ప్రపంచవ్యాప్తంగా భారత్ అగ్రస్థానంలో ఉండగా, చైనా 142.5 కోట్లతో రెండో స్థానంలో ఉన్నదని నివేదిక పేర్కొన్నది. 2011లో భారత ప్రభుత్వం నిర్వహించిన చివరి జనాభా లెక్కల ప్రకారం దేశ జనాభా 121 కోట్లుగా నమోదైంది.ఇక భారత్‌లో 17 శాతం మంది 10-19 ఏండ్లలోపు వారు ఉన్నారని యూఎన్ నివేదిక వివరించింది. 10-24 సంవత్సరాల వయస్సు గల వారు 26 శాతం, 15-64 సంవత్సరాల వయస్సు గలవారు 68 శాతంగా ఉన్నారని అంచనా వేసింది. అలాగే 7 శాతం మంది 65 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు గలవారుగా నివేదిక వివరించింది. ఆయుర్దాయం పురుషులది 71 సంవత్సరాలుగా, స్త్రీలు 74 ఏండ్లుగా అంచనా వేసింది.ప్రపంచవ్యాప్తంగా లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యంలో 30 ఏండ్ల పురోగతి ఎక్కువగా అత్యంత అట్టడుగు వర్గాలను విస్మరించిందని నివేదిక కనుగొన్నది. భారత్‌లో 2006-2023 మధ్య బాల్య వివాహాల శాతం 23గా ఉన్నదని పేర్కొన్నది. అలాగే, దేశంలో ప్రసూతి మరణాలు ప్రపంచవ్యాప్తంగా 8 శాతంగా ఉన్నాయని వివరించింది.ఈ మరణాల విషయంలో భారత్ అసమానతలను చూస్తూనే ఉన్నదని నివేదిక పేర్కొన్నది. అత్యధిక ప్రసూతి మరణాలు అరుణాచల్‌ప్రదేశ్‌లోని తిరాప్ జిల్లాల్లోని స్థానిక తెగల్లో నమోదవు తున్నవి. ఇక్కడ 100,000 జననాలకు 1,671 ప్రసూతి మరణాలు నమోదవుతున్నాయని నివేదిక అంచనా వేసింది. ఇక అంగవైకల్యం లేని వారితో పోలిస్తే.. ఆ సమస్యను కలిగి ఉన్న మహిళలు 10 రెట్లు ఎక్కువగా లింగ ఆధారిత హింసను అనుభవిస్తున్నారని వివరించింది. ఇక ఆరోగ్య సంరక్షణను పొందటంలో మెరుగుదల అనేది ప్రధానంగా సంపన్న మహిళలకు, ఇప్పటికే ఆరోగ్య సంరక్షణకు మెరుగైన అవకాశాన్ని కలిగి ఉన్న జాతి సమూహాలకు చెందిన వారికి ప్రయోజనం చేకూర్చాయని సమాచారం. "వైకల్యమున్న మహిళలు, బాలికలు, వలసదారులు, శరణార్థులు, జాతి మైనారిటీలు, ఎల్జీబీటీఐఏ ప్లస్ ప్రజలు, హెచ్ఐవీ బాధితులు, వెనుకబడిన కులాల ప్రజలు అందరూ ఎక్కువ లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్య ప్రమాదాలను ఎదుర్కొంటున్నారు. ఇందులో వారికి ఆరోగ్య సంరక్షణలోనూ అసమానతలు ఎదురవుతున్నాయి" అని నివేదిక పేర్కొన్నది.వాతావరణ మార్పు, మానవతా సంక్షోభాలు, సామూహిక వలసలు వంటి బలమైన శక్తులతో వారి దుర్బలత్వం మరింత పెరుగుతున్నదనీ, ఇవి తరచుగా సమాజంలోని అంచులలో ఉన్న మహిళలపై అసమాన ప్రభావాన్ని చూపుతాయని నివేదిక హెచ్చరించింది. భారత్‌లో పని ప్రదేశాలు, విద్యలో కుల ఆధారిత వివక్షను ఎదుర్కొంటున్న మహిళలకు చట్టపరమైన రక్షణ కోసం దళిత కార్యకర్తలు వాదిస్తున్నారని వివరించింది. నివేదిక ప్రకారం.. లక్షలాది మంది మహిళలు, బాలికలు కఠిన పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ప్రతిరోజుకు.. ప్రసవించే మహిళలు 800 మంది మరణిస్తున్నారు. నాలుగో వంతు మంది మహిళలు తమ భాగస్వామితో లైంగిక చర్యకు నో చెప్పలేరు. దాదాపు 10 మంది మహిళల్లో ఒకరు గర్భనిరోధకం గురించి తమ స్వంత నిర్ణయాలు తీసుకోలేరు. డేటా ఉన్న 40 శాతం దేశాల్లో మహిళల శారీరక స్వయం ప్రతిపత్తి తగ్గిపోతుండటం గమనార్హం.

మొదటి దశలో హాట్ సీట్లు

(మొదటిపేజీ తరువాయి)

గమనార్హం. దీంతో అక్కడ పోటీ తీవ్రంగానే ఉంటుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ మంత్రి సర్బనాద సోనోవాల్ అసోంలోని దిబ్రూగఢ్ నుంచి బరిలో ఉన్నారు. కేంద్ర పెట్రోలియం, సహజవాయువు శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలికి టిక్కెట్ ఇవ్వకపోవటంతో రాజ్యసభ సభ్యుడైన సోనోవాల్‌ను దిబ్రూగఢ్ నుంచి బీజేపీ పోటీకి దింపింది.

యూపీలోని ముజఫర్‌నగర్ స్థానం నుంచి సమాజ్‌వాదీ పార్టీ(ఎస్పీ)కి చెందిన హరీంద్ర మాలిక్, బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అభ్యర్థి దారా సింగ్ ప్రజాపతి, బీజేపీ నుంచి కేంద్ర మంత్రి సంజీవ్ బలియన్ బరిలో ఉన్నారు. ఇక్కడ త్రిముఖ పోరు ఉంటుందని విశ్లేషకులు చెప్తున్నారు. దీంతో కేంద్ర మంత్రికి విజయం కష్టమేనని అంటున్నారు. ఇక మోడీ క్యాబినెట్‌లో రెండు పర్యాయాలు పార్లమెంటేరియన్‌గా, జూనియర్ మంత్రిగా పనిచేసిన జితేంద్ర సింగ్ ఉదంపూర్‌లో హ్యాట్రిక్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యుడు భూపేంద్ర యాదవ్.. రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లా మత్స్య ప్రాంతానికి చెందిన సిట్టింగ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే లలిత్ యాదవ్‌తో పోటీలో ఉన్నారు. ఇక్కడ యాదవ్ సామాజికవర్గం కీలక పాత్రను పోషించనున్నదని విశ్లేషకులు చెప్తున్నారు. రాజస్థాన్‌లోని బికనీర్ లోక్‌సభ స్థానం నుంచి కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్.. కాంగ్రెస్ మాజీ మంత్రి గోవింద్ రామ్ మేఘ్వాల్‌తో పోటీ పడనున్నారు.

తమిళనాడులోని నీలగిరి లోక్‌సభ నియోజకవర్గం ప్రస్తుత డీఎంకే ఎంపీ, మాజీ టెలికాం మంత్రి ఎ. రాజాపై బీజేపీ నుంచి కేంద్ర మత్స్యశాఖ సహాయ మంత్రి ఎల్ మురుగన్ పోటీ చేయనున్నారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన మురుగన్ ఇక్కడి నుంచి పోటీ చేయడం ఇదే తొలిసారి కావటం గమనార్హం.

శివగంగ ఎంపీ కార్తీ చిదంబరం తన తండ్రి ఏడుసార్లు గెలుపొందిన స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. బీజేపీ నుంచి టి. దేవనాథన్ యాదవ్, ఏఐఏడీఎంకే నుంచి జేవియర్ దాస్‌లు బరిలో ఉన్నారు.తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు కె. అన్నామలై ఆ రాష్ట్రంలోని కోయంబత్తూర్ నుంచి పోటీ చేస్తున్నారు. అలాగే, అక్కడి నుంచి డీఎంకే నాయకుడు గణపతి పి. రాజ్‌కుమార్, ఏఐఏడీఎంకేకు చెందిన సింగై రామచంద్రన్‌తో అన్నామలై పోటీ పడనున్నారు.

ఇక క్రియాశీల రాజకీయాల్లోకి రావటానికి ఇటీవల తెలంగాణ గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్(ఎల్జీ) పదవికి రాజీనామా చేసిన తమిళిసై సౌందరరాజన్.. బీజేపీ నుంచి చెన్నై సౌత్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కుమార్తె, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ సోదరి అయిన కనిమొళిపై 2019 ఎన్నికల్లో తూత్తుకుడి నుంచి పోటీ చేసిన సౌందరరాజన్.. భారీ ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాగా, కనిమొళి.. తూత్తుకుడి స్థానం నుంచి తిరిగి విజయం సాధించాలని చూస్తున్నారు. ఇక ఆమెపై ఎన్డీయే మిత్రపక్షమైన తమిళ మానిల కాంగ్రెస్ (మూపనార్) ఎస్.డి.ఆర్ విజయశీలన్‌ను, ఏఐఏడీఎంకే ఆర్. శివసామి వేలుమణిని పోటీకి దింపాయి.

కాంగ్రెస్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్ నాథ్ కుమారుడు నకుల్ నాథ్.. చింద్వారా నుంచి మళ్లీ ఎన్నిక కావటానికి ప్రణాళికలు రచిస్తున్నారు. 1980 నుంచి తొమ్మిది సార్లు ఈ సీటును గెలుచుకున్న కమల్ నాథ్.. ఈ సారి కూడా తన కుమారుడిని గెలిపించేందుకు కృషి చేస్తున్నారు. 2019 ఎన్నికలలో మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని 29 స్థానాలకు గాను 28 స్థానాలను బీజేపీ కైవసం చేసుకున్నది. అయితే చింద్వారా నుంచి నకుల్ మాత్రం 37,536 ఓట్ల తేడాతో బీజేపీ అభ్యర్థిని ఓడించాడు. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్‌కు చెందిన ఏకైక ఎంపీగా ఉన్నారు.


త్రిపురలో ఉన్న రెండు లోక్‌సభ నియోజకవర్గాలలో.. పశ్చిమ త్రిపుర స్థానానికి మాజీ ముఖ్యమంత్రి విప్లవ్ కుమార్ దేవ్ బీజేపీ నుంచి బరిలో ఉన్నారు. ఆయనపై రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఆశిష్ కుమార్ సాహా పోటీ చేయనున్నారు. ఇక్కడ పోటీ చాలా గట్టిగా ఉండనున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.అసోంలోని కలియాబోర్ ఎంపీగా 2014 నుంచి రెండుసార్లు లోక్‌సభ ఎన్నికల్లో గెలిచిన, లోక్‌సభలో కాంగ్రెస్ ఉప నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగోయ్ కుమారుడు గౌరవ్ గొగోయ్.. ఈ సారి పొరుగున ఉన్న జోర్హాట్‌లో పోటీ చేయనున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి చెందిన టోపోన్ కుమార్ గొగోయ్ ఇక్కడి నుంచి విజయం సాధించారు. మణిపూర్ న్యాయ, విద్యా శాఖ మంత్రి బసంత కుమార్ సింగ్ ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఆయనపై జేఎన్‌యూ ప్రొఫెసర్, కాంగ్రెస్ అభ్యర్థి బిమల్ అకోయిజామ్ పోటీ చేయనున్నారు. మెయిటీ కమ్యూనిటీకి చెందిన బసంత్ కుమార్ సింగ్.. అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వంలో కేంద్ర సహాయ మంత్రిగా పనిచేసిన తౌనోజం చావోబా సింగ్ కుమారుడు.ఉత్తర రాజస్థాన్‌లోని బీజేపీకి పట్టు ఉన్న స్థానం చురు నుంచి ఆ పార్టీ అభ్యర్థిగా దేవేంద్ర ఝఝరియా(రెండుసార్లు పారాలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ జావెలిన్ త్రోయర్), కాంగ్రెస్ నుంచి రాహుల్ కస్వాన్‌లు బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్య బలమైన పోటీ ఉండనున్నదని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. కాగా, పార్టీ టికెట్ నిరాకరించటంతో రాహుల్ కస్వాన్ మార్చిలో రెండుసార్లు బీజేపీని వీడారు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి బరిలో నిలుస్తున్నారు.కాగా, 18వ లోక్‌సభకు ఎన్నికయ్యే 543 స్థానాలకు గానూ మొత్తం ఏడు దశల్లో పోలింగ్ జరగనున్నది. 19 నుంచి మొదటి దశ ప్రారంభం కానున్నది. జూన్ 4న ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థుల భవితవ్యం తేలనున్నది.

జీవ నదుల చెంత.. నీటికి చింత

కృష్ణ, బీమా నదుల ప్రవేశం దగ్గరే నీటి కోసం అవస్థలు

- ఎగువ ప్రాంతం పేరుతో పనులు జరగని మిషన్ భగీరథ
- తంగెడు, సుకూర్ లింగంపల్లి గ్రామాల దగ్గర కృష్ణా నీరు జిల్లాలోకి ప్రవేశం
- అయినా తాగునీటి కోసం వ్యవసాయ బోరుబావులే దిక్కు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న నదీ సమీప ప్రజలు





చుట్టూ జీవనదులు ప్రవహిస్తున్నా.. గొంతు తడుపుకోవడానికి కూడా అల్లాడాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయి.. సుదూర ప్రాంతాలలో పట్టణాలకు మిషన్‌భగీరథ ద్వారా తాగునీటిని అందిస్తున్న కృష్ణానది.. దాని పక్కనే ఉంటున్న వేలాది మంది ప్రజల గొంతు మాత్రం తడపడం లేదు. కృష్ణానది ఎగువ ప్రాంతం అయిన కర్నాటక, మహారాష్ట్ర ప్రాజెక్టుల్లో సరిపడా నీళ్లు ఉన్నా.. దిగువ ప్రాంతాల ప్రజలు తాగునీటి కోసం కటకట ఆడాల్సిందే. వేల కోట్లు ఖర్చు చేసి తాగునీటి అవసరాలు తీర్చామని గత ప్రభుత్వం అర్భాటం చేసినప్పటికీ కూతవేటు దూరంలో ఉన్న కృష్ణానది పరివాహక ప్రాంత ప్రజలకు తాగునీరు అందివ్వలేకపోయిందన్న విమర్శ మూటగట్టుకుంది.

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

నారాయణపేట జిల్లా కృష్ణ మండల పరిధిలో తంగెడు గ్రామం సంగమం దగ్గర కృష్ణానది జిల్లాలో ప్రవేశిస్తుంది. అదే గ్రామంలో సుకూర్, లింగంపల్లి దగ్గర బీమా నది వచ్చి కృష్ణానదిలో చేరుతోంది. రెండు ప్రధాన నదులున్నా.. వేసవి వచ్చిందంటే ఇక్కడ తాగునీటికి ఘోస తప్పడం లేదు. గత పాలకులు మిషన్‌భగీరథ పథకం పేరుతో వేల కోట్లు ఖర్చు చేశారు. ప్రతి ఇంటికీ ఉచితంగా తాగునీటిని సరఫరా చేస్తామని చెప్పారు. ఎగువ ప్రాంతంలో ఉండటం వల్ల మోటార్లు ఎత్తుకు నీటిని అందివ్వలేవన్న కారణం చూపి మిషన్ భగీరథ పథకం ఇక్కడ అమలు కాలేదు. తాగునీటి సమస్య తీర్చడానికి ఈ ప్రాంతంలో లిఫ్టులు ఏర్పాటు చేశారు. తంగెడి లిఫ్టు, స్వయం భూలక్ష్మి వెంకటేశ్వర లిఫ్టు పేరుతో రెండు లిఫ్టులు, ముడిమాల్ లిఫ్టు, క్షీర లింగేశ్వర లిఫ్టులను ఏర్పాటు చేశారు. ఈ లిఫ్టుల ద్వారా వరదలు వచ్చే సమయంలోనే తాగునీటి సరఫరా చేస్తారు. వేసవిలో వరదలు ఆగి జలాలు వెనక్కి వెళ్లిపోతే.. ఇక్కడ చుక్క నీటి నిల్వ ఉండదు. శుకూర్‌లింగంపల్లి, అయినాపూర్, కూసుమర్తి, తంగెడి, కృష్ణ, ఇందూపూర్, ముడిమాల్, గుడెబల్లూరు గ్రామాల్లో వేసవిలో నీటి సమస్య తీవ్రంగా ఉంది.

బోరుబావులు, వ్యవసాయ బోర్లే ఆధారం..

కృష్ణ మండల పరిధిలో 40 వేల జనాభా ఉంటుంది. వ్యవసాయం ప్రధాన వృత్తిగా జీవించే వీరికి సాగునీరు లేదు.. తాగునీటికి సైతం కష్టంగా ఉంటుంది. భూగర్భ జలాలు పడిపోయి బోరు బావులు ఎండిపోతే తాగునీటి సమస్య మరింత తీవ్రంగా మారింది. రిజర్వాయర్లు లేకపోవడంతో సాగు భూములకు నీరు అందడం లేదు. తాగునీటి అవసరాల కోసమైనా రిజర్వాయరు ఏర్పాటు చేస్తే.. వేసవిలో తాగునీటి సమస్య తీరనుంది. కొండల మీద ఉన్న గ్రామాలకు తాగుసాగు నీరు ఇచ్చే టెక్నాలజీ ఉన్న కాలంలోనూ ఈ ప్రాంత ప్రజల సమస్య తీరడం లేదు.

ఎగువ ప్రాజెక్టుల వల్లే నీటి సమస్య

కర్నాటక, మహారాష్ట్ర ప్రభుత్వాలు కృష్ణానది ఎగువన చెక్‌డ్యాంలు, బ్రిడ్జీలు కం బ్యారేజీల నిర్మాణం చేశాయి. వేసవి కాలంలో ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకుంటున్నాయి. అందుకే వేసవిలో మనకు నీటి సమస్య ఏర్పడుతోంది. మనకు కూడా నీటి సమస్య రాకుండా ఉండాలంటే ఇక్కడ రిజర్వాయర్‌లు నిర్మాణం చేసుకోవాలి. వరదలు వచ్చినప్పుడు నిల్వ చేసుకుంటే నీటి సమస్య తీరుతుంది. ఆ దిశగా ప్రభుత్వం పనిచేయాల్సి ఉంది.

తాగునీటి కోసం తండ్లాడుతున్నాం.

కున్ని వెంకటేష్, తంగెడి గ్రామం నారాయణపేట జిల్లా

మా భూములు వరదలు వస్తే మునుగుతాయి. కానీ ఎండాకాలం వస్తే తాగునీరు కూడా దొరకదు. కృష్ణా, బీమా నదులు రెండు కిలోమీటర్ల దూరాన ఉన్నా.. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నాం. వేసవిలో బోరుబావులు, ట్యాంకర్ల నీటినే వాడాల్సి వస్తోంది. తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి.

మిషన్ భగీరథ నీటిని ఎందుకు సరఫరా చేయడం లేదు

వెంకట్‌రాంరెడ్డి గవినోళ్ల, సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి

నదికి రెండు వందల కిలోమీటర్ల దూరాన ఉన్న నగరాలకు నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరాన ఉన్న కృష్ణ మండలంలో తాగునీటి సమస్య తీర్చడం లేదు. గత పాలకులు మిషన్‌భగీరథ పేరుతో హడావుడి చేసి అధికారంలోకి వచ్చారు. చిత్తశుద్ధి ఉంటే తాగునీటి సమస్య పరిష్కారం కష్టమేమీకాదు. ఇప్పటికైనా ఈ ప్రభుత్వం తాగునీటిపై చర్యలు తీసుకోవాలి.

నీటి కొరత ఉంది.. సమస్య రాకుండా చూస్తున్నాం

ఎంపీడీఏ జానయ్య

కృష్ణ మండలంలో తాగునీటి ఎద్దడి ఉన్న మాట వాస్తవమే. ఈ ప్రాంతం ఎత్తున ఉండటంతో ఇక్కడికి మిషన్‌భగీరథ నీళ్లు రావడం లేదు. అయినా బోరు బావులు, వ్యవసాయ పంపు సెట్ల ద్వారా నీటిని అందజేస్తున్నాం. ఇక్కడ ఒక రిజర్వాయరు నిర్మిస్తే సమస్య పరిష్కారమవుతుంది. ప్రజలకు నీటి కొరత రాకుండా ప్రయత్నం చేస్తున్నాం.


కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

- ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ రోహిత్ చౌదరి :
  కాంగ్రెస్ పార్టీలో చేరిన ఉప్పల శ్రీనివాస గుప్త

నాగోల్ : కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రోహిత్ చౌదరి అన్నారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్, ఇంటర్నేషనల్ ఆర్యవైశ్య ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఉప్పల ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఉప్పల శ్రీనివాస గుప్త బుధవారం గాంధీభవన్‌లో కాంగ్రెస్‌లో చేరారు. అంతకుముందు ఆయన నాగోల్ డివిజన్‌లోని తన నివాసం నుంచి అభిమానులతో కలిసి ర్యాలీగా గాంధీభవన్‌కు చేరుకున్నారు. రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ మల్రెడ్డి రామిరెడ్డి, తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి కుమార్ రావుల ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్‌లో చేరారు. శ్రీనివాస గుప్తకు రోహిత్ చౌదరి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రోహిత్ చౌదరి మాట్లాడుతూ.. ఉప్పల శ్రీనివాస గుప్తకు కాంగ్రెస్ మంచి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలు అమలు పరిచిన ఘనత ఒక్క కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు. తెలంగాణలో 14 పార్లమెంట్ స్థానాల్లో విజయకేతనం ఎగుర వేస్తామని ధీమా వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని, కేంద్రంలో ఈ దఫా ఇందిరమ్మ పాలన రానున్నదని చెప్పారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీల పథకాల అమలు వల్లే కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపారు. రాష్ట్రంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ స్థాయిలో ఆర్యవైశ్యులను ఏకం చేసి, వారికి మేలు చేసేలా సోనియా గాంధీ, రాహుల్ గాంధీకి విన్నవిస్తామని తెలిపారు. తెలంగాణ యూత్ వైశ్య ఫెడరేషన్ అధ్యక్షుడు కట్టా రవికుమార్, ఐవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పబ్బా చంద్రశేఖర్, కటకం శ్రీనివాస్, నరేష్ గుప్తా, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సాంబు పాండు గుప్తా, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చింతల రజనీకాంత్, 33 జిల్లాల వైశ్య నాయకులు, ఉప్పల యువసేన నాయకులు, బీసీ, మైనార్టీ నాయకులు మహ్మద్, బాషా, ఆసీఫ్ సహా దాదాపు మూడు వందల మందికి పైగా కాంగ్రెస్ గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ టూరిజం అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి, సీనియర్ నాయకులు రామ్మోహన్ గౌడ్, కాంగ్రెస్ నాగోల్ డివిజన్ అధ్యక్షులు మంజులా రెడ్డి పాల్గొన్నారు.

ఓవైపు ఉక్కపోత..మరోవైపు వడదెబ్బ..

- 45 డిగ్రీలకు చేరువలో ఉష్ణోగ్రతలు
- మరో రెండు, మూడు డిగ్రీలు పెరిగే అవకాశం
- హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ
- ఎండకు తాళలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు
- పలు జిల్లాల్లో కురిసిన వర్షం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భానుడు భగభగ మండిపోతున్నాడు. మాడ పగలగొట్టేస్తున్నాడు. ఎండ దెబ్బకు ఓ పక్క వడగాల్పులు..మరోపక్క తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఇంట్లో ఫ్యాన్లు తిరుగుతున్నా...కూలర్ల మోత మోగుతున్నా వేడిగాల్పే వస్తున్నది. ఎన్ని నీళ్ల తాగినా గొంతు తడారట్లేదు. గాలిలో తేమ శాతం వేగంగా పడిపోతుండటంతో డీహైడ్రేషన్‌కు గురై నీరసపడిపోతున్నారు. రాష్ట్రంలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరువయ్యాయి. నల్లగొండ జిల్లా నిడమనూరులో అత్యధికంగా 44.8 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయింది. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఇదే అత్యధికం కావడం గమనార్హం. వచ్చే మూడు రోజులు కూడా ఎండలు దంచికొట్టే అవకాశముంది. రాష్ట్రంలో ఇప్పుడు నమోదవుతున్న దానికంటే రెండు, మూడు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశముందని హెచ్చరించింది. ఈ మేరకు అన్ని జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికను జారీ చేసింది. వడగాల్పులు వీచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వడగాల్పులు వీచే జాబితాలో కొమ్రంభీమ్ అసిఫాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, నిర్మల్, కరీంనగర్ జిల్లాలున్నాయి. జీహెచ్ఎంసీ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండే అవకాశముంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 41 నుంచి 42 డిగ్రీలు నమోదయ్యే అవకాశముంది. అయితే, ఆయా జిల్లాల్లో ఒకటెండ్రు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. బుధవారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో 29 ప్రాంతాల్లో వర్షపాతం నమోదైంది. కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా రెబ్బనలో అత్యధికంగా 4.03 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. సిద్ధిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం లకుడారంలో 2.65 సెంటీమీటర్ల వర్షం పడింది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు

నిడమనూరు(నల్లగొండ)	44.8 డిగ్రీలు
నల్లగొండ	44.7 డిగ్రీలు
నాంపల్లి(నల్లగొండ)	44.7 డిగ్రీలు
అయ్యగారిపల్లి(మహబూబాబాద్)	44.7 డిగ్రీలు
మునగాల(సూర్యాపేట)	44.7 డిగ్రీలు
గార్ల (మహబూబాబాద్)	44.7 డిగ్రీలు
అశ్వరావు పేట(భద్రాద్రి కొత్తగూడెం)	44.7 డిగ్రీలు
తిమ్మాపూర్(నల్లగొండ)	44.6 డిగ్రీలు
మరిపెడ(మహబూబాబాద్)	44.5 డిగ్రీలు
వెంకటాపురం(ములుగు)	44.5 డిగ్రీలు

ముంచెత్తిన వరదలు

యుఏఈ : యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లో ఎన్నడూలేనంతగా భారీ వరదలు ముంచెత్తాయి. ఒమన్‌లో కురిసిన ఎడతెరిపిలేని వానలకు 18 మంది మృతి చెందారు. మంగళవారం కురిసిన భారీ వర్షాలకు ప్రధాన రోడ్లు, వీధులన్నీ జల దిగ్బంధమయ్యాయి. భారీ వరదలకు దుబాయ్‌లోని రోడ్లపై వాహనాలు వరదలో చిక్కుకుపోయాయి. ఓవైపు వరదలు, మరోవైపు తీవ్రగాలుల కారణంగా దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు విమానాలను రద్దు చేశారు. యూఏఈలో పాఠశాలలన్నింటినీ మూసివేశారు. చాలా మంది ఉద్యోగులు, కార్మికులు ఇండ్ల వద్దే ఉండిపోయారు. వీధులు, రోడ్లపై ఉన్న వరద నీటిని ట్యాంకర్ల సహాయంతో తొలగిస్తున్నారు. మరోవైపు యూఏఈ పొరుగునున్న ఒమన్‌లో కూడా మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రధాన రోడ్లు, వీధులన్నీ నీటితో నిండిపోయాయి. ఈ భారీ వర్షాలకు పలువురు నీటిలో కొట్టుకుపోయారు. మరికొందరి ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉందని ఒమన్ అత్యవసర నిర్వహణ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. బహ్రెయిన్, ఖతార్, సౌదీ అరేబియా దేశాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి.

జువైనల్ హోం నుంచి చిన్నారులు జంప్..

- పారిపోయిన ఎనిమిది మంది



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

జువైనల్ హోం నుంచి ఎనిమిది మంది పిల్లలు తప్పించుకున్న ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సూరారం పోలీస్ స్టేషన్ పరిధి కైసర్‌నగర్‌లో జరిగింది. వివరాల్లోకెళ్తే.. మంగళ వారం రాత్రి జువైనల్ హోం తరగతి గది కిటికీ గ్రిల్స్‌ను తొలగించి ఓ బాలుడు పారిపోయాడు. అనంతరం అలాగే మరో ఏడుగురు పారిపోయారు. బుధవారం ఉదయం హోం నిర్వాహకులు సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. చుట్టుపక్కల సీసీటీవీ కెమెరాల ఆధారంగా పిల్లలు ఎటు వైపు వెళ్లారో తెలుసుకునే పనిలో ఉన్నారు. పారిపోయిన చిన్నారులు సయ్యద్ మైరాజ్ ఏ మెహ్రాజ్, షేక్ రెహాన్, సయ్యద్ ఆజం, సయ్యద్ సోహైల్, షేక్ అబ్దుల్ హక్ఏ ఇమ్రాన్, మొహమ్మద్ రెహాన్, మొహమ్మద్ హకీమ్, మొహమ్మద్ మహబూబ్ అని పోలీసులు తెలిపారు.

రేవంత్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్‌ది దూప్‌ఫైట్

- సర్వేలన్నీ మాకే అనుకూలం : డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్‌ల మధ్య దూప్‌ఫైట్ నడుస్తున్నదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఆ పార్టీల తీరును గమనిస్తున్నారనీ, తెలంగాణలో సైలెంట్ ఓటింగ్‌తో బీజేపీకి అధిక ఎంపీ స్థానాలు రాబోతున్నాయని చెప్పారు. తెలంగాణలో బీజేపీని ఓడగొట్టేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం, కమ్యూనిస్టులు ఏకం అయ్యారన్నారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ సాకుతో శ్రీరామనవమిని కాంగ్రెస్ పార్టీ రాజకీయ కోణంలో చూసిందని విమర్శించారు. సర్వేలన్నీ తమ పార్టీ వైపే ఉన్నాయనీ, కాంగ్రెస్ ముక్త్ భారత్ సాధ్యం కాబోతున్నదని చెప్పారు. 12 రాష్ట్రాల్లో కాంగ్రెస్ కు ఒక్క సీటు కూడా గెలవలేని పరిస్థితి ఉందన్నారు. కూటమిలో పార్టీలు కూడా కాంగ్రెస్‌ను నమ్మే పరిస్థితి లేదనీ, పంజాబ్, కేరళ, వెస్ట్ బెంగాల్, తమిళనాడులో ఇండియా కూటమిలోని పార్టీలు కాంగ్రెస్‌ను పట్టించుకోవడం లేదని చెప్పారు. దేశం మొత్తం మీద కూడా కాంగ్రెస్‌కు 40 సీట్లు రావని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ నేతల మధ్య ఆధిపత్యపోరుతో సీఎం రేవంత్‌రెడ్డి అభద్రతాభావంలోకి కూరుకుపోయారన్నారు. బీఆర్ఎస్-బీజేపీ ఒప్పందం వల్లనే కవితను అరెస్టు చేయడం లేదని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారం చేశారనీ, ఇప్పుడేమో ఆమె బెయిల్ కోసం బీజేపీ-బీఆర్ఎస్ కలిసి పనిచేస్తున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. కిషన్‌రెడ్డి ఈనెల 19న నామినేషన్ దాఖలు చేస్తారనీ, ఆ కార్యక్రమానికి రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు.



ముర్షిదాబాద్‌లో సలీంకే ప్రజల మద్దతు

- సీపీఐ(ఎం) నుంచి పోటీ
- బెంగాల్‌లో అత్యంత పోటీ గల నియోజకవర్గాల్లో ఇదొకటి
- కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు • టీఎంసీ, బీజేపీకి చెమటలు

ముర్షిదాబాద్ బెంగాల్‌లోని అత్యంత పోటీగల నియోజకవర్గాలలో ఒకటి. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం ఇక్కడి నుంచి పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో ఆయన విస్తృత ప్రచారం చేస్తున్నారు. సలీంకు కాంగ్రెస్ సైతం సంపూర్ణ మద్దతు ప్రకటించింది. దీంతో టీఎంసీ, బీజేపీ పార్టీలకు చెమటలు పడుతున్నాయి.

బ్రిటిష్ పాలనకు ముందు ముర్షిదాబాద్ గ్రేటర్ బెంగాల్ రాజధాని. బ్రిటిష్ వారిని వణికించిన సిరాజ్ ఉద్ దౌలాతో సహా నవాబులే పాలకులు. అనేక స్మారక కట్టడాలతో కూడిన చారిత్రక భూమి మత సామరస్యానికి కూడా అనుకూలంగా ఉంటుంది. 65 శాతం ముస్లిం మైనారిటీ కమ్యూనిటీలతో ఈ ప్రాంతం మత సామరస్యానికి ప్రతిరూపం. మెజారిటీ రైతులే. బీడీ పరిశ్రమకు, హస్తకళలకు ప్రసిద్ధి. ఈ ప్రాంతం చాలా కాలంగా కమ్యూనిస్టు ఉద్యమాలకు బలమైన పునాది. పలుమార్లు ఇక్కడ కమ్యూనిస్టులు గెలిచారు. తృణమూల్ పాలన అణచివేతలను తట్టుకుని, సీపీఐ(ఎం) బలమైన పునరాగమనం చేస్తోంది. సలీం అభ్యర్థిత్వం అందుకు పెద్ద మేల్కొలుపు.

దేశ మనుగడ కోసం వామపక్ష లౌకిక శక్తులను గెలిపించేందుకు ద్వేషపూరిత రాజకీయాలకు ప్రతిరూపమైన బీజేపీని, తణమూల్‌ను ఓడించాల్సిన అవసరాన్ని సీపీఐ(ఎం) అభ్యర్థి ఎండీ సలీం వివరించారు. మహిళలు, యువకులు కూడా పెద్ద ఎత్తున ఎన్నికల సభలకు తరలిరావడం ఉత్కంఠ రేపుతోంది. 2014 వరకు నిరంతరంగా సీపీఐ(ఎం) గెలిచిన ఈ నియోజకవర్గాన్ని 2019లో తృణమూల్ గెలుచుకుంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లోనూ తృణమూల్‌దే పైచేయి. అయితే, 2023లో పంచాయతీ ఎన్నికల్లో విస్తృత హింసను ఎదుర్కొన్న లెఫ్ట్ ఫ్రంట్, కాంగ్రెస్ బలమైన పునరాగమనం చేశాయి.




ముర్షిదాబాద్‌లోని రాణి నగర్ సారవంతమైనది. వరి, జనపనారతో నిండిన పొలాలు. పొలాల్లో ఎక్కడ చూసినా నాగలి దున్నే, ఎరువు చల్లే రైతులతో అరటి, మునగ పంటలు కనిపిస్తాయి. ఇది రాజకీయంగా కూడా చురుకైన ప్రాంతం. గ్రామాల్లో ఇళ్ల గోడలపై రాజకీయ పార్టీల చిహ్నాలు ఉన్నాయి. సీపీఐ(ఎం) ఎన్నికల గుర్తు సుత్తి, కొడవలి నక్షత్రం ఎక్కువగా గోడలపై కనబడుతుంది. ముర్షిదాబాద్ లోక్‌సభ నియోజకవర్గ లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థి ముహమ్మద్ సలీమ్ పర్యటనతో రాణినగర్ మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. సలీం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు మక్తపాడు గ్రామానికి చేరుకోగా.. మహిళలు, చిన్నారులు సహా వందలాది మంది ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కొన్ని మాటల్లో వారికి కృతజ్ఞతలు తెలిపిన సలీం సమీపంలోని రెండు మూడు ఇండ్లకు వెళ్లి వద్ధ తల్లులను కలుసుకుని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ముందుకు సాగిన కాన్వాయ్‌లో ద్విచక్ర వాహనాలు, ఎలక్ట్రిక్ ఆటోలు బారులు తీరాయి. గ్రామీణ రహదారులపై పూల వర్షం కురిపిస్తూ చేతులు ఊపుతూ శుభాకాంక్షలు తెలిపారు. నిర్దేశిత రిసెప్షన్ సెంటర్లతో పాటు, రోడ్లపై బైక్‌పై సలీం గ్రామస్తులను పలకరించారు. లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా మెరిసిన రాష్ట్ర మాజీ మంత్రి సలీం అందరికీ సుపరిచితమే. డీవైఎఫ్ఐ నాయకుడిగా ఉన్నప్పటి నుంచి సలీం చేసిన పోరాటాలను ఈ ప్రాంతం కూడా చూసింది. పల్లెల నుంచి పట్టణాలకు చేరుకునే సరికి ఈ యాత్ర పెద్ద ఊరేగింపుగా మారింది. సంగీత బృందాలతో పాటు, కార్యకర్తలు సైకిళ్లపై, కాలినడకన ప్రయాణించారు. దారి పొడవునా స్వాగతాలను అందుకోవాల్సినందున ప్రజలు అనుకున్న దానికంటే ఆలస్యంగా వచ్చినప్పటికీ ఆయన వేచి ఉన్నారు. చిన్న చిన్న ప్రసంగాలలో సలీం టీఎంసీ, బీజేపీని ఎండగడుతున్నప్పుడు ఏకధాటిగా చప్పట్లు మార్మోగాయి. బెంగాల్ నుంచి ఎర్రజెండాను పంపించాలని పిలుపునిచ్చిన వారు అవినీతిలో కూరుకుపోయారని ఆయన ఎత్తిచూపారని పేర్కొన్నారు.

2014లో చిన్న రైతులు, కూలీలు ఎక్కువగా ఉండే ముర్షిదాబాద్‌లో సీపీఐ(ఎం) చెందిన బదరు దోసాఖాన్ విజయం సాధించారు. గత సారి టీఎంసీ అభ్యర్థి అబూ తాహిర్ ఖాన్ గెలిచారు. ఈసారి కూడా తాహిర్ ఖాన్ టీఎంసీ అభ్యర్థి. బీజేపీ అభ్యర్థి గౌరీ శంకర్ ఘోష్. అయితే సీపీఐ(ఎం), టీఎంసీ మధ్యే ప్రధాన పోటీ ఉంది. ముర్షిదాబాద్ 15 లక్షల మంది ఓటర్లతో అత్యధిక జనాభా కలిగిన నియోజకవర్గం. జాతీయోద్యమంలో మరువలేని పాత్ర పోషించిన ముర్షిదాబాద్ లౌకికవాదాన్ని, పోరాట పటిమను కాపాడుకునేందుకు సిద్ధమవుతోంది.

రసవత్తరంగా బెంగాల్ రాజకీయం

దీదీ, మోడీ ప్రభుత్వాలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

- పుంజుకుంటున్న వామపక్షాలు • బలోపేతమైన ఇండియా ఫోరం



– జె.జగదీష్, నవతెలంగాణ

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ బెంగాల్‌లో రాజకీయాలు ఈ సారి రసవత్తరంగా మారనున్నాయి. మోడీ నియంతృత్వ పోకడలకు, మమతా బెనర్జీ అహంకార ధోరణులకు వ్యతిరేకంగా ఇండియా ఫోరం పోరాటం కానుంది. కుంభకోణాలు, అరాచక విధానాలు, ప్రభుత్వ వ్యతిరేకతతో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టీఎంసీ, బీజేపీ, కమ్యూనిస్ట్‌– కాంగ్రెస్ ఫోరం మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. మమతా బెనర్జీ, బీజేపీకి ఈసారి పార్లమెంటు ఎన్నికలు నల్లేరుపై నడక కాదు. 2019లో 22 నియోజకవర్గాల్లో నెగ్గిన తృణమూల్ కాంగ్రెస్, 18 స్థానాల్లో గెలిచిన బీజేపీకి ఈసారి సగం స్థానాలైనా నెగ్గుతాయన్నది అనుమానమే. వరుస స్కామ్‌లు, స్కామ్‌లలో చిక్కినవారిని రక్షించే వైఖరి, నార్త్ 24 పరగణాల జిల్లా సందేశ్ ఖలీలో భూకబ్జాలు, మహిళలపై లైంగికదాడులకు పాల్పడ్డ షాజహాన్ షేక్ ను రక్షించేందుకు చేసిన యత్నాలు, ప్రజల్లో టీఎంసీ ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత తెచ్చిపెట్టాయి. అలాగే ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతు సమస్యలు, సీఏఏ వంటి వాటివల్ల మోడీ సర్కార్ తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకుంది. బెంగాల్‌లో బీజేపీ కుల, మత విభజనకు పాల్పడుతోంది. అక్కడ ప్రజాస్వామ్య వాతావరణాన్ని ధ్వంసం చేస్తూ ప్రజలు ఐక్యంగా ఉండకుండా విభజనను సృష్టించింది.

ఏ పార్టీ, ఎన్ని సీట్లలో పోటీ?

పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ, బీజేపీ ఒంటరిగానే బరిలోకి దిగాయి. అప్పటి వరకు ఇండియా ఫోరంతో కలిసి నడిచిన మమతా బెనర్జీ, చివరి నిమిషంలో ఒంటరిగా పోటీకి సిద్ధమైంది. బీజేపీ కూడా ఒంటరి పోరుకే సిద్ధపడింది. ఇండియా ఫోరంలో భాగంగా సీపీఐ(ఎం), కాంగ్రెస్, సీపీఐ, ఆర్ఎస్పీ, ఫార్వర్డ్ బ్లాక్ పార్టీలు పోటీ చేస్తున్నాయి. టీఎంసీ, బీజేపీలు 42 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇండియా ఫోరం పార్టీల్లో సీపీఐ(ఎం) 23, కాంగ్రెస్ 12, ఆర్ఎస్పీ 3, సీపీఐ, ఫార్వర్డ్ బ్లాకు చెరో రెండు స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ పేరుతో ముస్లింలు ప్రత్యేకగా 42 సీట్లకు పోటీ పడుతున్నారు. దీంతో పలు చోట్ల త్రిముఖ పోటీలు, చతుర్ముఖ పోటీలు జరిగే అవకాశం ఉంది. 2019లో మొత్తం 42 లోక్‌సభ స్థానాల్లో 22 టీఎంసీ, 18 బీజేపీ, 2 కాంగ్రెస్ గెలిచాయి.

రాష్ట్ర రాజధాని కలకత్తాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఐ(ఎం) అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. సీపీఐ(ఎం) తరపున ఈసారి ఎక్కువ మంది యువకులు పోటీ చేస్తున్నారు. విద్యార్థి, యువజన నాయకులు, న్యాయవాది, ఉపాధ్యాయ రంగాల నేతలు సీపీఐ(ఎం) తరపున బరిలో ఉన్నారు. సీపీఐ(ఎం) పోటీ చేసే 23 స్థానాల్లో 20 మంది అభ్యర్థులు 45 ఏండ్ల లోపు వారే. వామపక్షాల అభ్యర్థులు ప్రధానంగా ఎన్నికల బాండ్లు, రాష్ట్రంలోని టీఎంసీ ప్రభుత్వ అవినీతి, మతోన్మాదం వంటి అంశాలతోపాటూ స్థానికంగా సంచలనం కలిగించిన సందేశ్‌ఖలి అంశాలపై ఉధృతంగా ప్రచారం సాగిస్తున్నారు. సీపీఐ(ఎం) నేత సుజన్ చక్రవర్తి డమ్‌డమ్ నుండి పోటీ చేస్తున్నారు. ఈ ప్రాంత కార్మికుల దుస్థితి గురించి బాగా అర్థం చేసుకున్న చక్రవర్తి ఈసారి తన గెలుపునకు అవకాశాలు బాగుంటాయని ఆశిస్తున్నారు. జాదవ్‌పూర్ నుండి వామపక్ష అభ్యర్థిగా బరిలోకి దిగిన సృజన్ భట్టాచార్య ముర్షిదాబాద్ నుంచి మహ్మద్ సలీంలు కూడా స్థానిక సమస్యలతోపాటూ సందేశ్‌ఖలిపై ప్రధానంగా ప్రచారం చేస్తున్నారు. సీపీఐ(ఎం) తరపున మీనక్షి ముఖర్జీ, శత్రూప్ ఘోష్, అభాస్ రాయ్ చౌదరి, ఎండి సలీంలు ప్రచారం చేస్తున్నారు.

పుంజుకున్న సీపీఐ(ఎం), వామపక్షాలు

పశ్చిమ బెంగాల్‌లో సీపీఐ(ఎం), వామపక్షాలు పుంజుకున్నాయి. రాష్ట్ర ఆందోళనలు, క్షేత్రస్థాయి పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టిన సీపీఐ(ఎం) అందుకను గుణంగా కార్యాచరణలోకి వెళ్లింది. గ్రామ స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించింది. రాష్ట్ర స్థాయి నేతలు క్షేత్ర స్థాయికి వెళ్లి ఆందోళనల్లో పాల్గొనేవారు. ఇటీవల కాలం రాష్ట్ర రాజకీయాల్లో యువజన సంఘం కీలక పాత్ర పోషించింది. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 50 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలను కలుపుతూ మూడు వేల కిలోమీటర్ల మేర "ఇన్సాఫ్" యాత్ర జరిగింది. ఈ యాత్రలో 12 లక్షల మంది ప్రజలు భాగస్వామ్య మయ్యారు. అనంతరం కలకత్తాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో జస్టిస్ ర్యాలీ నిర్వహించారు. దీంతో ఒక్కసారిగా బెంగాల్‌లో సీపీఐ(ఎం), వామపక్షాల పాత్రపై మీడియాలో చర్చనీయాంశమైంది.



సామాజిక సమీకరణలు

పశ్చిమ బెంగాల్‌లో అన్ని సామాజిక వర్గాలు బలంగా ఉన్నాయి. అక్కడ మైనార్టీలు కూడా బలమైన ప్రజా సమూహంగా ఉన్నారు. అయితే బీజేపీ మతోన్మాద చర్యలతో రాజకీయ పబ్బం గడుపుకోవడానికి తీవ్రమైన కుట్ర పన్నుతోంది. మైనార్టీలకు వ్యతిరేకంగా మెజార్టీలను ఉసుగొల్పుతుంది. సీపీఐ(ఎం) నేతృత్వంలో 34 ఏండ్ల సుదీర్ఘ వామపక్ష ప్రభుత్వం హయాంలో మత హింసకు చోటు లేదు. మమతా బెనర్జీ వచ్చిన తరువాత, రాష్ట్రంలో బీజేపీకి అవకాశం కల్పించింది. దీంతో బీజేపీ మెజారిటీ మత రాజకీయాలకు పాల్పడితే, మమతా బెనర్జీ మైనార్టీ మత రాజకీయాలకు పాల్పడుతోంది. ఫలితంగా హింస, తగాదాలు, దాడులు పరస్పరం పెరిగిపోతున్నాయి. రాష్ట్రంలో మత సామరస్యం మంటగలుస్తోంది. ఈ రెండు పార్టీల మత రాజకీయాలను వ్యతిరేకంగా సీపీఐ(ఎం), వామపక్షాలు పోరాడుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ఒబిసి 17 –20 శాతం, ఒసి 15–18 శాతం, ఎస్సీలు 23.51 శాతం, ఎస్టీలు 5.8 శాతం, ముస్లింలు 30 శాతం సామాజిక వర్గాల ప్రజలు ఉన్నారు. ఎస్సీలో మూడు ప్రధాన ఉప కులాలు రాజబన్షి 18.4 శాతం, నామసుద్ర 17.4 శాతం, బగ్ది 14.9 శాతం ఉన్నారు. ఎస్సీల్లో 90 శాతం బంగ్లాదేశ్ మూలాలు ఉన్నవారే. అందుకే బీజేపీ సీఏఏ తెచ్చి లాభపడింది. పెద్ద నగరాల్లో ఆధిపత్యం చెలాయించే బ్రాహ్మణ, వైద్య, కృష్ణ అగ్రకులాలు 15 నుండి 18 శాతం ఉన్నారు. వీరిలో మతం పేరుతో బీజేపీ చొరబడింది.

మొత్తం ఓట్లు- 7,58,37,778
మహిళలు - 3,73,04,960
పురుషులు - 3,85,32,818
మొత్తం లోక్‌సభ స్థానాలు- 42

ప్రధాన సమస్యలు

పశ్చిమ బెంగాల్‌లో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన అంశాలు పౌరసత్వం సవరణ చట్టం, జూట్ మిల్లు కార్మికులు, జూట్ సాగు రైతుల సమస్యలు, ధరల పెరుగుదల, ఇతర సమస్యలు ఉన్నాయి. లక్షలాది మందికి ఉపాధి కల్పించిన జూట్ మిల్లులు, జూట్ సాగు రైతులు ప్రస్తుతం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో పెరిగిపోతున్న శాంతి భద్రతల సమస్య పట్ల సామాన్య జనం తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. మమతా బెనర్జీ పరిస్థితిని అదుపు చేయలేయడం లేదని కాంగ్రెస్, వామపక్షాలు విమర్శిస్తున్నాయి.

ఏడు దశల్లో పోలింగ్

లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమ బెంగాల్‌లోని 42 సీట్లకు ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకూ ఏడు దశల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. అలాగే భగబంగోలా, బారా నగర్ అసెంబ్లీ నియోజకవర్గాలకు మే7న, జూన్ 1న ఉప ఎన్నికలు జరుగుతాయి. ఎంపీ ఎన్నికలు తొలిదశలో ఏప్రిల్ 19న కూచ్ బెహర్, అలీపు ర్దువార్స్, జల్పాయిగురి స్థానాలకు జరుగుతాయి. ఏప్రిల్ 26న డార్జిలింగ్, రాయ్ గంజ్, బాలూర్ ఘాట్, స్థానాలకు, మే 7న మూడో దశలో మాల్దా ఉత్తర్, మాల్దా దక్షిణ్, జంగిపూర్, ముర్షిదాబాద్ నియోజకవర్గాలకు పోలింగ్ జరుగుతుంది. నాలుగో దశలో మే 13న బహరాంపూర్, కృష్ణానగర్, రాణాఘాట్, బర్ధమాన్ పుర్బా, బుర్ద్వాన్–దుర్గాపూర్, అసన్సోల్, బోల్పూర్, బీర్భూమ్ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఐదో దశలో మే 20న బంగావ్, బరాక్పూర్, హౌరా, ఉలుబేరియా, శ్రీరాంపూర్, హుగ్లీ, ఆరాంబాగ్ నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. మే 26న ఆరో దశలో తుమ్లుక్ , కాంతి, ఘటాల్, ఝుర్ గామ్, మేదినీ పూర్, పురూలియా, బంకూరా, బిష్ణుపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరుగుతాయి. జూన్ 1న చివరి దశలో డమ్ డమ్, బరాసత్, బసిర్హాట్, జయనగర్, మధురాపూర్, డైమండ్ హార్బర్, జాదవ్ పూర్, కోల్కతా దక్షిణ్, కల్‌కత్తా ఉత్తర నియోజకవర్గాలకు పోలింగ్‌తో ఎన్నికలు పూర్తి అవుతాయి.

సీన్ రిపీట్!

- ఇప్పుడు కూడా అందరికన్నా ముందే.. • ఈ సారైనా వ్యూహం ఫలించేనా..?
- నేడు బీఆర్ఎస్ అభ్యర్థులకు బీఫాంల అందజేత
- ఒక్కో అభ్యర్థికి రూ.95 లక్షల చెక్కును ఇవ్వనున్న కేసీఆర్ • బస్సు యాత్రకు ప్రణాళిక
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ అభ్యర్థులకు దిశా నిర్దేశం చేయనున్న గులాబీ బాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మొన్నటి అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి దాదాపు మూణ్నెల్ల ముందే అభ్యర్థులను ప్రకటించి, అన్ని పార్టీల కంటే ముందే బీఫాంలను అందజేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్... ఈసారి కూడా అదే వ్యూహాన్ని అనుసరించబోతున్నారు. తద్వారా పార్టీ తరపున పోటీ చేయబోయే ఎంపీ అభ్యర్థుల్లో ఆయన జోష్‌ను నింపనున్నారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకంటే ఒకడుగు ముందుకేసి అందరికంటే ముందుగానే బీఫాంలను అందజేయనుండటం గమనార్హం. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాబోతున్న తరుణంలో సైతం అధికార కాంగ్రెస్ అభ్యర్థుల విషయంలో డైలమాలో ఉంది. ఇంకా మూడు స్థానాలకు ఆ పార్టీ అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. రాష్ట్రంలోని 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ... ఒకట్రెండు స్థానాల్లో వారిని మార్చేందుకు నానా తంటాలూ పడుతోంది. ఈ రెండు పార్టీల పరిస్థితి ఈ విధంగా ఉంటే... కేసీఆర్ మాత్రం గురువారం తన పార్టీ అభ్యర్థులకు ఏకంగా బీఫాంలనే అందజేయనుండటం గమనార్హం. వాటితోపాటు ఎన్నికల ఖర్చుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.95 లక్షల చెక్కును పార్టీ తరపున ఆయన ఇవ్వనున్నారు. ఇదే సమయంలో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొనేందుకు వీలుగా తన రాష్ట్రవ్యాప్త పర్యటనల నిమిత్తం బస్సు యాత్రకు సంబంధించిన రూట్‌మ్యాప్‌ను, సంబంధిత ప్రణాళికను ఆయన విడుదల చేయనున్నారు.

గురువారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులు, లోక్‌సభ అభ్యర్థులతో భేటీ కానున్న ఆయన... ఎంపీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలను, ప్రచారం చేయాల్సి తీరును వివరించనున్నారు. అధికార కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజలకు ఎలా విడమరిచి చెప్పాలనే విషయమై ఆయన వారికి దిశా నిర్దేశం చేయనున్నారు. కాగా లోక్‌సభ ఎన్నికల టిక్కెట్లు ఇచ్చిన తర్వాత కూడా పలువురు నేతలు బీఆర్ఎస్‌కు హ్యాండిచ్చిన సంగతి విదితమే. వీరిలో కడియం శ్రీహరి, గడ్డం రంజిత్ రెడ్డి, కే.కేశవరావు తదితర సీనియర్లు కూడా ఉన్నారు. వీరితోపాటు ఖైరతాబాద్, భద్రాచలం ఎమ్మెల్యేలు దానం నాగేందర్, తెల్లం వెంకటరావు, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తదితరులు కూడా పార్టీని వీడారు. హైదరాబాద్ నగరంలో కీలక నాయకుడైన మాజీ మంత్రి మల్లారెడ్డి లాంటి వారు సైతం సైలెంటయిపోయారు. ఈ నేపథ్యంలో కారు పార్టీలో నైరాశ్యం నెలకొంది. దీన్ని పోగొట్టి, క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపేందుకు కేసీఆర్ పలు వ్యూహాలు రచించారు. అందులో భాగంగానే నిన్నటి వరకూ ఎండిన పంట పొలాల పరిశీలన పేరుతో జిల్లాల్లో పర్యటించిన ఆయన... ఇప్పుడు అన్ని పార్టీల కొంటే ముందుగా బీఫాంలను అందజేయటం ద్వారా నాయకులు, కార్యకర్తల్లో జోష్‌ను నింపేందుకు ప్రయత్నిస్తున్నారని బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వని ఆయన వ్యూహం... మరి లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి రిజల్ట్‌ను ఇవ్వబోతుందో చూడాలి.



చట్టవిరుద్ధంగా వైట్ పెట్రోలియం జెల్లీ తయారీ

- జ్వరానికి మందులంటూ తప్పుడు ప్రచారం
- డీసీఏ దాడుల్లో వెల్లడి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డ్రగ్ కంట్రోల్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. కల్తీ మందులు లేని రాష్ట్రమే తమ లక్ష్యమంటూ కొన్ని నెలలుగా నిర్వహిస్తున్న దాడుల్లో ప్రతి రోజు రాష్ట్రంలో ఏదో ఒక చోట చట్టవిరుద్ధ కార్యకలాపాలు వెలుగు చూస్తున్నాయి. కుత్బుల్లాపూర్ పేట్ బషీర్‌బాద్ లోని ఒక మెడికల్ షాప్‌పై దాడి చేయగా ప్యూర్‌లైన్ పేరుతో వైట్ పెట్రోలియం జెల్లీని అమ్ముతున్నట్టు బయటపడింది. దీంతో లేబర్ లేకుండా దీన్ని తయారు చేస్తున్న హైదరాబాద్ శివరాంపల్లిలోని జూబిలెంట్ కాస్మోస్యూటికల్స్‌పై దాడి చేసి నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. జ్వరం తగ్గిస్తుందంటూ తప్పుడు ప్రచారంతో అమ్ముతున్న అల్టాకోస్ట్ సస్పెన్షన్ మందును రంగారెడ్డి జిల్లా, రాజేంద్రనగర్ మండలం, అత్తాపూర్ మెడికల్ షాపులో కనుగొన్నారు. దీన్ని హిమాచల్ ప్రదేశ్ సిర్మోర్ కాలా అంబ్‌లో కండౌర్ ఫార్మాస్యూటికల్స్ తయారు చేస్తుండగా, బెంగుళూరుకు చెందిన అట్లావిస్టా హెల్త్ కేర్ ప్రయివేట్ లిమిటెడ్ మార్కెటింగ్ చేస్తున్నది. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి తెలిపారు.



ఊరు బాగుంటేనే దేశం బాగుంటుంది

- సీతారాముల కల్యాణోత్సవంలో కేటీఆర్

నవతెలంగాణ - కూకట్‌పల్లి

దేవాలయం బాగుంటే ఊరు బాగుంటుందని, ఊరు బాగుంటేనే దేశం బాగుంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కూకట్‌పల్లిలోని ప్రముఖ, ప్రాచీన రామాలయంలో బుధవారం జరిగిన సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవంలో కేటీఆర్ పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 439 ఏండ్ల చరిత్ర గల ఈ రామాలయాన్ని ఇంత అత్యద్భుతంగా గ్రామస్తుల సహకారంతో పున:నిర్మించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును అభినందిస్తున్నట్టు తెలిపారు. దేవాలయాలను కాపాడుకుని భావితరాలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్, శంభీపూర్ రాజు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

అదానీ డ్రోన్‌ల ఎగుమతే కారణం

ఇజ్రాయిల్‌పై మారిన భారత్ వైఖరి

- మొన్న తీర్మానానికి సమర్ధన... నిన్న గైర్హాజరు



న్యూఢిల్లీ : గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని, ఇజ్రాయిల్‌పై ఆయుధ నిషేధాన్ని విధించాలని ఈ నెల ఐదవ తేదీన ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల మండలి (యూఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఓ తీర్మానాన్ని ఆమోదించింది. దీనిపై జరిగిన ఓటింగుకు భారత్ సహా 13 దేశాలు గైర్హాజరు అయ్యాయి. గాజాలో తక్షణమే కాల్పుల విరమణ పాటించాలంటూ గత సంవత్సరం డిసెంబర్ 12న ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమర్ధించిన నరేంద్ర మోడీ ప్రభుత్వం, నాలుగు నెలల తర్వాత అదే తరహా తీర్మానంపై జరిగిన ఓటింగుకు దూరంగా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. గత డిసెంబరులో అనుసరించిన వైఖరికి ఇది పూర్తి భిన్నంగా ఉంది.



హైదరాబాద్ కంపెనీ నుండే...

ఇజ్రాయిల్‌పై ఆయుధ నిషేధమే భారత్ వైఖరిలో మార్పుకు కారణమని భావిస్తున్నారు. ఎందుకంటే ఇజ్రాయిల్‌కు మన దేశం ఆయుధాలు విక్రయిస్తోంది. గాజాలో ఇజ్రాయిల్ దళాలు సాగిస్తున్న దాష్టీకాలపై అంతర్జాతీయ సమాజం నుండి తీవ్రమైన విమర్శలు వస్తున్నప్పటికీ వాటిని పట్టించుకోకుండా ఆ దేశానికి ఆయుధాల విక్రయాన్ని కొనసాగించాలని మోడీ ప్రభుత్వం భావిస్తోంది. అదానీ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కంపెనీ, ఇజ్రాయిల్‌కు చెందిన ఎల్బిట్ సిస్టమ్స్ మధ్య సంయుక్త భాగస్వామ్యంలో హైదరాబాదులో నెలకొల్పిన అదానీ–ఎల్బిట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఇండియా లిమిటెడ్ సంస్థ ఇజ్రాయిల్‌కు 20 స్వదేశీ హెర్మెస్ 900 యూఏవీలు/డ్రోన్లను ఎగుమతి చేసిందని ఫిబ్రవరి మొదటి వారంలో దేశ విదేశాలలోని పలు మీడియా సంస్థలు వార్తలు అందించాయి. అయితే అటు ఇజ్రాయిల్ కానీ, ఇటు భారత్ కానీ దీనిని ధృవీకరించలేదు. లేదా ఖండించనూ లేదు. అయితే ఎగుమతులు జరిగిన విషయాన్ని అదానీ కార్పొరేట్ వర్గాలు ధృవీకరించాయి.

గమ్యస్థానం ఇజ్రాయిలే

తాము యూఏవీలు/డ్రోన్లను ఎగుమతి చేస్తున్న విషయాన్ని అదానీ కంపెనీ గతంలోనే తెలియజేసింది. హైదరాబాద్ కంపెనీని 2018 డిసెంబరులో ప్రారంభించారు. ఆ తర్వాత హెర్మెస్ 900 మానవ రహిత డ్రోన్లను అంతర్జాతీయ వినియోగదారులకు ఎగుమతి చేయడం కూడా మొదలు పెట్టారు. అయితే ఎన్నిసార్లు డ్రోన్లను ఎగుమతి చేశారు, ఏయే దేశాలకు ఎగుమతి చేశారు, ప్రతి ఎగుమతికి సంబంధించి ఏయే తేదీలలో లైసెన్స్ మంజూరైంది వంటి ప్రశ్నలకు అదానీ కంపెనీ నుండి సరైన సమాధానం లభించడం లేదు. యుద్ధ అవసరాలకు డ్రోన్లను విక్రయించడం లేదని కంపెనీ చెబుతున్నప్పటికీ దానిని పర్యవేక్షించే వ్యవస్థ ఏదీ లేదు. అదానీ వార్షిక నివేదికలను పరిశీలిస్తే డ్రోన్ల ఎగుమతికి ఇజ్రాయిల్ గమ్యస్థానంగా మారిందని మాత్రం స్పష్టమవుతోంది.

నవతెలంగాణ

నిరర్థకమైన శాంతికన్నా
ఉపయుక్తమైన పోరాటం మేలు - మాక్సింగోర్కి

గురువారం 18 ఏప్రిల్ 2024
www.navatelangana.com

సంపాదకీయం

విజయీభవ



యూపీఎస్సీ ఫలితాల్లో తెలుగు రాష్ట్రాల అభ్యర్థుల ప్రతిభ నింగికెగిసింది. ఏకంగా రెండో ర్యాంక్ సాధించడం ద్వారా మరోసారి తెలుగుజాతి కీర్తి పతాకానికెక్కింది. సుమారు అరవై మంది తెలుగు తేజాలు విజయబావుటాను ఎగురవేశారు. వారికి అభినందనలు. శుభాకాంక్షలు. వీరంతా ఐఏఎస్, ఐఎఫ్ఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ తదితర అఖిల భారత సర్వీసు(ఏఐఎస్)ల్లో సేవలందించ బోతున్నారు. ప్రజాసేవ చేయడానికే సివిల్స్‌ను ఎంపిక చేసుకున్నామని చెప్పడం మంచి పరిణామం. వెనుకబడిన ప్రాంతంగా పరిగణించే మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పలువురు అత్యుత్తమ ప్రతిభ కనపర్చడం సంతోషం కలిగిస్తున్నది. ఊతమిస్తే ఎంతవరకైనా ఎదుగుతామని చెప్పకనే చెప్పారు అభ్యర్థులంతా. ఆయా సామాజిక తరగతులకు చెందిన వీరు, భవిష్యత్ తరాలకు సేవలందించే అధికారిక ప్రతినిధులు. ఏఐఎస్ అధికారుల శక్తి, సామర్థ్యాలు, నైపుణ్యం సమాజానికి ఉపయోగపడాలి.

సరళీకృత ఆర్థిక విధా నాల అమలు నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయిల్ దేశాలతో ఒప్పందాల్లో భాగంగా ఇస్తున్న పరిపాలన, సైనిక శిక్షణతో ఏఐఎస్‌లను విధానపరంగానే విభిన్నంగా తయారు చేస్తున్నారు. పెట్టుబడిదారి విధా నాలను మస్తిష్కంలో నింపి క్షేత్రస్థాయిలో పేదలకు వ్యతిరేకంగా పనిచేయిస్తుండటం గమనార్హం. ఏఐఎస్ అనేది కెరీర్ ఆప్షనేకాదు, జాతికి సేవలందించగలిగే గురుతర బాధ్యత. లక్షల్లో జీతాలు, సమాజంలో గౌరవం అందుకునే వీరంతా, పేదల పక్షపాతులుగా ఉండాలి.

ప్రతియేటా యూపీఎస్సీ కేవలం 180 మంది ఏఐఎస్‌లను మాత్రమే ఎంపిక చేస్తుంది. వీరంతా అత్యంత ప్రతిభావంతులై ఉంటారు. అధికారాలను చెలాయించడమే వీరి అధికారం కాదు, దాన్ని ప్రజలు, పేదలు, అణగారిన తరగతుల ప్రయోజనాల కోసం వాడటం ప్రధానం. కీలకం కూడా. ప్రజాసేవ చేయాలంటే సమాజంపై విస్తృత అవగాహన ఉండాలి. సమస్యలపై లోతైన అధ్యయనమూ తప్పనిసరి. చట్టాలు, విధానాలకు మానవతా విలువలను జోడించి మంచి పరిపాలనను అందించడమే కర్తవ్యంగా భావించాలి. దేశంలో సివిల్ సర్వీసులకు చాలా ప్రాముఖ్యత ఉంది. అభివృద్ధిలో ఏఐఎస్‌ల పాత్ర గొప్పదనే చెప్పాలి. అయితే పరిస్థితులు మారుతున్నాయి. ఐఏఎస్‌ల్లోనూ అది చోటుచేసుకుంటున్నది. ప్రజాసేవ మసకబారి స్వయంసేవకు పూనుకుంటున్నారు. పాలకులు, కార్పొరేట్ల సేవలో తరిస్తున్నారు. విధానాల రూపకల్పనలోనే తప్పులు దొర్లుతున్నాయి. తద్వారా దేశాభివృద్ధి కుంటు పడుతున్నది. దీంతో ప్రజల తిరుగుబాటును చవిచూడాల్సి వస్తున్నది. పబ్లిక్ సర్వీసు నుంచి ప్రయివేటు సర్వీసుకు మళ్లుతున్న దుస్థితి కనిపిస్తున్నది.

కార్పొరేట్ల బాగోగులు కాకుండా అట్టడుగు స్థాయి మట్టి మనుషుల మనుగడపై దృష్టిపెట్టాలి. శిక్షణ నుంచే ఆ అభిమతాన్ని నరనరాల్లోనూ ఇమడ్చుకోవాలి. కొందరు చేసే దిగజారుడు పనులతో సాంతం వ్యవస్థ తు(త)ప్పు(న)పడుతున్నది. మోకాళ్ల మీద కూర్చుని దండాలు పెడుతూ, తమ ప్రాథమిక బాధ్యతను నిర్లక్ష్యం చేస్తున్న వైనాలు ఎన్నో. దీంతో సమాజ ఉద్ధరణ, ప్రజల జీవన ప్రమాణాల మెరుగు ప్రశ్నార్థకమవుతున్నది. కర్తవ్యాల నిర్వహణలో విఫలమవుతున్న పరిస్థితి. పైపెచ్చు సరళీకృత ఆర్థిక విధానాల అమలు నేపథ్యంలో అమెరికా, ఇజ్రాయిల్ దేశాలతో ఒప్పందాల్లో భాగంగా ఇస్తున్న పరిపాలన, సైనిక శిక్షణతో ఏఐఎస్‌లను విధానపరంగానే విభిన్నంగా తయారు చేస్తున్నారు.

పెట్టుబడిదారి విధానాలను మస్తిష్కంలో నింపి క్షేత్రస్థాయిలో పేదలకు వ్యతిరేకంగా పనిచేయిస్తుండటం గమనార్హం. ఏఐఎస్ అనేది కెరీర్ ఆప్షనేకాదు, జాతికి సేవలందించగలిగే గురుతర బాధ్యత. లక్షల్లో జీతాలు, సమాజంలో గౌరవం అందుకునే వీరంతా, పేదల పక్షపాతులుగా ఉండాలి. నిరుద్యోగులకు దారి చూపించాలి. బాధితులకు బాసటగా నిలవాలి. కాగా పదేండ్ల కిందటి ఉన్నతాధికారులు, ఇప్పటి వారికి తేడా స్పష్టంగా కనిపిస్తున్నది. సరైన విధానాలను రూపొందించి అమలు చేయడం ద్వారా పాలకులచేత కాకుండా ప్రజలచేత శభాష్ అనిపించుకోవాలి.


ఆ కోవకు చెందిన ఐఏఎస్ అధికారే ఎస్.ఆర్ శంకరన్. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం రూపకర్త. వెట్టిచాకిరి నిర్మూలన, అటవీ హక్కుల చట్టం, ఎస్సీ కార్పొరేషన్‌కు ఊపిరులూదిన ఐఏఎస్. 1984లో సాంఘిక సంక్షేమ గురుకులాల వ్యవస్థ ఏర్పాటులో, 2004లో ప్రభుత్వంతో మాట్లాడి మవోయిస్టులను చర్చలకు ఆహ్వానింపజేయడంలో ఆయనదే కీలకపాత్ర. ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో పనిచేసినప్పుడు ఆయన్ను అప్పటి ప్రభుత్వాలు బదిలీ చేయగా, అందుకు వ్యతిరేకంగా ప్రజలే ఆందోళన చేసిన పరిపాలనాదక్షుడు. ఆయన్ను ఐఏఎస్ గాంధీ అని పిలిచేవారు.

శంకరన్ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మవిభూషన్ పురస్కారానికి ఎంపిక చేసినా, సున్నితంగా తిరస్కరించిన గొప్పవ్యక్తి. నేటి ఐఏఎస్‌లు ఎస్ఆర్ శంకరన్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి. ఆ బాటలో నడవాలి. పేదల కోసం ఎంతటి త్యాగాలకైనా వెనుతిరగని వ్యక్తిత్వాన్ని ఒంటపట్టించు కోవాలి. అప్పుడే తమ లక్ష్యమైన ప్రజాసేవ చేయాలనే సంకల్పం నేరవేరుతుంది. విజయీభవ.

రైతుల రక్షణకు మద్దతు ధరల చట్టమే మార్గం



సారంపల్లి మల్లారెడ్డి
9490098666



వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరల అమలుకు పార్లమెంటులో చట్టం చేయాలని జూన్ 5, 2020 నుంచి రైతులు, రైతు సంఘాలు ఢిల్లీలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. లక్షల మందిని సమీకరించి నెలల తరబడి పోరాటం చేశారు. 11 మాసాల పోరాటం తర్వాత నవంబర్, 2021న ప్రధాని మోడీ మద్దతు ధరలకు పార్లమెంటులో చట్టం తెస్తానని సంయుక్త కిసాన్ మోర్చ నాయకులకు లిఖిత పూర్వక హామీనిచ్చారు. అయినా నేటికీ అమలు జరుపలేదు. 2024 ఫిబ్రవరి నుంచి పోరాటం కొనసాగుతున్నది. ఫిబ్రవరి 16న భారత్ గ్రామీణ బంద్ విజయవంతంగా అమలు చేశారు. అయినా మోడీ ప్రభుత్వం పార్లమెంటులో సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు ప్రవేశపెట్టిన మద్దతు ధరల బిల్లును చట్టంగా రూపొందించడానికి అంగీకరించడం లేదు. మార్చి, 14న దేశవ్యాపితంగా నిరసన ప్రదర్శనలలో లక్షల మంది రైతులు పాల్గొన్నారు.

మద్దతు ధరల చట్టం తెస్తే బడ్జెట్ పై భారం పడుతుందని, కావున నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతాయని, ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతుం దని ప్రధాని మోడీ అతని అనుచరగణ మంత్రివర్గం ప్రచారం చేస్తుంది. కొంత మంది కుహానా ఆర్థికవేత్తలు ఈ చట్టం అమలు చేయడానికి నిధులు కేటాయించాలని కోరుతున్నారు. ఇవేవీ వాస్తవాలు కావు. ఆర్థిక విధానాలు తెలిసిన వారెవరైనా పై వాదనలను తిరస్కరిస్తారు. తమ పంటలకు గిట్టుబాటు ధరలు లేక, పెట్టిన పెట్టుబడులు రాక రుణగ్రస్తులై నేటికి 13 రాష్ట్రాల్లో యేటా 13వేల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతు న్నారు. ఆత్మహత్యల నివారణకు మద్దతు ధరలను గ్యారెంటీ చేస్తూ పార్లమెంటులో చట్టం చేయడం ఒకటే మార్గం.

2014లో అధికారానికి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మొదట మద్దతు ధరలను అమలు జరుపలేమని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసింది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ స్వామినాథన్ సిఫారసులను అమలు చేసి, మద్దతు ధరలను నిర్ణయిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ఉత్పత్తి వ్యయంపై 50శాతం ధరలు నిర్ణయిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి దానికి 50శాతం కలుపుతున్నారు. పారిశ్రామిక సరుకులకు ధరలు నిర్ణయించే విధానాన్ని వ్యవసాయ ఉత్పత్తులకు వర్తింపజేయలేదు. ఉత్పత్తి వ్యయంలో ఉపకరణాల ధరలు (విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యాంత్రీకరణ పెట్టుబడులు) కుటుంబ శ్రమను మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు.

మద్దతు ధరలు ఎలా వచ్చాయి?

1964లో ప్రారంభంలో మొదలైన హరిత విప్లవ కాలం నుంచి 1982 వరకు వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధరలు లభించాయి. ప్రభుత్వం రాయితీల ద్వారా సంకరజాతి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు గ్రామీణస్థాయి వరకు సరఫరా చేయడమేకాక, మార్కెట్లలో పోటీవల్ల కనీస గిట్టుబాటు ధరలు లభించాయి. 1984లో దేశం వ్యవసాయ ఉత్పత్తులలో స్వయం పోషకత్వమేకాక ఎగుమతులు చేసే దశకు చేరుకున్నాము. యేటా రెండు కోట్ల టన్నుల బియ్యం, గోదుమలు, పంచదారతో పాటు మిరప, పసుపు, పత్తి ఎగుమతులు చేశాము. ఆ పరిస్థితులలో దేశీయ కార్పొరేట్ సంస్థలు, మధ్యదళారీలు ప్రభుత్వాలతో కుమ్మక్కై మార్కెటల్లలో ధరలను 40శాతానికి పైగా తగ్గించారు. దేశవ్యాపితంగా జరిగిన రైతాంగ ఆందోళనల ఫలితంగా అంతకు ముందున్న మద్దతు ధరల చట్టాన్ని పునరుద్ధరించి ఆహార పంటలకు ఉత్పత్తివ్యయం ఆధారంగా ధరలు నిర్ణయించడానికి " ధరల నిర్ణాయక కమిషన్ " (సిఎసిపి)ను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఆ కమిషన్ రాష్ట్రాల నుంచి వ్యవసాయ పెట్టుబడులను, ఉత్పత్తి సమాచారాన్ని సేకరించి మద్దతు ధరలకు కేంద్ర ప్రభుత్వానికి రికమండేషన్ చేసింది. ఆ కమిషన్ రికమండేషన్ ప్రకారం కాకుండా కొంత మొత్తం పెంచి పంటలకు ధరలను నిర్ణయించింది. తర్వాత క్రమంగా 23 పంటలకు ధరలు నిర్ణయించారు. కానీ, ఆ ధరలు శాస్త్రీయంగా లేకపోవడంతో దేశవ్యాపితంగా పెద్దఎత్తున ఆందోళనలు సాగాయి. హరిత విప్లవ పితామహులు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్ మద్దతు ధరలకు ఒక సూత్రీకరణ చేశారు. దానిప్రకారం ఉత్పత్తి వ్యయంపై 50శాతం కలిపి ధరలు నిర్ణయించాలని సలహా ఇచ్చారు.

2014లో అధికారానికి వచ్చిన బీజేపీ ప్రభుత్వం మొదట మద్దతు ధరలను అమలు జరుపలేమని సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేసింది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ స్వామినాథన్ సిఫారసులను అమలు చేసి, మద్దతు ధరలను నిర్ణయిస్తామని ప్రకటించింది. ప్రస్తుతం ఉత్పత్తి వ్యయంపై 50శాతం ధరలు నిర్ణయిస్తున్నట్లు ప్రచారం చేస్తున్నారు. వాస్తవానికి ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించి దానికి 50శాతం కలుపుతున్నారు. పారిశ్రామిక సరుకులకు ధరలు నిర్ణయించే విధానాన్ని వ్యవసాయ ఉత్పత్తులకు వర్తింపజేయలేదు. ఉత్పత్తి వ్యయంలో ఉపకరణాల ధరలు (విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు, యాంత్రీకరణ పెట్టుబడులు) కుటుంబ శ్రమను మాత్రమే పరిగణలోకి తీసుకుంటున్నారు. భూమిపై పెట్టిన పెట్టుబడి అనగా బోర్లు, కరెంటు పంపులు, పైపులైన్లు తదితర నిర్మాణాలకు తెచ్చిన అప్పుపై వడ్డీ, ఆ నిర్మాణాల అరుగుదల ఉత్పత్తి ఖర్చుల్లోకి తీసుకోవడం లేదు. అందువల్ల కేంద్రం నిర్ణయించే కనీస మద్దతు దర తక్కువగా నిర్ణయించడం జరిగింది. సిఎసిపి ఉత్పత్తి ధరలను నిర్ణయించడానికి ఎ2, బి2, సి2 సూత్రాలను రూపొందించింది. కానీ, ఆ విధానాలతో ఉత్పత్తి వ్యయాన్ని నిర్ణయించనుంది. మద్దతు ధరల చట్టం తెస్తే అనివార్యంగా ఈ సూత్రా లను అమలు చేయాల్సి ఉంటుంది. ఉత్పత్తి వ్యయం పెరగడంతో మద్దతు ధరలు కూడా పెరుగుతాయి. ప్రకృతి వైపరీత్యాల వల్ల, ఇతర అనర్థ కారణాల వల్ల నష్టపోయిన రైతులు శాస్త్రీయంగా రూపొందించే మద్దతు ధరల వల్ల కొంతలో కొంతైనా మేలు జరుగుతుంది.

శాస్త్రీయ మద్దతు ధరల వల్ల నష్టమెవరికి?

కేంద్ర ప్రభుత్వం చెప్పినట్లు మద్దతు ధరలను శాస్త్రీయంగా నిర్ణయిస్తే ప్రభుత్వంపై భారం పడుతుందంటున్నారు. ఇది వాస్తవం కాదు. ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులన్నీ పరిశ్రమలకు ముడిసరుకులుగా ఉపయోగపడుతున్నాయి. వాటిని మధ్య దళారీలు తక్కువ ధరలకు కొనుగోలు చేసి, ప్రాసెస్ చేసి వినియోగదారులకు అమ్మకాలు చేస్తున్నారు. " వినియోగదారుడు చెల్లించే మొత్తంలో ఉత్పత్తిదారుని వాటా 40-50శాతం మించడం లేదు. మధ్య దళారీలు అత్యధిక లాభాలు సంపాదిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ద్వారా లాభాలను గమనించిన కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, అదాని, రిలయెన్స్, ఐటిసి, బేయర్, ఎల్ అండ్ టి లాంటి కంపెనీలు తమ పారిశ్రామిక పెట్టుబడులను తరలించి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, ప్రాసెసింగ్‌లో పెట్టుబడులు పెడుతున్నారు. పెట్టుబడులపై 80-100శాతం లాభాలు సంపాదిస్తున్నారు. ఈ ధరల విధానం వల్ల ఉత్పత్తిదారునికి న్యాయమైన ధర రాకపోవడం వల్ల వినియోగదారునిపై అత్యధిక భారం పడుతున్నది. మొక్కజొన్నతో 10 రకాలు, వరి ధాన్యంతో 5 రకాలు, గోదుమలతో 6 రకాలు, సోయాతో 10 రకాల ఉప ఉత్పత్తులు తయారౌతున్నాయి. పసుపు, మిరపతో కూడా అనేకరకాల ఉప ఉత్పత్తులు తయారౌతున్నాయి. రైతుల నుండి కొలుగోలు చేసిన ముడిసరుకులపై 20శాతం పెట్టుబడి పెట్టడం, లేదా పెట్టుబడి పెట్టకుండానే ఉప ఉత్పత్తులు వస్తున్నాయి. ఉదా: ధాన్యం, 1.5 కిలోలకు ఒక కిలో బియ్యం వస్తాయి. మిల్లు ఆడించినందుకు తౌడు, నూక, పరం తీసుకొని ఉచితంగానే కిలో బియ్యం ఇస్తారు. లేదా నామమాత్రంగా కొంత బియ్యం తయారు చేసినందుకు రేటు నిర్ణయిస్తారు. అలాగే, ముడిపప్పు క్వింటాల్‌కు 80 కిలోల పప్పు ఇస్తారు. సోయా మొదలు ఆయిల్ ఫామ్ వరకు నూనె గింజలు అన్నింటిలో 80-100 శాతం కార్పొరేట్లకు లాభాలుంటాయి.

1956లో నిత్యావసర సరుకుల చట్టాన్ని అప్పటి కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. వ్యవసాయ ఉత్పత్తుల నుండి వచ్చే ఆహార ధాన్యాలను ప్రాసెస్ చేసిన తర్వాత ఏ రేటుకు అమ్మాలో కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. 2020లో కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల చట్టాన్ని రద్దు చేసింది. రైతుల పోరాట ఫలితంగా తిరిగి చట్టాన్ని పునరుద్ధరించింది. దీని ప్రకారం వ్యవసాయ ఉత్పత్తుల నుంచి వచ్చే ఉప ఉత్పత్తుల ధరలను ప్రభుత్వం నిర్ణయించాలి. కానీ, కార్పొరేట్ సంస్థలు తమ లాభాల కొరకు వినియోగదారులపై అత్యధిక భారాలు మోపే విధంగా ధరలు నిర్ణయిస్తున్నారు. దానికితోడు అందుకు ఉపయోగపడే ముడి వ్యవసాయ ఉత్పత్తులను అతితక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. చాలా సందర్భాలలో కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధలను అమలు జరుపకపోవడం వల్ల రైతులు నష్టపోతున్నట్లు ఆర్థిక వేత్తలే వ్యాఖ్యానాలు చేశారు. దేశంలో యేటా రూ.18 లక్షల కోట్ల వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సాగుతున్నది. కేంద్రం నిర్ణయించిన మద్దతు ధరలు లభించకపోవడం వల్ల ఇప్పటికే రైతులు రూ.4 లక్షల కోట్లకు నష్టపోతున్నట్లు మోడీ ఆప్త మిత్రుడు, ఆర్థికవేత్త అశోక్ గులాఠి ప్రకటించడం గమనించాలి. అందువల్ల కనీస మద్దతు ధరల చట్టం అవసరాన్ని ఈ పరిణామం విధితం చేస్తున్నది. అభివృద్ధి చెందిన దేశాలలో కార్పొరేట్ల పై 35శాతం పన్ను విధించగా, మనదేశంలో 20-23 శాతం మాత్రమే పన్ను విధించి మరోవైపున వారికి లాభాలు కట్టబెడుతున్నారు. దీనికితోడు బ్యాంకులలో తీసుకున్న రుణాలను రూ.16 లక్షల కోట్లు మాఫీ చేసి మరో ఆదాయాన్ని కూడా కల్పించారు. నిత్యావసర సరుకుల ధరలు పెంచడం ద్వారా మరిన్ని లాభాలు సంపాధిస్తున్నారు.

ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులన్నీ పరిశ్రమలకు ముడిసరుకులుగా ఉపయోగపడుతున్నాయి. వాటిని మధ్య దళారీలు తక్కువ ధరలకు కొనుగోలు చేసి, ప్రాసెస్ చేసి వినియోగదారులకు అమ్మకాలు చేస్తున్నారు. " వినియోగదారుడు చెల్లించే మొత్తంలో ఉత్పత్తిదారుని వాటా 40-50శాతం మించడం లేదు. మధ్య దళారీలు అత్యధిక లాభాలు సంపాదిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ ద్వారా లాభాలను గమనించిన కార్పొరేట్ సంస్థలు టాటా, బిర్లా, అదాని, రిలయెన్స్, ఐటిసి, బేయర్, ఎల్ అండ్ టి లాంటి కంపెనీలు తమ పారిశ్రామిక పెట్టుబడులను తరలించి వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు, ప్రాసెసింగ్‌లో పెట్టుబడులు పెడుతున్నారు.

మద్దతు ధరల చట్టం వల్ల భారమెవరికి?


పైన వివరించిన ప్రకారం ఉత్పత్తిదారునికి తక్కువ ధరకు ఇచ్చి, వినియోగదారునికి ఎక్కువ ధరకు అమ్ముకునే విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టబద్ధం చేయడం ద్వారా ప్రస్తుతం వినియోగదారుల ధరలు పెంచకుండానే ఉత్పత్తిదారునికి అదనపు ఆదాయాన్ని చెల్లించవచ్చు. ఉదా: ధాన్యం ధర కేజీ రూ.20కి మార్కెట్‌లో అమ్మకాలు సాగుతున్నాయి. 1.5 కి.లు ధాన్యం అనగా రూ.30 చెల్లించాలి. కిలో బియ్యం వస్తాయి. కానీ, కిలో బియ్యం మార్కెట్‌లో రూ.60-65లకు అమ్ముతున్నారు. అలాగే పత్తి 3 కిలోలు జిన్నింగు చేస్తే కిలో దూది వస్తుంది. 2 కిలోలు గింజలు వస్తాయి. 3 కిలోల పత్తికి రూ.210లు పెట్టి కొనాలి. 2 కిలోల గింజలకు రూ.60లు ఆదాయం వస్తుంది. రూ.210ల నుండి రూ.60లు తగ్గిస్తే కిలో దూదికి రూ.150లు ధర ఉంటుంది. కిలో దూదితో 8 మీటర్ల బట్ట వస్తుందని సదరన్ టెక్స్‌టైల్ మిల్లులు అంచనా వేశాయి. మీటర్ ధర రూ.60లు నిర్ణయించినా రూ.480లు ఆదాయం వస్తుంది. రూ.150ల దూది ధరకు తోడు బట్టగా ప్రాసెస్ చేయడానికి మరో రూ.100లు వ్యయం చేసినా రూ.250ల పెట్టుబడికి రూ.480లు ఆదాయం వస్తుంది. అందువల్ల ప్రాసెస్ చేసిన తర్వాత అమ్ముకునే లాభ శాతాన్ని కేంద్రం ధరల నిర్ణయం ద్వారా తగ్గించాలి. ఆ తగ్గించిన దానిని ముడిసరుకులు ఉత్పత్తి చేసే రైతులకు జమ చేయాలి. అనగా, ధాన్యం ధర కిలో రూ.30లు అయినప్పుడు బియ్యం ధర కిలో రూ.45లు అవుతుంది. అయినా, మధ్యదళారీకి రూ.15 లాభం ఉంటుంది. ఈ సూత్రాలను పరిశీలించినప్పుడు కార్పొరేట్ల లాభాల మార్జిన్‌ను తగ్గించడం ద్వారా ఉత్పత్తిదారునికి గిట్టుబాటు ధర కల్పించవచ్చు. ఇందుకు చట్టం అవసరం.

ఆ చట్టం చేస్తే తమ లాభాలకు ఎక్కడ ఆటంకం వస్తుందోనని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల లాభాలను దృష్టిలో పెట్టుకొని చట్టం చేయకుండా కుంటిసాకులు చెప్తున్నది. దీనికితోడు ఎగుమతి-దిగుమతులలో కూడా కార్పొరేట్లకు లాభాలు కట్టబెడుతున్నది. మిగులు ఉత్పత్తులు జరిగినప్పటికీ దిగుమతులు చేసుకొని రైతులను నష్టపరుస్తున్నారు. అమెరికా మొదలు, పాకిస్తాన్ వరకు తమ రైతుల మేలును కాంక్షించి చట్టాల ద్వారా వారికి రక్షణ కల్పిస్తున్నారు. అందుకే ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా మన దేశంలోనే రైతుల ఆత్మహత్యలు కొనసాగుతు న్నాయి. ఇంతకన్న దృష్టాంతం ఏము న్నది? కార్పొరేట్ల లాభాలకు అడ్డుకట్ట వేయడం ద్వారా రైతులకు అదనపు ధరలు లభించే విధంగా పార్లమెంటులో చట్టం చేయాలి. ఉత్పత్తి ధరను శాస్త్రీయంగా ఎలా నిర్ణయించాలో ఆ చట్టంలో రూపొందించాలి. ఆ చట్టాన్ని అమలు చేయడానికి తగిన యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయాలి. అప్పుడే రైతుల ఆత్మహత్యలు నివారించబడుతాయి. కానీ, ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రైతుల రక్షణకు మద్దతు ధరల చట్టం తెస్తుందన్న విశ్వాసాన్ని కోల్పోయారు. రైతులు మాత్రం దృఢ దీక్షతో చట్టం చేసేవరకు పోరాటం విరమించడానికి సుముఖంగా లేరని సంయుక్త కిసాన్ మోర్చ ప్రకటించింది. పార్లమెంటులో సంయుక్త కిసాన్ మోర్చ ప్రవేశపెట్టిన ముసాయిదా చట్టాన్ని ఆమోదించటమొక్కటే బీజేపీ ముందున్న మార్గం. ■

'వారసత్వ సంపద'ను కాపాడుకోవాలి

యునెస్కో ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఏప్రిల్ 18వ తేదీన "ప్రపంచ వారసత్వ దినోత్సవం" నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఆయా దేశాల్లో ఉన్న చారిత్రక, ప్రకృతి కట్టడాలను, నిర్మాణాలను కాపాడు కోవడానికి, భవిష్యత్తు తరాలకు అందించటానికి అనేక కార్యక్రమాలతో ముందుకుసాగుతు న్నారు. ఫ్రాన్స్‌లోని ఈఫిల్ టవర్, చైనా వాల్, మనదేశంలో తాజ్‌మహల్ వంటివి చూడటానికి లక్షల సంఖ్యలో పర్యా టకులు వెళ్తూ ఉంటారు. ఈ 2024కు గాను "డిస్కవరీ అండ్ ఎక్స్ పీరియన్స్ డైవర్సిటీ" అనే థీమ్‌తో ప్రపంచమంతా ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న ది. ప్రపంచవ్యాప్తంగా 1199 వారసత్వ సంపద నిలయాలు, 168 దేశాల్లో ఉన్నట్లు యునెస్కో పేర్కొంది. వీటిలో 933 కల్చరల్, 227 నేచురల్, 39 మిక్సిడ్ నిర్మాణాలు, కట్టడాలు ప్రకృతి సంపదలున్నాయి. ఇక మనదేశంలో మొత్తం 42 ప్రపంచ వారసత్వ సంపద ప్రదేశాలుగా గుర్తింపు పొందాయి. 2023 సెప్టెంబర్‌లో రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతినికేతన్, కర్నాటకలోని హోయశాలలు నిర్మించిన దేవాలయాలు ప్రపంచవారసత్వ సంపదలో భాగమయ్యాయి.

వివిధ దేశాల్లో, వివిధ కాలాల్లో నిర్మించిన కట్టడాలను పరిరక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. వీటి ద్వారా ఆనాటి పరిపాలన, కళానైపుణ్యం, ఠీవి, హుందాతనం, నాగరికత పరిపాలన అందరికీ తెలుస్తోంది.వీటిలో భాగంగా కోటలు (ఫోర్ట్స్), పార్కులు,



వన్యప్రాణుల అభయారణ్యాలు, ప్రకృతి అద్భుతాలు రక్షించుకోవాలి. మనదేశంలో ఎర్రకోట, ఆగ్రాకోట, తాజ్‌మహల్, కజిరంగ నేషనల్ పార్క్, దిల్‌వారా, కోణార్క్ దేవాలయాలు, ఎల్లోరా గుహలు, రామప్ప దేవాలయం వంటివి ఎన్నో ప్రపంచ వారసత్వ ప్రదేశాలుగా గుర్తింపు పొందాయి. వీటన్నిటినీ పరిరక్షించేందుకు ప్రభుత్వాలు ప్రయత్నాలు చేయాలి.బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించాలి. కాలుష్య కోరల్లో చిక్కుకోకుండా చూడాలి. ఆక్రమణలకు గురికాకుండా ప్రయత్నించాలి. ముఖ్యంగా వివక్షలతో, ప్రాంతీయ, మత విద్వేషాలతో నిర్మాణాలను కూలగొట్టడం, ప్రాధాన్యత తగ్గించటం చేయరాదు. చరిత్ర ఆనవాళ్లు చెరిపేయకూడదు. చట్టాల ద్వారా వాటిని ఎప్పటికప్పుడూ సంరక్షించాలి. అప్పుడే నాటి కళానైపుణ్యం, నిర్మాణశైలి, వాడిన పదార్థాలు అవగాహన చేసుకోవడానికి భవిష్యత్ తరానికి అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పర్యాటక రంగం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న మాట వాస్తవం. విదేశీయులు ఇటువంటి ప్రదేశాలు సందర్శించడం ద్వారా ఆయా దేశాలకు విదేశీ మారక ద్రవ్యం లభిస్తుంది. దేశాలు కూడా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయి. ప్రపంచ దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు మెరుగవుతాయి.

పర్యాటకం ద్వారా వచ్చే ఆదాయంతోనే సింగపూర్, మలేషియా, మాల్దీవులు, స్విట్జర్లాండ్, ఇటలీ, ఫ్రాన్స్ వంటి దేశాలు అభివృద్ధి చెందాయనే విషయం అందరికీ తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో కూడా ఇంకా చాలా ప్రదేశాలు వారసత్వ సంపదతో నిండి ఉన్నాయి. బొర్రా గుహలు, లేపాక్షి నంది, గోల్కొండ కోట, జోగులాంబ ఆలయం వంటివి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు కోసం ఎదురు చూస్తున్నాయి. అయితే ఆ దిశగా కేంద్రం చేస్తున్న కృషి సరిపోవడం లేదు. ఇటువంటి ప్రదేశాలు, కట్టడాలు దర్శించడం ద్వారా అనేక చారిత్రక విషయాలు, విశిష్టతలు తెలుస్తాయి. ప్రస్తుతానికి ప్రపంచంలోనే ఇటలీలో 59 వారసత్వ సంపద ప్రదేశాలతో ముందంజలో ఉంది. మనదేశంలో కూడా మరెన్నో వారసత్వ సంపద ప్రదేశాలుగా గుర్తింపు పొందడానికి కృషి చేస్తే దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశమున్నది. దీంతో పాటు కేంద్ర బడ్జెట్ లోనూ పర్యాటక రంగానికి ప్రత్యేక వాటా పెంచేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే అనేక రాష్ట్రాల హక్కులకు భంగం వాటిల్లడం, బడ్జెట్‌లోనూ కోతలు విధించడం చూస్తూనే ఉన్నాం. అయితే తమ వారసత్వ సంపదను కాపాడుకుంటూ యునెస్కో గుర్తించేలా ముందుకు సాగాల్సిన అవసరమైతే ఉన్నది. అదేవిధంగా నాటి శిల్ప సంపదను రక్షించుకోవడానికి కూడా తగిన శ్రద్ధ తీసుకోవాలి. అందుకుగాను బడ్జెట్‌లో తగిన వాటాను సమకూర్చుతూ పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసుకోవడమే ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం.

- ఐ.ప్రసాదరావు
6305682733


మోడీ మతోన్మాద ప్రచారంపై ఇ.సి చర్యలు తీసుకోవాలి!

ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో బీజేపీ సాగిస్తున్న ఎన్నికల ప్రచారం బాహాటంగానే మతం ప్రాతిపదికన ఓట్లు అడుగుతోంది. రాముడి ఆలయాన్ని ఎన్నికల అంశంగా మార్చింది. రాముడికి, రాముడి ఆలయానికి కొన్ని ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకంగా వున్నాయని నిందిస్తోంది. ఇది ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించడమే. పైగా బీజేపీ నేతలు కొన్ని ప్రసంగాల్లో విద్వేషాలను రెచ్చగొడుతూ మతపరమైన మనోభావాలకు ఆజ్యం పోయడం ఇండియన్ పీనల్ కోడ్‌లోని కొన్ని నిబంధనల ప్రకారం నేరం కూడా.ఇక్కడ ప్రధాన దోషి నరేంద్ర మోడీనే. ఎన్నికల సభల్లో ఆయన చేసిన ప్రసంగాలు కొన్నిటిని పరిశీలిస్తే, పాలక పార్టీ అగ్రనేత మత భావాలను ఏ విధంగా బహిరంగంగా ప్రదర్శిస్తున్నారో కనిపిస్తుంది.

బీహార్‌లోని నవాడాలో ఏప్రిల్ 7న జరిగిన ఒక ఎన్నికల సభలో మోడీ ప్రసంగిస్తూ, "అయోధ్యలో రాముడికి బ్రహ్మాండమైన ఆలయాన్ని నిర్మించకుండా అడ్డుకునేందుకు కాంగ్రెస్, ఆర్‌జెడిలు అనేక ప్రయత్నాలు చేశాయి" అని ఆరోపించారు. ఆలయంలో రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని వారు బహిష్కరించారని చెప్పారు. రాముడి పట్ల ఎందుకింత శతృత్వం? అని ప్రశ్నించారు. పైగా రామనవమి కూడా వస్తోంది, కాబట్టి ఈ పాపం చేసిందెవరో మర్చిపోవద్దు అంటూ ప్రజలను కోరారు. ప్రజల మత భావాలను రెచ్చగొట్టి, ఆడుకోవడం తప్ప ఇది మరొకటి కాదు. పైగా రాముడికి వ్యతిరేకంగా వున్నారంటూ ప్రతిపక్షాలపై తప్పుడు ఆరోపణలు చేయడమే. ఇవన్నీ కూడా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తీవ్రంగా ఉల్లంఘించడం కిందకే వస్తాయి. అంతేకాదు, విద్వేషాలను రెచ్చగొడుతున్నందుకు ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయడానికి అవకాశాలు వున్నాయి.

రాజస్థాన్‌లోని అజ్మీర్‌లో ఏప్రిల్ 6వ తేదీన ఒక సభలో ప్రసంగిస్తూ, అయోధ్యలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి హాజరైన సభ్యులను కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించారని తప్పుడు ఆరోపణలు చేస్తూ మోడీ ఆ పార్టీపై దుష్ప్రచారం చేశారు. ఆలయ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని వ్యతిరేకించిన వారు మొదటి దశ పోలింగ్ ఏప్రిల్ 19కి రెండు రోజుల ముందుగా జరిగే రామనవమి ఉత్సవాలను కూడా వ్యతిరేకిస్తారంటూ తప్పుడు సూచనలు చేశారు. రాజకీయ ప్రత్యర్థికి వ్యతిరేకంగా మతభావాలను తీవ్రంగా రెచ్చగొట్టడమే ఇది.

ఉత్తరప్రదేశ్‌లోని ఫిలిభిత్‌లో ఏప్రిల్ 9వ తేదీన మరోసారి ఇలాంటి ప్రసంగాన్నే చేశారు. అయోధ్య రామాలయంలో ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో పాల్గనలేదంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీపై దాడి చేశారు. ఇది రాముడిని అవమానించడమేనని ఆయన ప్రకటించేశారు. ఇండియా బ్లాక్‌లోని ఈ వ్యక్తులు రామాలయం అంటేనే చాలా కాలం నుండి ద్వేషంతో వున్నారని ఆరోపించారు. 'ఇండియా' బ్లాక్ రామాలయం పట్ల విద్వేషాన్ని పెంచి పోషించిందని ఆరోపిస్తూ మోడీ విద్వేష ప్రసంగం సాగించారు.ఇవి, మోడీ ఇటీవల కాలంలో చేసిన కొన్ని ప్రసంగాలు మాత్రమే. ఈ సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి మద్దతును సంపాదించడం కోసం రాముడిని, రామాలయాన్ని మోడీ బాగా వాడుకుంటున్నారు.



ప్రధాని మోడీ చేసిన ఎన్నికల ప్రసంగాల గురించి సీపీఐ(ఎం), ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా నరేంద్ర మోడీ, అమిత్ షా చేసిన ప్రసంగాలపై ఎన్నికల కమిషన్‌కు ఇలాగే ఫిర్యాదులు చేశారు కానీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విషయాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఎలాంటి చర్య తీసుకోరాదన్న నిర్ణయంపై ఎన్నికల కమిషనర్లలో ఒకరు అసమ్మతి వ్యక్తం చేశారని తర్వాత వెల్లడైంది. ఆ కమిషనర్ అశోక్ లావాసా భార్య, కుమారుడిని ఆదాయపన్ను శాఖ అధికారులు ఇంటరాగేట్ చేసి, వేధించడంతో తదనంతర కాలంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు.ఈసారి ఎన్నికల కమిషన్‌కు ఇది పరీక్ష కానుంది.

ఉదాహరణకు, ఏప్రిల్ 6న ఘజియాబాద్‌లో జరిగిన రోడ్‌షోలో మోడీ పాల్గన్నారు. ఆ సందర్భంగా పాటలు ఆలపించారు. "జో రామ్ కో లాయే హై, హమ్ ఉన్‌కో లాయింగే" (ఎవరైతే రాముడిని మా దగ్గరకు తెచ్చారో వారికి అధికారం కట్టబెడతాం) అంటూ ఆ పాటల్లో సాహిత్యం సాగింది. "భారత్ కా బచ్చా బచ్చా జై శ్రీరామ్ బోలేగా" అంటూ నినాదాలు చేశారు. మతపరమైన నినాదం 'జై శ్రీరామ్' బీజేపీ రాజకీయ ఉద్దేశ్యంగా మారిపోయింది. అమిత్ షా, ఆదిత్యనాథ్ వంటి ఇతర బీజేపీ నేతలు కూడా ఇదే ధోరణిలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారు. కానీ దీనికి ముందుగా ఆ పోకడను నిర్దేశించింది మాత్రం ప్రధాని మోడీనే." ఓట్లను సంపాదిం చడం కోసం కుల లేదా మత భావాలను రెచ్చగొట్టరాదు. మసీదులు, చర్చిలు, ఆలయాలు లేదా ఇతర ఆరాధనా స్థలాలను ఎన్నికల ప్రచారాలకు వేదికలుగా ఉపయోగించ రాదు." అని ఎన్నికల ప్రవర్తనా నియమావళి పేర్కొంటోంది. అయోధ్యలో రాముడికి గుడి కట్టించి, ప్రాణ ప్రతిష్ట చేసిన వారికే ఓటు వేయాల్సిందిగా మోడీ తన ప్రసంగాల్లో ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. పైగా, కేవలం ఎన్నికల ప్రచారాంశంగా ఆలయాన్ని ఉపయోగించడం కాదు, బీజేపీ ఎన్నికల ప్రచారంలోనే కీలకమైన అంశంగా రామాలయం మారిపోయింది.

ప్రధాని మోడీ చేసిన ఎన్నికల ప్రసంగాల గురించి సీపీఐ(ఎం), ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా నరేంద్ర మోడీ, అమిత్ షా చేసిన ప్రసంగాలపై ఎన్నికల కమిషన్‌కు ఇలాగే ఫిర్యాదులు చేశారుకానీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదన్న విషయాన్ని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. ఎలాంటి చర్య తీసుకోరాదన్న నిర్ణయంపై ఎన్నికల కమిషనర్లలో ఒకరు అసమ్మతి వ్యక్తం చేశారని తర్వాత వెల్లడైంది. ఆ కమిషనర్ అశోక్ లావాసా భార్య కుమారుడిని ఆదాయపన్ను శాఖ అధికారులు ఇంటరాగేట్ చేసి, వేధించడంతో తదనంతర కాలంలో ఆయన తన పదవికి రాజీనామా చేశారు. ఈసారి ఎన్నికల కమిషన్‌కు ఇది పరీక్ష కానుంది. ఎన్నికల ప్రకటన సందర్భంగా వివాదాస్పదమైన ఎన్నికల కమిషనర్ల నియామక చట్టం నిబంధనల కింద ఇద్దరు ఎన్నికల కమిషనర్లను నియమించిన తర్వాత ఎన్నికల కమిషన్ నిజంగానే స్వతంత్ర సంస్థ అని, ప్రభుత్వం పట్ల పక్షపాతంగా వ్యవహరించదని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే వుంది.

ఆధిపత్య హిందూత్వ కార్యాచరణను తమ మతపరమైన ఎజెండాగా ముందుకు తీసుకెళుతూ పాలక పార్టీ, ప్రధాని దీన్ని సాధారణీకరించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటువంటి ఒత్తిళ్లకు ఎన్నికల కమిషన్ తలొగ్గకూడదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే.. స్వేచ్ఛగా, సక్రమంగా ఎన్నికలు జరిగే వాతావరణాన్ని నాశనం చేస్తే.. ఎన్నికల ప్రచారం ఏ రూపంలో వున్నా..దానిని అడ్డుకోవడానికి, భగ్నం చేయడానికి కచ్చితంగా జోక్యం చేసుకోవాల్సిందే.

(ఏప్రిల్ 10 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఖమ్మం
5
గురువారం | ఏప్రిల్ 18, 2024 | www.navatelangana.com

రవి కుమార్‌కు నున్నా పరామర్శ

నవతెలంగాణ-బోనకల్

మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోవిందాపురం ఎల్ గ్రామానికి చెందిన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు అల్లుడు చేబ్రోలు రవికుమార్‌ని పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యనమదల విక్రం, చింతలచెరువు కోటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ బుధవారం ఖమ్మంలోని ఆరోగ్య ఆసుపత్రిలో పరామర్శించారు. ప్రమాద సంఘటనను రవి కుమార్‌ని వారు అడిగి తెలుసుకున్నారు. త్వరగా



కోలుకోవాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు.

అంగన్‌వాడీలకు వేసవి సెలవులు

కేంద్రాలు మూత వేయవద్దు : సీడీపీవో

నవతెలంగాణ-కారేపల్లి

అంగన్‌వాడీలకు షరతులతో కూడిన వేసవీ సెలవులను మంజూరు చేస్తూ మహిళ శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులను జారీ చేసినట్లు ఐసీడీఎస్ కామేపల్లి ప్రాజెక్టు సీడీపీవో దయామణి తెలిపారు. నెల మొదటి 15రోజులు అంగన్‌వాడీ టీచర్స్, నెల రెండో పక్షం 15 రోజులు అంగన్‌వాడీ హెల్పర్ సెలవులు ఉంటాయని ఉత్తర్వులలో ఉన్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేయకుండా పిల్లలకు ఫీడింగ్ ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సమయం తర్వాత సర్వేలు, గృహసందర్శన, ప్రవేశాలు వంటి నిర్వహించాలని ఉత్తర్వులలో ఆదేశాలు ఇచ్చారు. వేసవీ సెలవులు జూన్ 1వ తేది వరకు ఉంటాయని తెలిపారు.

దండి భాస్కర్ ఆశయాలు సాధిద్దాం

నవతెలంగాణ-ఖమ్మంరూరల్



తాను నమ్మిన ఎర్రజెండా కోసం తుది శ్వాస వరకు పనిచేసిన దండి భాస్కర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహమ్మద్ మౌలానా అన్నారు. మండల పరిధిలోని ఏదులాపురంలో దండి భాస్కర్ ఎనిమిదవ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు దండి భాస్కర్ స్తూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మౌలానా మాట్లాడారు. కష్టకాలంలో జెండాను వీడకుండా నిలబడ్డవాడే నిజమైన కమ్యూనిస్టు అన్నారు. నేటి యువత దండి భాస్కర్ ఆశయ సాధన కొరకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నరసింహారావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, సిద్ధినేని కర్ణకుమార్, పుచ్చకాయల కమలాకర్, చెరుకుపల్లి భాస్కర్, చిన్న వెంకటరెడ్డి, శంకరయ్య, రామ్ కోటి, శేషగిరిరావు, రామాంజనేయులు, చంద్రరావు, వెంకటేశ్వర్లు, సురేందర్, రంగరావు తదితరులు పాల్గొన్నారు.

తాటి చెట్లు దగ్ధం

నవతెలంగాణ-ముదిగొండ

మండలపరిధిలోని న్యూలక్ష్మీపురం ముదిగొండ రహదారి పక్కన కల్లుగీత కార్మిక సంఘం సొసైటీకి జీవనోపాధిగా ఉన్న 100 తాటి చెట్లలో 25 తాటి చెట్లుకు మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి నిప్పు పెట్టడంతో పూర్తిగా దగ్ధమై కాలిపోయాయి. న్యూలక్ష్మీపురం గ్రామానికి చెందిన వ్యక్తులే తాటి చెట్లకు నిప్పు పెట్టారని ముదిగొండ, నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు కల్లుగీత కార్మిక సంఘం సభ్యులు బుధవారం తెలిపారు. తాటి చెట్లే జీవనోపాధిగా జీవిస్తున్న కల్లు గీత కార్మిక సంఘం కుటుంబాలువారు, తాటిచెట్లు అనుమానస్పదంగా



దగ్ధమవడంతో ఆందోళనకు గురయ్యారు.

నేటి నుంచి నామినేషన్లు

- 25వ తేదీ వరకు స్వీకరణ
- 11 నుంచి 3 గంటల వరకు దరఖాస్తులు
- ఇంకా ఖరారు కాని కాంగ్రెస్ అభ్యర్థి
- ఖమ్మంలో 16 లక్షలకు పైగా ఓటర్లు
- మహబూబాబాద్‌లో 14 లక్షలకు పైగా ఓట్లు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి





సాధారణ లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడి ఇప్పటికే నెలన్నర రోజులవుతోంది. ఈ ఎన్నికల్లో కీలకఘట్టం నామినేషన్ల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానుంది. 16 లక్షలకు పైగా ఓటర్లు ఉన్న ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఖమ్మం జిల్లాలో ఐదు ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, భద్రాద్రి కొత్తగూడెంలో రెండు కొత్తగూడెం, అశ్వారావుపేట మొత్తం ఏడు అసెంబ్లీ నియోజక వర్గాలున్నాయి. ఖమ్మం లోక్‌సభ స్థానానికి నామినేషన్లు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో స్వీకరిస్తారు. గురువారం నుంచి ప్రారం భమయ్యే ఈ నామినేషన్ల ఘట్టం ఈనెల 25వ తేదీ వరకు కొనసాగుతుంది. ప్రతి రోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 14 లక్షలకు పైగా ఓటర్లు ఉన్న మహబూబాబాద్ నియోజకవర్గంలో ఏడు శాసనసభ స్థానాలున్నాయి. ఇదీ ఎస్టీ రిజర్వుడ్ స్థానం.

మహబూబాబాద్ పార్లమెంట్...

మహబూబాబాద్ పార్లమెంట్ పరిధిలో మొత్తం ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. దీనిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలం, పినపాక, ఇల్లెందు, మహబూబాబాద్ జిల్లాలో మహబూబాబాద్, డోర్నకల్, నర్సంపేటతో పాటు ములుగు జిల్లా కేంద్ర నియోజకవర్గాలున్నాయి. వీటిలో ఒక నర్సంపేట మినహా మిగిలిన అన్ని శాసనసభ స్థానాలు ఎస్టీ రిజర్వుడ్ కావడంతో లోక్‌సభ స్థానాన్ని కూడా షెడ్యూల్ తెగలకే రిజర్వు చేశారు. దీనికి గాను మహబూబాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ నామినేషన్లు స్వీకరిస్తారు. ఇప్పటికే ఉమ్మడి పార్లమెంట్ నియోజకవర్గాల్లో నామినేషన్లు, ఎన్నికలకు సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించారు.

నామినేషన్‌కు ముందే బ్యాంకు అకౌంట్ తెరవాలి...

నామినేషన్‌కు ముందే అభ్యర్థులు తమ పేరు మీద బ్యాంకు అకౌంట్‌ను తెరవాలని, ఆ ఖాతాను నామినేషన్ పత్రంతో సహా జత చేయాల్సి ఉంటుంది. అభ్యర్థులు రూ.90లక్షలకు మించి ఖర్చు చేయడానికి వీల్లేదు. నామినేషన్ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.12,500, సాధారణ అభ్యర్థులు రూ.25,000 సెక్యూరిటీ డిపాజిట్ చేయాలి. ఎన్నికల నిబంధనలకు లోబడే ఎలాంటి ఖర్చులైనా చేయాలన్నారు.

రెండు లోక్‌సభ స్థానాల్లోనూ పోటీ నామమాత్రమే..!

నామినేషన్ల ఘట్టం ప్రారంభమవుతున్నా ఇంకా ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు కాకపోవడం ఆ పార్టీ శ్రేణులతో పాటు ప్రత్యర్థులకు ఉత్కంఠ రేపుతోంది. మొన్నటి శాసనసభ ఎన్నికల్లో ఈ స్థానంలోని మొత్తం అన్ని నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపొందడం గమనార్హం. మొత్తంగా కాంగ్రెస్, దాని మిత్రపక్షం సీపీఐ అభ్యర్థులు కలిసి మొన్నటి ఎన్నికల్లో మూడు లక్షలకు పైగా ఓట్ల మెజార్టీ సాధించారు. అటు మహబూబాబాద్‌లోనూ ఇలాంటి ఫలితాలే వచ్చాయి. ఒక్క భద్రాచలం తప్ప మిగిలిన అన్ని శాసనసభ స్థానాల్లోనూ కాంగ్రెసే విజయం సాధించింది. భద్రాచలం నుంచి బీఆర్ఎస్ తరఫున గెలిచిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సైతం ఇటీవల కాంగ్రెస్‌లో చేరడంతో ఈ లోక్‌సభ స్థానంలోనూ పోటీ నామమాత్రంగానే ఉంటుందని పరిశీలకుల అంచనా. ఉభయ పార్లమెంట్ స్థానాల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్న దృష్ట్యా వారే కీలకంగా మారనున్నారు.

కమనీయం...సీతారాములోరి కల్యాణం

- గ్రామాల్లో సందడిగా ఊరేగింపులు
- అన్నదానాలు చేసిన కమిటీలు

నవతెలంగాణ-ఖమ్మం

బీఆర్ఎస్ ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు బుధవారం ఖమ్మం నగరంలో విస్తృతంగా పర్యటించి పలు ఆలయాలను స్థానిక నేతలతో కలిసి సందర్శించి శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధు, పార్టీ పట్టణ అధ్యక్షుడు పగడాల నాగరాజు, చిత్తారి సింహాద్రి యాదవ్, తాళ్లూరి జీవన్, నామ సేవా సమితి నుంచి తాళ్ళూరి హరీష్, పాల్వంచ రాజేష్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.









ఇందిరా నగర్‌లోని పర్ణశాలను సందర్శించారు. ఈ సందర్భంగా నవమి వేడుకల్లో పాల్గొని, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చావా నారాయణరావు, సరిపూడి సతీష్, యాకూబ్ పాషా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ కోదండ రామాలయంలో జరిగిన శ్రీ సీతారాముల స్వామి కల్యాణ వేడుకల్లో కూడా నామ పాల్గొని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మిక్కిలినేని నరేంద్ర, నల్లమల రంజిత్, కర్నాటి కృష్ణ, చెరుకూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీచౌక్‌లో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో ఎంపీ నామ స్థానిక నాయకులు, వ్యాపార ప్రముఖులతో కలిసి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 36వ డివిజన్ కార్పొరేటర్ పసుమర్తి మోహన్‌రావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, చిల్లంచర్ల రాధ, కురువెళ్ల జగన్, శ్రీరంగం రాధాకృష్ణ, పుల్లఖండం వినయ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వోడ్డులోని గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వైష్ణవి ప్రసన్న, బోజెడ్ల రామ్మోహన్, చింతపల్లి వెంకటేశ్వర్లు, బోజెడ్ల కిరణ్ కుమార్, కేసగాని రవి, మోరంపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి : సత్తుపల్లిలోని శ్రీకోదండ రామాలయ ఆవరణలో బుధవారం సీతారాముల కల్యాణం కన్నుల పండువలా జరిగింది. కల్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ వారు చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. పట్టణానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రాముని కల్యాణాన్ని కనులారా తిలకించారు. పురోహితులు ఫణికుమారాచార్యులు, పీవీ రాంబాబు ఆధ్వర్యంలో ఈ కల్యాణాన్ని జరిపించారు. కల్యాణాన్ని తిలకించేందుకు హాజరైన భక్తజనానికి ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలను అందించారు. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ రాముని కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. కార్యక్రమంలో శ్రీకోదండ రామాలయ ట్రస్ట్ అధ్యక్షుడు కోరుకొండ వెంకటేశ్వరరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు కొత్తూరు సత్యనారాయణ, కార్యదర్శి అనుమోలు సురేశ్‌కుమార్, ఆలయ కమిటీ బాధ్యులు కొత్తూరు ప్రభాకరరావు, గుడిమెట్ల గాంధీ, కొత్తూరు రాజేశ్, అడపా సాయి, మొరిశెట్టి సాంబశివగుప్త, నడిపల్లి అర్జునరావు, మట్టా అజయకుమార్, వందనపు సత్యనారాయణ, పసుమర్తి గోపాలరావు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల వద్ద కాంగ్రెస్ జిల్లా నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి సీతారాముల కల్యాణానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని శ్రీ సిటీలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీరామనవమి వేడుకలకు హాజరై, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్ రెడ్డి, బండి జగదీష్, ప్రముఖ వ్యాపారవేత్తలు గరికపాటి వెంకట్రావు, గరికపాటి విజయ్, అజ్మీరా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అత్తామామల వేధింపులు

మండుటెండలో ఇంటిముందు కూర్చొని కోడలు ఆందోళన

- పోలీసుల జోక్యంతో స్టేషన్‌కు వెళ్లిన బాధితురాలు
- అత్త, మామ, బావ, తోటి కోడలపై ఫిర్యాదు

నవతెలంగాణ- బోనకల్

ఒకవైపు భర్త చనిపోయి ఆ భార్య పుట్టెడు దుఃఖంలో ఉంది. మరోవైపు అత్తమామలు, బావ, తోటి కోడలు తనను వేధిస్తున్నారంటూ వారి ఇంటిముందు బుధవారం ఆందోళనకు దిగింది. పోలీసుల జోక్యంతో బాధితురాలు పోలీస్ స్టేషన్ కు వెళ్ళింది. తనను వేధింపులకు గురి చేస్తున్నారని వారి నుంచి ప్రాణ హాని ఉందని బాధితురాలు ఫిర్యాదు చేసింది. మండుటెండలో రెండు గంటల పాటు అత్తమామల ఇంటిముందే ఆందోళనకు దిగిన సంఘటన మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

బాధితురాలు బండి రచన తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణానికి చెందిన కిల్లా రచన బోనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని బోనకల్ స్టేషన్‌కు చెందిన బండి సురేష్‌ని 2022 ఫిబ్రవరి 23న వివాహం చేసుకుంది. పెళ్లయిన కొద్ది రోజుల నుంచి బావ చిరంజీవి, తోటి కోడలు కృష్ణ ప్రియాంక వేధింపులకు గురి చేస్తున్నారు. భర్త బండి సురేష్ ఖమ్మంలోని లుమినేస్ బ్యాటరీ హోల్‌సేల్ షాపును పెట్టుకున్నాడు. రచన ఖమ్మంలోని ఉద్యానవన శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుంది. ప్రతిరోజు భార్యాభర్తలు కలిసి ఖమ్మం వెళ్తున్నారు. ఈ క్రమంలో భర్త బండి సురేష్ యోనో యాప్ ద్వారా రూ.2 లక్షల రూపాయల రుణం తీసుకున్నాడు. ఖమ్మంలోని కిన్నెర ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీ నుంచి మరో రూ.12 లక్షలు రూపాయలు రుణం తీసుకున్నాడు. ఈ 12 లక్షల రూపాయలకు రచన షూరిటీగా ఉంది. అదే విధంగా బోనకల్ ఎస్బిఐ నుంచి మరో 10 లక్షలు సురేష్ రుణం తీసుకున్నాడు. 12 లక్షల రూపాయల రుణం విషయం రచనకు తెలియదు. తన భర్త సంతకం పెట్టమంటే పెట్టానని ఈ రుణం విషయం తనకు తెలియదని తెలిపింది. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా తన భర్త సురేష్ మామ బండి యాకోబు, బావ చిరంజీవి మధ్య డబ్బుల విషయంపై తరచూ గొడవలు పడుతున్నారు. ఈ విషయంపై తాను తన భర్తను అడగగా ఈ విషయాలను నీకు అనవసరం అంటూ నన్ను మందలించాడని తెలిపింది. తన ప్రతి నెల జీతం కూడా తన భర్త సురేష్ మొత్తం తీసుకునేవాడని తెలిపింది. తన భర్త సురేష్ తాను విధులకు ఒంటరిగా వెళ్లిన సమయంలో తాను ఎలా వెళ్ళేది జిపిఎస్ లొకేషన్ పెట్టమని వేధించేవాడని తెలిపింది. భర్త వేధింపులు తాళలేక తాను కూడా జిపిఎస్ లొకేషన్ తన భర్తకు పెట్టే దానినని తెలిపింది. ఈ నెల మూడవ తేదీ రాత్రి సురేష్ రైలు ప్రమాదంలో అనుమానస్పదంగా మృతి చెందాడు. అంతకుముందు మూడు రోజుల క్రితం భర్త, మామ, బావ డబ్బులు విషయంపై గొడవలు పడ్డారని తెలిపింది. తన భర్త చనిపోయిన మూడు రోజుల తర్వాత తన తండ్రి, తమ్ముడు అత్తమామల ఇంటికి వచ్చి సురేష్ ఎలా చనిపోయాడని ప్రశ్నిస్తే వాళ్లను మా మామ, బావ బెదిరించాడని తెలిపింది. పోలీస్ స్టేషన్‌లో కేసు పెడితే మీకు ఏమీ రావని బెదిరించారని, అదే విధంగా తనను ఎవరైనా మా బంధువులు చూడటానికి ఇంటికి వస్తే వాళ్లకు సంబంధించిన హ్యాండ్ బ్యాగులను ఇంటి ముందే మామ చెక్ చేసి ఇంట్లోకి అనుమతించేవారని తెలిపింది. ఈ సంఘటన మరువక ముందే తన మామ బండి యాకోబు, అత్త విజయ కుమారి, బావ చిరంజీవి, తోటి కోడలు కృష్ణ ప్రియాంక తనను చంపేందుకు అనేకసార్లు ప్రయత్నం చేశారని తెలిపింది. తన భర్త చనిపోయి దుఃఖంలో ఉన్న తనను ఓదార్చాల్సింది పోయి తన భర్తకు సంబంధించిన సెల్ ఫోన్, లాప్ ట్యాప్ నీవే దొంగలించావు అంటూ తనను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపింది. ఆ క్రమంలోనే బుధవారం తన భర్తకు సంబంధించిన లాప్‌టాప్, సెల్ ఫోన్, బీరువా తాళాలు నీవే



దొంగలించావని తీవ్ర వేధింపులకు గురిచేశారు. పదేపదే నా పర్సుని వెతకటం చేస్తున్నారని తెలిపింది.

తన భర్త చనిపోయే నాటికి షాపులో రూ.50లక్షల సరుకు ఉందని, తన భర్త చనిపోయిన 3 రోజుల అనంతరం తన మామ షాపు తాళంచెవిని తన వద్ద నుండి బలవంతంగా తీసుకున్నాడని, ప్రస్తుతం ఆ షాపులో సరుకు ఉందో మాయం చేశాడో తన మామపై అనుమానం ఉందన్నారు.

ఇది ఇలా ఉండగా గత మూడు రోజుల క్రితం తాను రాత్రి సమయంలో నిద్ర పోతుండగా తన తోటి కోడలు కృష్ణ ప్రియాంక తన ముఖంపై దిండు పెట్టి తనను చంపేందుకు ప్రయత్నం చేసిందని తెలిపింది. వారి వేధింపులు తాళలేక తనకు న్యాయం చేయాలంటూ ఇంటిముందు మండుటెండలో ఆందోళనకు దిగినట్టు తెలిపింది. పోలీసుల జోక్యంతో తాను పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అత్త విజయ్ కుమారి, మామ యాకోబు, బావ చిరంజీవి, తోటి కోడలు కష్ణ ప్రియాంకలపై ఫిర్యాదు చేసినట్లు తెలిపింది. వారి నుంచి తనకు ప్రాణహాని ఉందని, తన భర్త మృతిపై కూడా అనుమానాలు ఉన్నాయని, నిజనిజాలు నిగ్గు తేల్చాలని తాను ఫిర్యాదు చేసినట్లు రచన తెలిపింది. తనకు న్యాయం చేసే వరకు అత్తమామల ఇంటి నుంచి కదిలేది లేదని రచన స్పష్టం చేసింది.

తాటి ముంజలకు .... భలే గిరాకి

- కాపు తగ్గటంతో పెరిగిన డిమాండ్
- తాటిచెట్లపైనా వాతావరణ ప్రభావం

నవతెలంగాణ-కల్లూరు



ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభం నుండి పంటలపైనే కాకుండా పండ్ల తోటలతో పాటు తాటిచెట్లకు కూడా వాతావరణం అనుకూలించకపోవడంతో తాటి ముంజలకు సైతం గిరాకీ పెరిగింది. వేసవికాలం వచ్చిందంటే ఎక్కువగా ప్రజలు చల్లదనంతో పాటు తాటి ముంజలలో ఎన్నో పోషకాలు ఉంటాయని ఎండాకాలంలో మాత్రమే దొరికే ఈ తాటి ముంజలు కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తారు. గతంలో మార్చి చివరి నుండే తాటి ముంజలు మార్కెట్లోకి వచ్చేవి. దీంతో ప్రజలు తాటి ముంజలు దొరికినంత కాలం కొనుగోలు చేసే వారు. తాటి ముంజలు గతంలో డజన్ 25 రూపాయల నుంచి 50 రూపాయలు లోపు ధర పలికి సామాన్యుడికి అందుబాటులో ఉండేవి. వ్యవసాయ పంటలకు, పళ్ళ తోటలకు, నల్లి వ్యాపించడం వల్ల పంటలు కూడా సక్రమంగా అనుకున్నంత దిగుబడి రాక రైతుల ఇబ్బంది పడుతున్నారు. ఈ రబీలో మామిడిపండుపై కూడా నల్లి ప్రభావం ఉండటంతో మామిడి రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ప్రస్తుతం తాటిచెట్లపై కూడా నల్లి వ్యాపించడం వల్ల దిగుబడి బాగా తగ్గింది. దీంతో వ్యాపారులు తాటి ముంజలు అమ్మితే రోజు కూలి కూడా పడటం లేదని తాటి ముంజలు 50 నుండి 100 రూపాయల వరకు అమ్ముతున్నారు. తాటి చెట్టు ఎక్కి తాటికాయలు కింద దింపటం అవి మార్కెట్‌కు తీసుకొచ్చి తాటికాయలు కోసి ముంజలు బయటికి తీసి అమ్ముతున్నారు. ఎంత చేసినా ఆశించిన కూలి పడటం లేదని దీనికి కారణం ఈ సీజన్లో కాపు బాగా తక్కువగా రావటం, ఉన్న కాయలు కూడా ముంజలు ఎక్కువ లేకపోవడం వల్ల కూలి పడటం లేదని వ్యాపారులు అంటున్నారు. కల్లూరు మండలంలో రఘునాథగూడెం, రఘునాథ బంజారా, తాళ్లూరు వెంకటాపురం, చిన్న కోరుకొండి వంటి గ్రామాల్లో తాటి చెట్లు ఎక్కువగా ఉండేవి. కోతులు బాధ తట్టుకోలేక ఉన్న తాటి చెట్లు నరికేస్తున్నారు. దీంతో కాపు తగ్గడంతో డిమాండ్ పెరిగింది. కల్లూరు ప్రాంతంలో కృష్ణాజిల్లా నుండి కూడా తాటికాయలు తీసుకొచ్చే ముంజలు అమ్మేవారు. తాటికాయలు దొరకపోవడం వల్ల వాళ్లు కూడా ఈ సీజన్లో రాకపోవడం సామాన్యులకి అందని ఫలంగా ముంజలు మారాయి.




అమ్మపాలెంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న మూడు దేవాలయాలు

- భక్తి పాటలతో మార్మోగుతున్న గ్రామం...
- భక్తులకు సకల సౌకర్యాలు కల్పిస్తున్న ఆలయ కమిటీ

నవతెలంగాణ-కొణిజర్ల





మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో నూతనంగా శ్రీ సీతా రామ లక్ష్మణ, భక్తంజనేయ శ్రీ వీరాంజనేయ స్వామి, శివాలయ శిఖర దేవాలయాలను నిర్మించారు. అదే విధంగా జీవధ్వజ ప్రతిష్టలు, శ్రీ శతలాపరమేశ్వరి (బొడ్రాయి), నవగ్రహాలు, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, జంటనాగేంద్ర, నందీశ్వర ప్రతిష్ఠలు ఈనెల 18 నుండి 22వ తేదీకు దేవాలయాల ప్రతిష్ఠ అంగరంగవైభవంగా జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ దేవాలయాల ప్రారంభాలు చతుర్దశి సోమవారం వైరా పట్టణ వాస్తవ్యులు బ్రబీ శ్రీ వేదమూర్తులు శ్రీ కతముక్కుల సంష్ కూమార్ శాస్త్రీ, గ్రామ పురోహితులు బ్రబీ శ్రీవే వ్యాకరణం మారుతీ కిషోర్ శర్మ హరి శివరామప్రసాద్ శర్మ ఆచార్య బ్రహ్మత్వములో పాంచాహ్నిక దీక్షతో ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. చివరి రోజున మహన్నదాన కార్యక్రమం సైతం భారీగా నిర్వహించబోతున్నారు. గ్రామమంతా మైక్‌లతో భక్తి పాటలతో మార్మోగుతోంది. గ్రామంలో ప్రశాంతమైన వాతవారణం నెలకొంది. ఐదురోజుల పాటు గ్రామమంతా బంధువుల రాకపోకలతో పండుగ వాతావరణం తోపాటు సందడిగా ఉండబోతోంది. ఒకేసారి మూడు దేవాలయాలు నిర్మించిన కమిటీ సభ్యులను గ్రామస్తులు అభినందిస్తున్నారు.

అఖిలభారత షెడ్యూల్ కులాలు, జాతుల హక్కుల పరిరక్షణ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామ

నవతెలంగాణ-సత్తుపల్లి



అఖిల భారత షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతుల పరిరక్షణ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా సత్తుపల్లి మండలం గంగారం గ్రామానికి చెందిన శ్రీరామ వెంకటేశ్వరరావు నియమితుల య్యారు. ఈ మేరకు ఆ సంఘ జాతీయ అధ్యక్షుడు దాసరి నాగరాజు వెంకటేశ్వరరావును నియమిస్తూ ఉత్వరులు అందించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర రావు మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన ఆయా జాతుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం ప్రజల్లో చైతన్యం కల్పించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ కోసం కృషి చేస్తానని ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రతి ప్రభుత్వ ఆఫీసుల్లో సమాచారం హక్కు చట్టం బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత న్యాయ సలహా కోసం ఒక ప్రభుత్వ న్యాయవాదిని ఏర్పాటు చేయటం, ప్రతినెలా మొదటి వారంలో ఎస్సీ, ఎస్టీ సమస్యలపై తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా దర్బార్ ఏర్పాటు చేయడం, గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యకు ప్రాధాన్యత ఇచ్చేందుకు ప్రతి ఒక్కరూ బడికి పోవాలని, మన ఊరు- మన బడి అనే విధానంపై దృష్టి పెట్టి పరిరక్షణ సంఘం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం బాధ్యతగా షెడ్యూల్ కులాలు షెడ్యూల్ జాతులకు సేవలు అందించడం జరుగుతుందని వెంకటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కల్లూరు

శ్రీరామ నావమి పర్వదినం సందర్భంగా బుధవారం మండలంలో వాడవాడనా శ్రీరామ కళ్యాణం వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని దాసాంజనేయ స్వామి దేవాలయంలో, ఖాన్ ఖాన్ పేట రామాలయంలో జరిగిన కళ్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రెండు దేవాలయాల్లో కమిటీలు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిధంగా పెద్ద చెరువు కట్ట వద్ద ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో కూడా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్ని శ్రీరామ కళ్యాణ మండపాలలో వడపప్పు బెల్లం పానకం పులిహోర భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయ కమిటీ సభ్యులతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పసుమర్తి చందర్రావు, భాగం ప్రభాకర్ చౌదరి, ఆలకుంట నరసింహారావు, బైర్ల కాంతారావు, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : జమలా పురం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి క్షేత్రం నందు అంగరంగ వైభవంగా సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం జరిగింది. దేవస్థానం తరపున అర్చకులు రాజీవ్ శర్మ దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించి శ్రీరామచంద్రమూర్తి స్వామి వారికి సీతమ్మ తల్లిని సమర్పించారు. బ్రహ్మశ్రీ పురాణం రవికుమార్ శర్మ శాస్త్ర ప్రకారంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. దేవాలయం తరపున కార్యనిర్వాహణాధికారి కొత్తూరు జగన్ మోహన్ రావు దంపతులు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, శ్రీవారి తరుపున పట్టు వస్త్రాలను ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. సాయంత్రం 5:30 నుండి గ్రామ సేవగా హనుమంతుని వాహనంపై నూతన వధూవరులైన సీతారామచంద్రస్వామి వాళ్లను ఊరేగించారు. ఈ కార్యనిర్వహణాధికారి కె.జగన్ మోహన్ రావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌ కర్యం కలగకుండా ఆలయ సిబ్బంది కల్యాణ మహోత్సవానికి పనిచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి జగన్ మోహన్ రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, మాజీ చైర్మన్ ఉప్పల జయదేవ శర్మ, ఆలయ పర్యవేక్షకులు కె.విజయ కుమారి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాస్, ఉప ప్రధాన అర్చకులు విజయ దేవశర్మ, అర్చకులు పాల్గొన్నారు.

వీడీవోస్ కాలనీలో శ్రీ రామనవమి కల్యాణ వేడుకలు

ఖమ్మం : నగరంలోని వీడీవోస్ కాలనీలో శ్రీ రామ నవమి సందర్భంగా బుధవారం శ్రీ సీతారాములు కల్యాణ మహోత్సవ కార్యక్రమం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా వేదపండితులు శ్రీ మాన్ భరత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కల్యాణంలో స్వామి వారి పీటల మీద తుళ్లూరి కోటేశ్వరరావు, నిర్మల దంపతులు, చేకూరి రమేష్ నిర్మల దంపతులు, చంద్ర శ్రీకాంత్, వీణ దంపతులు, తాళ్లూరి రామారావు దంపతులు కూర్చొని పూజా కార్యక్రమం నిర్వహించారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమం అనంతరం మహా అన్నదాన నిర్వహించారు. ఈ కళ్యాణ ఏర్పాట్లు ఆలయ కమిటీ గుంటుపల్లి శ్రీనివాస రావు, చెరుకూరి రమేష్, ఏపూరి మధుసూదన్, వెంకటేశ్వర్లు, బావనాసి కేశవ రావు పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేంద్ర, కొణిదెన శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

భద్రాద్రి @ 46 డిగ్రీలు..

- భగ్గుమంటున్న ఎండలు
- అల్లడిపోతున్న ప్రజలు

నవతెలంగాణ-కొత్తగూడెం



వేసవి కాలం ప్రారంభం నుండి భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వేసవి ఉష్ణోగ్రతలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. భానుడి భగభగల ఎండతో ప్రజలు అల్లాడిపోతున్నారు. రోజు రోజుకు పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.. బుధవారం జిల్లాలో అత్యధికంగా 46 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయి నమోదైనట్టు సమాచారం. ఒకపక్క శ్రీరామనవమి కల్యాణ వేడుకలు జరుగుతున్నాయి. మరోపక్క అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలపై వేసవి ప్రభావం తీవ్రంగా కనపించింది. ఉదయం నుండి ఆలయాల వద్ద కిక్కిరిసిన జనాలు వేడి వాతావరణం వల్ల ఇబ్బందులకు లోనవుతున్నారు. ఉదయం 7 గంటల నుండి భానుడి భగభగలు తీవ్రస్థాయికి చేరాయి. గత నెల రోజులుగా వేసవి తీవ్రత రోజుకు పెరుగుతుంది. గత వారం రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో బుధవారం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. వేసవి తాపాన్ని భరించలేక ప్రజలు ఇండ్ల నుండి బయటికి రావడానికి భయపడుతున్నారు. భద్రాచలంలో 44.7, జూలూరుపాడు 44.2 డిగ్రీలు నమోదు అయింది. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలకు పైగా నే నమోదు అయినట్లు రాష్ట్ర వాతావరణ శాఖ వెల్లడించింది.

నిర్లక్ష్యం వీడని అధికారులు

- చోడవరం తండా ప్రధాన రహదారిపై మురికి నీరు
- సీఈఓ పరిశీలించి నిధులు మంజూరు చేసిన నేటికీ మోక్షం లేదు

నవతెలంగాణ-వేంసూరు



దేవుడు వరం ఇచ్చినా పూజారి కరుణించలేదు అన్న విధంగా మండల అధికారి తీరుపట్ల చౌడవరం తండా ప్రజలు పడుతున్న ఇబ్బందులు గత కొన్ని ఏండ్లుగా చోడవరం రోడ్డు నుండి తండా వెళ్లి ప్రధాన బీటీ రహదారిపై మురికి నీరు ప్రవహిస్తోంది. కల్వర్టు సరిగా లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీలు పరిశీలనకు వచ్చిన సమయంలో గత సంవత్సరం జిల్లా పరిషత్ సీఈవో డీఎల్‌పీఓ పరిశీలించి పంచాయతీ అధికారి రంజిత్ కుమార్ నుండి వివరాలు తీసుకున్నారు. వెంటనే ప్రపోజల్ పెట్టాలని కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. జనవరిలో 3 లక్షలు నిధులు మంజూరైనా నేటి వరకు పనులు మొదలు పెట్టకపోవడం పట్ల అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తుంది. ఎవరైనా ప్రశ్నిస్తే ఎన్నికల కోడ్ సాగు చెప్పి కాలయాపన చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కల్వర్టుకు కేటాయించిన నిధులను వేరే పనులకు మార్చారని ఆరోపణలు వచ్చాయి. సర్పంచుల పదవీకాలం ముగిసి ప్రత్యేక అధికారులు బాధ్యతలు తీసుకున్న తర్వాత గ్రామపంచాయతీలో ప్రత్యేక అధికారులు చుట్టచూపుగా అయినా గ్రామాలకు రావడంలేదని గ్రామస్తులు అంటున్నారు. మరోవైపు తాగునీటి సమస్య అధికంగా ఉండటం పంచాయతీ అధికారి ప్రత్యేక అధికారులు పట్టించుకోకపోవడం పంచాయతీ కార్యదర్శులకు భారంగా మారింది. విషయంపై పీఆర్ఏఈ సాయి కృష్ణను వివరణ కోరగా కల్వర్టు నిర్మాణానికి మూడు లక్షలు మంజూరై మూడు నెలలు అవుతుందని ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత పనులు చేపడతామని అన్నారు.

9 మంది మావోయిస్టులను గుర్తించిన పోలీసులు





నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం కంకేర్ జిల్లా ఛోటేబెతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని హపటోలా, కల్బర్, బినాగుండ కరోనార్ సరిహద్దు అడవులలో పోలీసులకు- మావోయిస్టులకు జరిగిన ఎన్‌కౌంటర్ తర్వాత 29 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. చట్టబద్ధత కోసం జిల్లా ప్రధాన కార్యాలయం కంకేర్‌కు తీసుకువచ్చారు. డీఆర్జీ కాంకేర్ బీఎస్ఎఫ్ 94వ కార్ప్స్ సంయుక్త దళం నిర్వహించిన ఈ ఆపరేషన్‌లో, 15 మంది మహిళా మావోయిస్టులతో సహా మొత్తం 29 మంది యూనిఫారమ్‌లో ఉన్న మావోయిస్టు క్యాడర్‌ల మృతదేహాలను స్వాధీనం చేసుకోవడం గమనార్హం. ఎన్‌కౌంటర్‌లో స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రి ఇతర మావోయిస్టు సామగ్రిని కూడా గమనించారు. సంఘటనా స్థలంలో వెతకగా, మావోయిస్టు ఆయుధాలు ఒక ఏకే 47, రెండు ఎస్ఎస్ఏఎస్ రైఫిల్ - ఎస్ఎల్ఆర్ రైఫిల్ రెండు ఒక కార్బైన్, ఒక 303 రైఫిల్, మూడు 315, రెండు బోర్ రైఫిల్, - రెండు నైన్ పిస్టల్, రెండు మేడ్, రెండు లాంచర్, రెండు లోడ్ గన్, ఎనిమిది దేశవాళి తుపాకులు, హ్యాండ్ గ్రెనేడ్, మందుగుండు సామగ్రి, స్టూజ్, మావోయిస్టు సాహిత్యం, పేలుడు పదార్థాలు, నిత్యావసర వస్తువులు తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌కౌంటర్‌లో లభించిన 29 మంది మావోయిస్టుల మృతదేహాలలో ఇప్పటి వరకు మొత్తం తొమ్మిదింటిని ప్రాథమికంగా గుర్తించామని, వాటి వివరాలు వరుసగా ఈ క్రింది విధంగా ఉన్నాయని సీనియర్ పోలీసు సూపరింటెండెంట్, జిల్లా కంకేర్, శ్రీ ఇందిరా కళ్యాణ్ ఐలెస్లా తెలిపారు.

- శంకర్ రావు- డీవీసీ సభ్యుడు నార్త్ బస్తర్ డివిజన్ మాస్ ఇన్‌చార్జి
- లలిత - డీవీసీ సభ్యురాలు/పర్తాపూర్ ఏరియా కమిటీ ఇంచార్జ్/జనత సర్కార్ కోఆర్డినేటర్ ఇంచార్జ్.
- మాధవి- ఉత్తర బస్తర్ డివిజన్
- జుగ్ని అలియాస్ మాల్తీ- పార్తాపూర్ ఏరియా కమిటీ
- సుఖ్‌లాల్- పార్తాపూర్ ఏరియా కమిటీ
- శ్రీకాంత్- పార్తాపూర్ ఏరియా కమిటీ
- రూపి- ఫ్రాగ్ ఎల్వో ఎస్ కమాండర్
- రామశిలా- ఉత్తర బస్తర్ డివిజన్
- రంజితా పాటి శంకర్ రావు- నార్త్ బస్తర్ డివిజన్
- మిగిలిన మావోయిస్టుల మృతదేహాలను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. వారి మావోయిస్టు ప్రొఫైల్, క్రిమినల్ కేసుల్లో ప్రమేయం వంటి సమాచారాన్ని సేకరిస్తున్నారు.

చోరీలకు గురవుతున్న సెల్‌ఫోన్స్

నవతెలంగాణ-ముదిగొండ

మండల కేంద్రమైన ముదిగొండ పారిశ్రామిక ప్రాంతంలో వివిధ గ్రానైట్లో పనిచేస్తున్న వలస కార్మికుల సెల్‌ఫోన్స్ చోరీ చేయటమే టార్గెట్‌గా పెట్టుకొని దొంగలు అర్ధరాత్రి వేళ ఫ్యాక్టరీలో చొరబడి కార్మికుల సెల్‌ఫోన్స్‌ను ఎత్తుకెళ్లడం గమనార్హం. సిరి రాక్స్ గ్రానైట్ పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల నాలుగు సెల్ఫోన్లను బుధవారం దొంగలు అపహరించకపోయారు. గత నెల 30న జగదాంబ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికుల మూడు సెల్ ఫోన్స్ దుండగలు ఎత్తుకెళ్లిన విషయం విదితమే. దీంతో కార్మికులు లబోదిబో మంటున్నారు.

అంగరంగ వైభవంగా...సీతారాముల కల్యాణం

నవతెలంగాణ-సత్తుపల్లి



సత్తుపల్లి మండలం గంగారంలో బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. స్థానిక శ్రీదాసరి వీరారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కల్యాణ మంటపంలో ధశరథుని తనయుడు శ్రీరామచంద్రమూర్తికి జనకుని కుమార్తె సీతామహాలక్ష్మిల కల్యాణ మహోత్సవాన్ని గంగారం గ్రామానికి చెందిన సత్తుపల్లి మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షుడు దాసరి వెంకట్రామిరెడ్డి- రాజకుమారి (చిట్టినాయన) దంపతులు, వారి కుమారుడు దాసరి మధుమోహనరెడ్డి-శ్రీలక్ష్మి (మధుబాబు) దంపతుల ఆధ్వర్యంలో సుమారు రూ.5 లక్షల స్వయం వ్యయంతో సీతారాముల కల్యాణాన్ని అట్టహాసంగా జరిపించారు. సీతారాముల కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించారు.

నారాయణసేవలో పాల్గొన్న 5వేల మంది భక్తులు....

సీతారాముల కల్యాణం అనంతరం 5వేల మందికి భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. రుచికరమైన వంటలతో భోజనం వడ్డించారు. పచ్చని చెట్ల నడుమ టెంట్లు వేసి సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు. భోజనం చేసిన ప్రతి ఒక్కరికి ఐస్‌క్రీంను సైతం అందించారు. సొంత ఖర్చులతో శ్రీసీతారాముల కల్యాణాన్ని జరిపించి హాజరైన వారందరికి భోజనం అందించిన నిర్వాహకులు దాసరి వెంకట్రామిరెడ్డిని, ఆయన కుమారుడు మధుమోహనరెడ్డి (మధుబాబు) గ్రామస్తులు అభినందిస్తున్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు కోలగట్ల చెన్నకేశవరావు, నాగిరెడ్డి, యామాల ముత్యాలరావు, ఊకే రమేశ్ (కరాటే), అబ్బులురావు, జల్లిపల్లి వాసు, బత్తుల నారాయణ, కనసాని నాగేశ్, కర్నాటి వెంకటరావు, నెక్కంటి సాయిబాబా, రాచమళ్ల సత్యనారాయణ, జనార్ధనరావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ భక్త రామదాసు ధ్యాన మందిరం, శ్రీ రామాలయం, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం, బైరాగిగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంతో పాటు వివిధ గ్రామాలలోని దేవాలయాలలో శ్రీ సీతారాముల కల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. నేలకొండపల్లి భక్త రామదాసు ధ్యాన మందిరంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంచినీళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు, మండలంలోని కోరట్లగూడెం గ్రామంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం, పానకం పంపిణీ చేశారు. వివిధ గ్రామాలలో పులిహోర, మజ్జిగ, పానకం పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్త రామదాసు సర్వీస్ సొసైటీ అధ్యక్షులు పొన్నగాని శ్రీనివాస్, కార్యదర్శి తెలగొర్ల లింగస్వామి, కోశాధికారి దండ రవీంద్రబాబు, సభ్యులు వాసం లక్ష్మయ్య వల్లంచెట్ల భాస్కరరావు, ఎలమద్ది లెనిన్, దేవి ప్రసాద్, మానుకొండ రామారావు పాల్గొన్నారు.

ఖమ్మం : భద్రాచలం సీతారామచంద్ర స్వామి వారికి స్వర్ణంతో పొదిగిన పచ్చలహారంను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ తనయుడు డాక్టర్ పువ్వాడ నయన్ రాజ్ బుధవారం ఆలయంలో స్వయంగా స్వామి వారికి సమర్పించారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యపాలన చేసిన శ్రీరాముడు ఆదర్శ పరిపాలకుడని పువ్వాడ కొనియాడారు.

నగరంలోని శ్రీ.శ్రీ.శ్రీ భ్రమరాంబ సమేత గుంటుమల్లేశ్వర స్వామిదేవస్థానంలో శ్రీరామనవమి సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు, బాలసాని లక్ష్మీనారాయణ, సాదు రమేష్ రెడ్డి, బాలగంగాధర్ తిలక్, కమతం రామకృష్ణ, పాలకుర్తి నాగేశ్వరరావు, బాణాల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమి సందర్భంగా ఖమ్మం చెరువు బజార్ ప్రాంతంలో శ్రీ దాసాంజనేయ స్వామి వారి దేవస్థానంలో బుధవారం కళ్యాణం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్‌బిఐటి, ఆర్జేసి విద్యా సంస్థల అధినేత గుండాల కృష్ణ, 39వ డివిజన్ కార్పొరేటర్ మడూరి ప్రసాద్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మడూరి సైదారావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముని సేవలో త్రివేణి- కృష్ణవేణి విద్యాసంస్థలు

భద్రాచలంలోని బస్టాండ్, శ్రీకష్ణ దేవాలయం సమీపంలో శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా శ్రీరామ కల్యాణానికి విచ్చేసిన భక్తులకు మజ్జిగ, మంచినీటి, తలంబ్రాలు వితరణ చేశారు. భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిపో మేనేజర్ రామారావు ప్రారంభించారు. టెంపుల్ రోడ్‌లోని శ్రీకృష్ణదేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, పాఠశాల ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, పాఠశాల సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ, పాఠశాల వైస్ ప్రిన్సిపల్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేసిన ముస్లిం మైనార్టీలు

నగరంలోని ఇందిరానగర్ పర్ణశాల ఆలయ ప్రాంగణంలో శ్రీ నామ నవమి సందర్భంగా ముస్లిం మైనార్టీల ఆధ్వర్యంలో రామ్ భక్తులకు పానకం, మజ్జిగ, పులిహోర ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఫోర్త్ టౌన్ మైనార్టీ అధ్యక్షుడు యాకూబ్ పాషా, నాయకులు ఎమ్‌డి నవీద్ నవిద్ అసహర్, మహమ్మద్ సాబీర్, మహమ్మద్ సమీర్, షేక్ రియాజ్, ఎమ్‌డీ బాబా, ముజామిల్, ఎస్‌కె.ఇస్మాయిల్, ఎస్‌కె. ఇమ్రాన్, కాలిద్, యాసిన్ పాల్గొన్నారు.

కారేపల్లి : కారేపల్లి మండలంలోని ఆలయాలల్లో బుధవారం శ్రీ సీతారాములోరి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. గేటుకారేపల్లిలో తోటకూరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు తోటకూరి పిచ్చయ్య-సత్యావతి దంపతులు, మాణిక్యారంలో ఉప్తల భద్రయ్య, బంజరలో వెగ్గళం రాజు, కారేపల్లిలో అశోక్‌బాబ్, చిన్ని శ్రీను దంపతులు పీటలపై కూర్చొని దేవుడి పెండ్లి జరిపించారు. దేవుడి పెండ్లి సందర్భంగా ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలను కమిటీలు నిర్వహించారు. బంజరలో చెన్నంశెట్టి నాగేశ్వరరావు, నాగయ్య, చంద్రయ్యల ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదానంను సూరపురెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, ప్రముఖ వాస్తు పండితులు వెగ్గళం పుల్లాచారిలు ప్రారంభించారు.



ముదిగొండ: ముత్తారం సీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఆలయ ప్రధాన అర్చకులు బోర్రా వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. భద్రాచలంలో రాములోరి కళ్యాణం ఉదయం జరగగా చిన్న భద్రాద్రిగా పిలవబడే ముత్తారం సీతారామ చంద్రస్వామి ఆలయంలో సాయం సంధ్య వేళలో రాములోరి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడం విశేషం. స్వామివారికి పట్టువస్త్రాలు,తలంబ్రాలు ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకులు యలగొండస్వామి తలపై ఎత్తుకొని వచ్చి ఆలయ అర్చకులకు అందజేశారు. కార్యక్రమంలో గిడ్డింగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు దమ్మాలపాటి సరస్వతి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మినేని రమేష్ బాబు, సొసైటీ డైరెక్టర్ వనం ప్రదీప్త, కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లెల అజయ్, పసుపులేటి దేవేంద్రం, దేవదాయ శాఖ ఇన్స్పెక్టర్ సమత, ఈవో నారాయణచార్యులు, గ్రామ మాజీ సర్పంచ్ తాళ్ల నాగయ్య, యువజన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

మండలంలోని వెంకటాపురంలో బుధవారం అంగరంగా వైభవంగా శ్రీరామనవమి వేడుకలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిరహించారు. వివిధ గ్రామాలనుండి భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయ కమిటీ భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఎండ తాకిడి తగలకుండా భక్తులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చలవ పందిళ్ళు ఏర్పాటు చేసి, పానకం, మజ్జిక పంపిణీ చేశారు. సాయంత్రం స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు



తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కందుల బాలచందర్, రాయల వెంకటేశ్వర్లు, గుడిపూడి బుచ్చిరామయ్య, కందుల రంగారావు, మెరిట్ మోడల్ స్కూల్ చైర్మన్ కందుల శంకరయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వేంసూరు : హైకోర్టు న్యాయవాది మాదిరాజు వాసు కుటుంబ సభ్యులు 40 సంవత్సరాల క్రితం ఊరు వదిలి వెళ్లిన ఆ కుటుంబం చోడవరం తండాలో రాములోరి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గత సంవత్సరం ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలు అందించారు. ఆ కుటుంబంపై తండావాసులు ఆప్యాయత అనురాగాలు చూపించారు. తండావాసులు ఆ కుటుంబాన్ని ఘనంగా సత్కరించారు

తిరుమలాయపాలెం:దమ్మాయిగూడెం గ్రామంలో శ్రీరామనవమి కళ్యాణోత్సవం కూసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. కొక్కిరేణి, పిండిప్రోలు, ఎర్రగడ్డ, బీరోలు, కాకరవాయి, సుబ్లేడు పలు గ్రామాలలో నిర్వహించిన కళ్యాణ మహోత్సవంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకులు చావా శివరామకృష్ణ పాల్గొన్నారు.

బోనకల్ : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో బుధవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం రంగరంగ వైభవంగా జరిగింది. మండల కేంద్రంలో గల రామాలయాలలోనూ, బోనకల్, ముష్టికుంట్ల, రావినూతల, చొప్పకట్లపాలెం, చిరునోముల, మోటమర్రి, ఆళ్ళపాడు, నారాయణపురం తదితర గ్రామాలలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని పూజారులు రంగ రంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని గ్రామాలలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.











మతసామరస్యాన్ని చాటిన ముస్లిం సోదరులు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

అన్ని మతాల సామరస్యం తోటి వారికి సహాయం పడటమేనని మరోసారి రుజువైంది. శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో ఉదయ భాస్కర్ సెంటర్‌లో అబ్దుల్ కలాం ఫౌండేషన్ భద్రాచలం వారి ఆధ్వర్యంలో షర్బత్ తేనేటి పానీయం భద్రాచలం వచ్చిన భక్తులకు అందజేశారు. శ్రీరామనవమి పండక్కి వచ్చేటువంటి హిందూ భక్తులకు ముస్లిం సోదరులు పంచడం మంచి సంస్కృతి సంప్రదాయంగా పలువురు అభిప్రాయపడుతుండగా మరోసారి భద్రాచలంలో మతసామరస్యం వెదజల్లిందని అంటున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్కే.మస్తాన్, ఇమామ్, ఖలీల్, బాబాజీ, జావిద్ ఖాన్, ఇబ్రహీం, కరిముల్లా, భాషా, అలీ, సాదిక్, అర్షద్, సాదిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.



శ్రీరాముని సేవలో త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థలు

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణంలోని బస్టాండ్, శ్రీకృష్ణ దేవాలయం సమీపంలో శ్రీ సీతారాముల కళ్యాణం సందర్భంగా భద్రాచలానికి విచ్చేసిన భక్తులకు యాత్రికులకు త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా మజ్జిగ మంచినీటి, తలంబ్రాలు వితరణ చేశారు. భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏర్పాటుచేసిన స్టాల్‌ను డిపో మేనేజర్ ప్రారంభించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ. ప్రతి సంవత్సరం త్రివేణి కృష్ణవేణి విద్యాసంస్థల తరపున భక్తులకు మజ్జిగ, మంచినీటి, తలంబ్రాలు వితరణ చేయడంలో విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ కనబరిస్తున్న శ్రద్ధ ప్రశంసనీయమని కొనియాడారు. అలాగే టెంపుల్ రోడ్‌లోని శ్రీకృష్ణదేవాలయం సమీపంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు 50 వేల మజ్జిగ ప్యాకెట్లు, 30 వేల మంచినీళ్ల ప్యాకెట్లు అదేవిధంగా 1, తలంబ్రాలు ప్యాకెట్లను పంపిణీ చేశామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో పర్ణశాల జీపీ మెరుగైన సేవలు

నవతెలంగాణ-దుమ్ముగూడెం

భద్రాచల రామాలయానికి అనుబంధ ఆలయమైన పర్ణశాల రామాలయంలో నిర్వహిస్తున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా పర్ణశాల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మెరుగైన సేవలు అందించారు. మండల పంచాయతీ అధికారి పీ.ముత్యాలరావు, పర్ణశాల గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళ, బుధవారాలలో 30 మంది జిపి కార్యదర్శుల ఆధ్వర్యంలో 75 మంది పారిశుద్ధ్య కార్మికులతో ప్రత్యేక శానిటేషన్ పనులు నిర్వహించారు. దీంతో పాటు ఐదు సెంటర్లలో తాగునీటి కౌంటర్లు ఏర్పాటు చేసి సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు చల్లని తాగునీటి వసతి కల్పించారు. దీంతోపాటు వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని పలుచోట్ల టెంట్లు ఏర్పాటు చేశారు. దీంతోపాటు గోదావరి ప్రాంతంలో భక్తులు స్నానమాచరించేందుకు షెవర్లు ఏర్పాటు చేశారు. దీంతోపాటు భక్తుల కోసం 15 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో భాగంగా శ్రీ సీతారాముల కల్యాణానికి విచ్చేసిన భక్తులకు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనుల పట్ల భక్తులు కొనియాడుతున్నారు.

నీటి సమస్య రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం

- మున్సిపల్ చైర్మెన్ డీవీ

నవతెలంగాణ-ఇల్లందు



మున్సిపాలిటీ పరిధిలో నీటి సమస్యలు రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టామని మున్సిపల్ చైర్మెన్ డీవీ తెలిపారు. బుధవారం వార్డుల్లో పర్యటించారు. మున్సిపాలిటీ పరిధిలో 24వ వార్డులో ఉన్న సిఎస్ఐ చర్చి పక్కన సందులో రెండు రోజులకు వస్తున్న పంపులు సన్నగా వస్తున్నాయని ఇబ్బంది పడుతున్నట్లు దృష్టికి తీసుకురాగా అక్కడికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత సిబ్బందిని పిలిపించి రేపటిలోగా నీటి సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం వారు మాట్లాడుతూ వేసవికాలంలో నీటి సమస్య రాకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని, ఎక్కడ ఏ సమస్య వచ్చిన వెంటనే మాకు తెలియజేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు కమిటీ సభ్యులు ఫిట్టర్ ఫయాజ్ బాబా, జవాన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా గద్దల రమేష్

నవతెలంగాణ-పాల్వంచ



పాల్వంచకు చెందిన మాజీ సర్పంచ్ గద్దల రమేష్ భద్రాద్రి జిల్లా మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షులుగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ఈనెల 20న పాల్వంచ మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ వజ్ర ఇన్ హోటల్ లో ఘన సన్మానానికి ఆ సంఘ నేతలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పిడమర్తి రవి నేతృత్వంలో రమేష్ కు ఈ నెల20న శనివారం ఉదయం 11.00 గంటలకు వజ్ర హోటల్లో ఘన సన్మానం ఏర్పాటు చేసినట్లు సంఘ జేఏసీ రాష్ట్ర కమిటీ ఓ ప్రకటన విడుదల చేసింది భద్రాద్రి జిల్లా జేఏసీ నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు అధిక సంఖ్యలో పాల్గొని సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.



కేతేపల్లికి సత్కారం

నవతెలంగాణ-ములకలపల్లి

మండల కేంద్రంలోని శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో గత మూడు దశాబ్దాలుగా భక్తులకు సేవలందిస్తున్న కేతేపల్లి నాగరత్నాన్ని గ్రామస్థులు, మున్నూరుకాపు సంఘం మహిళా ప్రతినిధులు బుధవారం శ్రీరామనవమి సందర్భంగా శాలువాతో ఘనంగా సత్కరించారు. సీనియర్ పాత్రికేయులు అయితా శేషే గిరిరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేతపల్లి నాగరత్నంకు మొత్తం. రూ.16వేలు ఆర్థికసాయంగా అందజేశారు. మున్నారుకాపసంఘం మహిళలు రూ.3వేలు అందజేశారు. ఆమెతో పాటు ఆలయకమిటీ అధ్యక్షులు శెనగపాటి రవి. పురోహితులు ముకుందాల సత్యనారాయణ శాస్త్రిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

రమణీయం... కమనీయం...



సీతారాముల కల్యాణ వైభోగం

- భూలోకంలో వైకుంఠాన్ని తలపించిన రాములోరి కల్యాణ వేడుకలు
- కల్యాణానికి పట్టు వస్త్రాలను సమర్పించిన సీఎస్ శాంతకుమారి
- శ్రీరామ నామ స్మరణంతో మారుమోగిన భద్రగిరి
- నేడు పట్టాభిషేక మహోత్సవం



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

ఆణిముత్యములు తలంబ్రాలుగా...ముక్కోటి దేవతలే భక్తజన రూపం లో ఆసీనులు కాగా...మంగళ వాయిద్యాలు వైష్ణవ వేదమంత్రోత్సవాల నడుమున..అంగరంగ వైభవంగా మిథిల పురిలో అభిజిత్ లగ్నంలో సీతారాముల పరిణయ వేడుకలు జరగగా ఆబాలగోపాలాని అలరించిన మధుర క్షణాలలో శ్రీరామ జయరామ జయ జయ రామ అంటూ భక్తులు చేసిన ద్వానాలతో భద్రగిరి మారుమోగింది. శ్రీ సీతారాముల తిరు కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం సీతారామచంద్ర స్వామి వారి దేవస్థాన ఆవరణలోని అపురూప విధుల ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ సీతారాముల కళ్యాణం వైష్ణవ సంప్రదాయంలో ఆధ్యాత్మికంగా రమణీయంగా.. కమనీయంగా ముక్కోటి దేవతలు మురిసిపోయేలాగా వైభవంగా జరిగింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్య కార్యదర్శి శాంత కుమారి దంపతులు కళ్యాణ మహోత్సవానికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించగా భక్త రామదాసు చేయించిన ఆభరణాలను సీతమ్మకు అలంకరించి కచ్చితంగా 12 గంటలకు అభిచిత్తు లగ్నంలో జీలకర్ర బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సుపై ఉంచి కళ్యాణ కృతువు నీ నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామునే సుప్రభాత సేవ అనంతరం మూలమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ముందుగా ఏకాంతంగా కళ్యాణ నిర్వహించారు. అనంతరం మంగళ వాయిద్యాలతో భక్తుల జయ జయ ద్వానాల నడుమ పల్లకిలో సీతారాములను కళ్యాణ మండపం వద్దకు తరలించి కళ్యాణ తంతులో ఎటువంటి ఆటంకాలు జరగకుండా విశ్వక్సేన పూజ హవాచనం చేసి కళ్యాణానికి ఉపయోగించే సకల వస్తువు సామాగ్రికి సంప్రోక్షణ నిర్వహించారు. అనంతరం ఎనిమిది మంది వైష్ణవులకు తాంబూలాది సత్కారాలను చేసి కన్యవర్ణం చేశారు. తదుపరి సీతారాముల వంశాల గోత్రనామాలను పఠించి స్వామి పాదప్రక్షాళన అనంతరం మహా సంకల్పానికి అనుగుణంగా కన్యాదానం జరిపించారు. అనంతరం మంగళ వాయిద్యాలు మారుమొగుతుండగా వేదమంత్రాల మధ్య లక్షలాది నేత్రాలు తిలకిస్తుండగా కళ్యాణ మహోత్సవానికి తరలివచ్చిన అతిరథ మహారథుల సమక్షంలో అభిజిత్ లగ్నం సమీపించగానే సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. వేలాది మందితో నిండిపోయిన మిథిల ప్రాంగణంలో శ్రీరామ నామ జపంతో మారు మోగుతుండగా ఆలయ వైద్యక సిబ్బంది సీతారాముల కళ్యాణ విశిష్టతను మైకులో రేడియోలో టీవీల ద్వారా వ్యాఖ్యానం చేశారు. దేశ నలుమూలల నుండి వచ్చిన యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ వారు సెక్టార్లను ఏర్పాటు చేశారు. వేసవి కాల నేపథ్యంలో ప్రాగణం మొత్తం కూలర్లు ఫ్యాన్లతో వేసవి తాపాన్ని తగ్గించే ప్రయత్నం చేశారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన స్వామివారి ముత్యాల తలంబ్రాల కోసం భక్తులు తోపులాటకు దిగకుండా పట్టణ వ్యాప్తంగా 60 కౌంటర్ల ద్వారా స్వామివారి తలంబ్రాల ప్యాకెట్లను ఉచితంగా భక్తులకు అందించారు.



భద్రాచలానికి రాలేని భక్తుల కోసం ఆర్టీసీ కార్గో పోస్టల్ సేవల ద్వారా ముందుగా బుక్ చేసుకున్న భక్తులకు నేరుగా ఇంటికే తలంబ్రాలు పంపించే అవకాశాన్ని కల్పించారు. స్వామి వారి లడ్డు ప్రసాదం కూడా అందరికీ అందే విధంగా సుమారు 19 కౌంటర్ల ద్వారా విక్రయించారు. సీతారాముల కల్యాణ మహోత్సవానికి ప్రభుత్వానికి చెందిన ఉన్నత అధికారులతో పాటు హైకోర్టు న్యాయమూర్తి దేవదాయ కమిషనర్ హనుమంతరావుతో పాటు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా, మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా కళ్యాణ మహోత్సవానికి ప్రత్యక్షంగా హాజరై తిలకించారు.

నేడు భద్రాద్రి రాముడికి పట్టాభిషేకం మహోత్సవం...

జనక మహారాజు కుమార్తె సుగుణాల శీలి సీతమ్మతో పరిణయ వేడుకలు ముగించుకున్న దశరథ మహారాజు ప్రథమ పుత్రుడైన సీతారామచంద్రస్వామికి నేడు భద్రాచలంలో పట్టాభిషేక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఆగమశాస్త్రం ప్రకారం శ్రీరాముడు జన్మించిన రోజునే కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించే వైద్యక అర్చకులు మరునాడు పట్టాభిషేక మహోత్సవ నిర్వహించడం ఆనవాయితీ. సీతారాముల కళ్యాణ మహోత్సవానికి ఏమాత్రం తీసిపోని ప్రాధాన్యత గల పట్టాభిషేక మహోత్సవానికి రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ హాజరై పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. గవర్నర్ పర్యటనకు సంబంధించి ఇప్పటికే ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేయగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ప్రతిక్ జైన్, దేవాదాయ కమిషనర్ హనుమంతరావుతో పాటు భద్రాచలం దేవస్థానం ఈవో రమాదేవి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కళ్యాణ మహోత్సవ అనంతరం బుధవారం సాయంత్రం ఏడు గంటల సమయంలో రామ భక్తులు శ్రీరామ దీక్ష చేపట్టనుండగా ఆ తంతు కూడా కావలసిన ఏర్పాట్లను ఆలయ అధికారులు చేశారు.



పర్ణశాలలో వేడుకగా 'ఆదిదంపతులు' శ్రీ సీతారాముల కల్యాణం

- కల్యాణాన్ని కనులారా వీక్షించి తరించిన భక్త జనులు



దుమ్ముగూడెం : భద్రాచల పుణ్యక్షేత్రానికి అనుబంధ ఆలయమైన పర్ణశాలలో ఆది దంపతులు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని చూపులు కలసిన శుభమహూర్తాన క్రోధి నామ సంవత్సరం పునర్వసు నక్షత్రం అభిజిత్ లగ్నమందు అర్చకస్వాములు శ్రీ సీతారాముల కళ్యాణాన్ని బుధవారం వేడుకగా నిర్వహించారు. స్వామి వారికి భద్రాచలం దేవస్థానం తరపున పట్టు వస్త్రాలు ఏఈఓ శ్రవణ్ కుమార్ దంపతులు, ఆలయ ప్రత్యేక అధికారి సీసీ అనిల్‌కుమార్ దంపతులు అందజేశారు. తెల్లవారుజామున గోదావరి జలాలతో గర్భాలయం సంప్రోక్షణ అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు స్వామి వారిని మేళతాళాలు మంగళవాయిద్యాల నడుమ కళ్యాణ కట్ట ప్రదేశానికి తోడ్కొని వచ్చారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల శ్రీ సీతారాముల కళ్యాణ క్రతువులో భాగంగా అర్చకస్వాములు ఆలయ ప్రధాన అర్చకులు శేషం కిరణ్ కుమార్ ఆచార్యుడు, పొడిచేటి రామభద్ర ఆచార్యులు, భరద్వాజ చార్యులు, పొడిచేటి సీతారామ ఆచార్యులు, నరసింహచార్యులు, వేద పండితులు రవికుమార్ శర్మలు స్వామివారికి పుణ్యాహవచనం, సంప్రోక్షణ, యజ్ఞోపవేతధారణ, కంకణ ధారణ, స్వామి వారి, అమ్మవారి గోత్రనామాలు, యోత్రధారణ, ద్వితీయ యజ్ఞోపవేతధారణ, వంటి కార్యక్రమాలతో పాటు కళ్యాణంలో పాల్గొన్న దంపతులకు కంకణధారణ నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాదప్రక్షాళన, స్వర్ణ అభరణాల సమర్పణ అనంతరం పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం స్వామివారికి మహాసంకల్పం, మగళాష్టకాలు, కన్యాదానం నిర్వహించి మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నమందు జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ నిర్వహించారు. వివాహ కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి స్వామి వారికి మాల మార్పిడి కార్యక్రమంలో భాగంగా పూల దండలతో ఆటలు వంటి కార్యక్రమాలు ఉల్లాసంగా నిర్వహించారు.



అనంతరం అక్షితారోహణ నిర్వహించి కళ్యాణ తంతును శాస్త్రోక్తంగా ముగించారు. కళ్యాణం అనంతరం స్వామి వార్లను మేళ తాళాలు మంగళవాయిద్యాలతో ఆలయంలోకి తీసుకు వెళ్లారు. కళ్యాణం జరుగుతున్న సమయంలో పుణ్య నేల పర్ణశాల భక్తుల జయ జయ ధ్వనుల మధ్య, జయ రామ, జయ రామ జయజయ శ్రీరామ ధ్వనులతో మార్మోగింది. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామి వారి కళ్యాణాన్ని కనులారా వీక్షించారు. భక్తులకు కౌంటర్ల ద్వారా స్వామివారి కళ్యాణ తలంబ్రాలను అందజేశారు. పర్ణశాల గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుంగా మంచినీటి వసతితో పాటు, టెంట్లు ఏర్పాటు చేశారు. దుమ్ముగూడెం సీఐ బొడ్డు అశోక్ పర్యవేక్షణలో ఎస్సైలు కేశవ్, గణేష్‌లు, సీఆర్పీఎఫ్, పోలీసు బలగాలతో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కళ్యాణాన్ని తిలకించిన వారిలో జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, తహశీల్దార్ పీ. చంద్రశేఖర్, ఎంపీఓ ముత్యాలరావు, నీటిపారుదల శాఖ ఏఈఈ రాజ్ సుహాస్, పర్ణశాల గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవతెలంగాణ ప్రత్యేక సంచికను ఆవిష్కరణ

నవతెలంగాణ-భద్రాచలం రూరల్

శ్రీరామనవమి సందర్భంగా నవతెలంగాణ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో విడుదల చేసిన సీతారాముల కళ్యాణం చూద్దాం రారండి ప్రత్యేక సంచికను లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్ బాబు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ కథనాలను రాయడంతోనే పత్రికల విలువ పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. మారుతున్న డిజిటల్ యుగములో కూడా పత్రిక రంగానికి ఉన్న ప్రాధాన్యత చెక్కుచెదరలేదన్నారు. కళ్యాణ బ్రహ్మోత్సవాల సందర్భంగా నవతెలంగాణ ఆవిష్కరించిన ఆధ్యాత్మిక సంచిక మంచి సమాచారాలతో కూడిన కథనాలను అందించిందని కొనియాడారు. ఆవిష్కరణ కార్యక్రమంలో భద్రాచలం రిపోర్టర్ దారిశెట్టి సతీష్ బాబు, డివిజన్ ఇంచార్జి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



అన్నదానం, మజ్జిగ, పానకాలు పంపిణీ



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయిబాబా మందిరంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో మజ్జిగ, పానకం, అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కీర్తిశేషులు శ్రీ సాయిబాబా ఆలయ మాజీ అధ్యక్షులు మాగంటి సూర్యం జ్ఞాపకార్థంగా వారి కుటుంబ సభ్యులచే యాత్రికులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారని అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, మాగంటి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి చారుగుళ్ళ సుబ్రహ్మణ్యం, కోశాధికారి కుంచాల రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ చైర్మెన్ బీవీ.రాజు, వైస్ చైర్మెన్ కళ్యాణిల ఆదేశానుసారం జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మి ఆధ్వర్యంలో భద్రాచలం వచ్చిన యాత్రికులకు పానకం మజ్జిగ మంచినీళ్లు పంపిణీ చేశారు. సుమారు 2000 మంది యాత్రికులకు పానకం మజ్జిగ మంచినీళ్లను అందించారు. ఈ సందర్భంగా దిశ ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షురాలు పూజల లక్ష్మీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు, భద్రాచలం మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి : శ్రీరామనవమి సందర్భంగా లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్ల పెద్దతండ గ్రామం నందు మాజీ జడ్పిటిసి బాధావత్ రామకోటి, గ్రామ పెద్దలు,భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో శ్రీరామనవమి సందర్భంగా పానకం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో లౌడియా పూర్ణ చందూలాల్ ,రమేష్ ధరావత్ వెంకన్న, భూక్యా జాను, లకవత్ శివ, నునవత్ విజయ్,గొగ్గల సుధీర్,ధరవత్ కిష్ట,భూక్యా బిచ్చ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం : ఎండలను సైతం లెక్కచేయకుండా పర్ణశాల శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం, మజ్జిగ పానీయాలు, బెల్లం పానకాలు అందజేసి దాతలు వారి ఆకలి దప్పికలు తీర్చారు. పర్ణశాల కళ్యాణ మండపం వద్ద సారపాక, ఏలూరు పట్టణానికి చెందిన కొంతమంది వ్యక్తులు సుమారు రెండువేల మందికి అన్నదానం అందజేశారు. దీంతోపాటు పర్ణశాలకు చెందిన జొన్నలగడ్డ నవీన్ సుమారు 1000 మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు అందజేశారు. సీతానగరం, గోవిందపురం గ్రామానికి చెందిన నల్లపు అరవింద్, తెల్లం హరికృష్ణ ఆధ్వర్యంలో పది వాటర్ డ్రమ్ముల బెల్లం పానకాలను అందజేశారు. దీంతోపాటు చిన్న బండిరవు గ్రామంలో గల శ్రీకృష్ణ ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మజ్జిగ, బెల్లం పానకాలను రహదారి వెంట వెళ్లే భక్తులకు అందజేసి వారి దహతి తీర్చారు. పెద్ద నల్లబెల్లి ముత్యాలమ్మ ఆలయం వద్ద బెల్లం పానకాలు అందజేశారు. దాతలు తమవంతుగా రామ భక్తుల ఆకలి దప్పులు తీర్చి రామ భక్తిని చాటుకున్నారు.

బూర్గంపాడు : మండల గ్రామీణ వైద్యులు శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా భద్రాచలం వెళ్లే, స్థానిక భక్తులకు బుధవారం మజ్జిగ, పానకం, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. భద్రాద్రిలో శ్రీసీతారాముల పరిణయ వేడుకకు వెళుతున్న భక్తులకు, సారపాక పరిసర ప్రాంత భక్తులకు వీటిని అందించి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీలు పాల్గొన్నారు.

సంస్కృతీ సాంప్రదాయాల పరిరక్షణకు పండుగలు దోహదం

- ఐక్యంగా ఉత్సవాలు జరుపుకొని మతసామరస్యాన్ని చాటుదాం
- శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కూనంనేని

నవతెలంగాణ-కొత్తగూడెం

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకుకొని వాటిని భావితరాలను అందించేందుకు ప్రతీఏటా జరుపుకునే పండుగలు, ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా కొత్తగూడెం పట్టణం, లక్ష్మి దేవిపల్లి, చుంచుపల్లి మండలాల పరిధిలోని రామాటాకీస్ ఏరియా, రుద్రంపూర్, గౌతంపూర్, రామాంజనేయకాలనీ, ఎంజిరోడ్, పంజాబ్ గడ్డ, రామవరం గాంధీకాలనీ, నాగయ్యగడ్డ, సర్వారం, చుంచుపల్లి తదితర బస్తీలు, గ్రామాల్లో బుధవారం జరిగిన సీతారాముల కళ్యాణ వేడుకల్లో పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల మతాలకతీతంగా పండుగలన్ని కలిసికట్టుగా జరుపుకొని మతసామరస్యాన్ని చాటడంతోపాటు భారతీయ సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబీర్ పాషా, నాయకులు చంద్రగిరి శ్రీనివాసరావు, దుర్గరాశి వెంకటేశ్వర్లు, సలిగంటి శ్రీనివాస్, వి.మల్లికార్జున్ రావు, జి.వీరస్వామి, కె.రాములు తదితరులు పాల్గొన్నారు.



పాల్వంచ : భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకుకొని వాటిని భావితరాలను అందించేందుకు ప్రతీఏటా జరుపుకునే పండుగలు, ఉత్సవాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీరామనవమ పర్వదినం సందర్భంగా బుధవారం పాల్వంచ పట్టణ పరిధిలోని భజన మందిరం గ్రౌండ్, బొల్లోరిగూడెం, కాంట్రాక్టర్స్ కాలనీ, రాహుల్ గాంధీ నగర్, జయమ్మ కాలనీ, సీతారామపట్నం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రాముడు కల్యాణ వేడుకల్లో పాల్గొని భక్తులకు, ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీశంశెట్టి పూర్ణచంద్రరావు, జిల్లా సమితి సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, అన్నారపు వెంకటేశ్వర్లు, ముత్యాల కిరణ్ కుమార్, రాకేష్, పాషా, జకరయ్య, రామకృష్ణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా సీతారాముల కల్యాణం

- హాజరైన మండల ప్రముఖులు

నవతెలంగాణ-ఆళ్ళపల్లి

మండల కేంద్రంతో పాటు మర్కోడు, తదితర గ్రామాల్లోని రామాలయాలను శ్రీరామ నవమి సందర్భంగా మంగళవారం అర్ధరాత్రి వరకు భక్తులు సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. అందులో భాగంగా బుధవారం జరిగిన సీతారాముల కళ్యాణం దాదాపు అన్ని గ్రామాల్లో కన్నుల పండువగా సాగింది. ఆళ్ళపల్లి, మర్కోడు గ్రామాల్లో జరిగిన సీతారామ కల్యాణాన్ని వీక్షించడానికి చుట్టుపక్కల గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణ కార్యక్రమం అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కాగా, ఆళ్ళపల్లి రామాలయానికి ఓ ప్రత్యేకత సంతరించుకుంది. ఇక్కడ శ్రీరామనవమి ఉత్సవాలు భద్రాచలంలో మాదిరి ఐదు రోజులపాటు కొనసాగటం గమనార్హం. ముందురోజు అభిషేకాలు, ఎదుర్కోళ్ల మహోత్సవం, రెండోరోజు కళ్యాణం, మూడోరోజు దొంగల దోపిడి, నాల్గోరోజు నాగవెల్లి, చివరిరోజు వసంతోత్సవంతో శ్రీరామ నవమి ఉత్సవ కార్యక్రమాలు ముగియనున్నాయి.



ఈ కళ్యాణం కార్యక్రమానికి ఆయా చోట్ల హాజరైన ప్రముఖుల్లో గౌరిశెట్టి నాగభూషణం, అనుమోల వెంకటేశ్వర్లు (మర్కోడు), తాళ్లపల్లి రామ్మూర్తి, నరెడ్ల వెంకన్న, తాళ్లపల్లి నాగేశ్వరరావు, గౌరిశెట్టి శ్రీనివాసరావు, అబ్బు నాగేశ్వరరావు, బూరుగడ్డ రాములు, నరెడ్ల శ్రీనివాసరావు, సిరినోముల శ్రీనివాస్, తులం ముత్తిలింగం, సిరినోముల నరేష్, నువ్వుల నర్సింహారావు, సిరినోముల సతీష్, గౌరిశెట్టి చంద్రశేఖర్, బూరుగడ్డ నాగేష్, బూర్ల రాంబాబు, రథం నారాయణ, సతీష్, తదితరులు ఉన్నారు.



రాములోరి కల్యాణ వేడుకల్లో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

నవతెలంగాణ-దమ్మపేట

దమ్మపేట మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో అశ్వారావుపేట నియోజకవర్గ శాసన సభ్యులు జారె ఆదినారాయణ పాల్గొన్నారు. మండలంలోని మందలపల్లి గ్రామంలో గల రామాలయంలో జరిగిన వేడుకల్లో కమిటీ ఆహ్వానం మేరకు జారె పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. గండుగులపల్లిలో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో కుటుంబ సభ్యులతో పాల్గొన్న జారె రాములోరి కల్యాణాన్ని తిలకించారు. అదే విధంగా మండల కేంద్రం దమ్మపేటలో జరిగిన నవమి వేడుకల్లో జారె పాల్గొని ప్రజలకు శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరామచంద్రుని కృపాకటాక్షాలు ఉండాలని ఆకాంక్షించారు. ఇదే క్రమంలో గండుగులపల్లి, దురదపాడు గ్రామాల్లో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జారె స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

నవతెలంగాణ-అశ్వారావుపేట



భద్రాద్రి శ్రీ సీతారామచంద్ర స్వామివారి తిరు కళ్యాణ మహోత్సవం సందర్భంగా బుధవారం క్షత్రియ సేవాసమితి అశ్వారావుపేట ఆధ్వర్యంలో స్థానిక బస్ స్టాండ్ ప్రయాణీకుల ప్రాంగణంలో రెండు వేల మంది ప్రయాణీకులకు మంచినీరు, మజ్జిగ, పానకం, పులిహోర ప్యాకెట్ లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్షత్రియ సేవా సమితి బాధ్యులు సోమరాజు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బస్ స్టాండ్ కంట్రోలర్ నార్లపాటి సునీత, క్షత్రియ సేవా సమితి బాధ్యులు పెన్మత్స సత్యనారాయణ, రాజు, ప్రసాద రాజు, గొట్టిముక్కల చంటి రాజు, మురళీ రాజు, భూపతి రాజు కృష్ణం రాజు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

అధికారులు విధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా

నవతెలంగాణ-బూర్గంపాడు



భద్రాచలంలో గురువారం నిర్వహించనున్న మహా పట్టాభిషేకం కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ వస్తున్నందున విధులు కేటాయించిన అధికారులు ఉదయం 6 గంటలకే కేటాయించిన విధులకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా తెలిపారు. గవర్నర్ పర్యటనపై బుధవారం ఐటీసీ విశ్రాంతి భవనంలో రెవెన్యూ, డిఆర్ డిఎ, జడ్పి, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీరామ వేడుకలకు విధులు కేటాయించిన సెక్టార్ల అధికారులు సకాలంలో సెక్టార్లకు చేరుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని ఏర్పాట్లు పర్యవేక్షించారని ఆమె అన్నారు. మహా పట్టాభిషేకం కార్యక్రమాలకు కూడా స్ఫూర్తితో ఉదయం 6 గంటలకు సెక్టార్లకు చేరుకొని ఏర్పాట్లు పర్యవేక్షిం చాలని ఆమె పేర్కొన్నారు. గవర్నర్ టైం టు టైం షెడ్యూల్ ఫాలో కావాలని ఆమె అధికా రులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్డిఒ విద్యాచందన, జడ్పి సీఈవో ప్రసూన రాణి, డిపిఓ చంద్రమౌళి, ఆర్డిఓలు దామోదర్ రావు, మధు, ఎస్డీసి సుమ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ప్రయివేటు డ్రైవర్ మృతి

- సంస్థ 20 లక్షల ఎక్స్ గ్రేషియా, ఉద్యోగం ఇవ్వాలి
- సీఐటీయూ, ఐఎఫ్టీయూ డిమాండ్

నవతెలంగాణ-ఇల్లందు



సింగరేణి సంస్థలో ప్రయివేటు డ్రైవర్గా పనిచేస్తూ విది నిర్వహణ లో ఉండగా అనారోగ్యానికి గురయ్యి ప్రసాద్ మృతి చెందారు. కుటుంబానికి బేషరతుగా రూ.20 లక్షలు ఎక్స్గ్రేషియా చెల్లించాలని, కాంట్రాక్టర్ ద్వారా మట్టి ఖర్చులకు రూ.20వేలు, సింగరేణి సంస్థ నుండి, అధికారుల నుండి ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేయాలని, మృతుడి భార్యకు సింగరేణి కాంట్రాక్టు ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ, ఐఎఫ్టీయూ డిమాండ్ చేసింది. సింగరేణి సంస్థ ప్రైవేటు వాహన డ్రైవర్ కంప ప్రసాద్ ఆన్ డ్యూటీలో ఉండగా స్ట్రోక్ గురియై మృతి చెందిన సంఘటనపై బుధవారం సీఐటీయూ, ఐఎఫ్టీయు సంఘాల ఆధ్వర్యంలో సింగరేణి ఎస్వో టు జీఎం మల్లయ్య కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ, ఐఎఫ్టీయు నాయకులు అబ్దుల్ నబి, షేక్ యాకుబ్ షావలిలు మాట్లాడుతూ సమస్య పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం తాళ్లూరి కృష్ణ, గుండాల వెంకన్న డ్రైవర్లు పాల్గొన్నారు.

వాడవాడలా సీతారాముల కల్యాణం

నవతెలంగాణ- బూర్గంపాడు

పారిశ్రామిక ప్రాంతమైన సారపాకతో మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు బుధవారం అంబరాన్నంటాయి. శ్రీరామనవమిని పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో శ్రీసీతారామ చంద్రస్వామి వారి కల్యాణాన్ని అర్చకులు, పూజారులు వైభవంగా, కన్నులపండువగా నిర్వహించారు. సారపాకలోని సాకేతపురి ఆంజనేయస్వామి ఆలయంలో, శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో, శివాలయాలతో పాటు గాంధీనగర్ కనకదుర్గమ్మ ఆలయం, శ్రీరాంపురంలోని ఆంజనేయస్వామి ఆలయం తదితర ఆలయాల్లో ఆలయకమిటీ నిర్వాహకులు శ్రీసీతారాముల కల్యాణాన్ని వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఘనంగా నిర్వహించారు. రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్య లో ఉదయం నుంచే ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్న సమయంలో స్వామివారి కల్యాణాన్ని తిలకించి పునీతులయ్యారు. అదేవిధంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగ కుండా సారపాక పంచాయతీ ఈవో కంది మహేష్ ఆధ్వర్యంలో మజ్జిగ, పానకం, మంచినీరు భక్తులకు అందించగా ఆలయకమిటీల నిర్వాహకులు, పలు కులసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రాజకీయ పార్టీల నేతలు సారపాక ప్రధాన సెంటర్లో మధ్యాహ్నం అన్నదానాలు, బెల్లం పానకం, మజ్జిగ, పులిహోర ప్యాకెట్లను భక్తులకు పంపిణీ చేశారు.

పినపాక : పినపాక మండల వ్యాప్తంగా చైత్రశుద్ధనవమి సందర్భాన్ని పురస్కరించుకుని శ్రీసీతారాముల కళ్యాణం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. లోకోత్తరమైన ఆ జగన్నాధుడి కళ్యాణం కనులారా వీక్షించేందుకు వేలాది మంది భక్తులు శిల్పకళా శోభితమైన కళ్యాణ మండపాలకు తరలివచ్చారు. పినపాక మండల కేంద్రంలో గల సీతారామచంద్రస్వామి ఆలయంకు, ఈ బయ్యారం గ్రామపంచాయతీ గాండ్ల బయ్యారం, పినపాక, జానంపేట,దుగినేపల్లి, ఉప్పాక గ్రామాల్లో ఉన్న రామాలయాలతోపాటు వీధి వీధినా చలువ పందిరిలో నడుమ రామయ్య కళ్యాణము నిర్వహించారు. శ్రీరామునికి నిత్యార్చనలు, పూజలు చేశారు. అనంతరం సీతారాములు రాచఠీవీతో గ్రామాల్లో ఊరేగింపుతో కళ్యాణమండపానికి సమీపించగానే అక్కడ ఆశీనులైన వారందరూ ఒక్కసారిగా లేచి శిరస్సువంచి భక్తితో నమస్కరించారు. కళ్యాణమండపం మధ్యలో స్వామి అమ్మవార్లను ఎదురెదురుగా రజితాసనంపై కూర్చుండబెట్టి వేదపండితులు.. వేదమంత్రోచ్చారణ గావిస్తూ ఆరాధనలు సమర్పించారు. ఆనక రాముని కృపకు పాత్రుడైన భక్తులు చేయించిన నగలను అలంకరించి తేనె, పెరుగులను నైవేద్యంగా అందించారు. ఇదిగాక సౌభాగ్యమిదిగాక తపంబిక నొకటి కలదా అంటూ భక్తులు తమకు తోచిన రీతిలో సీతారామ స్మరణ గావించారు. అనంతరం ఆలయ ప్రాంగణాల్లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఇల్లందు : మండల, పట్టణ ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం, మహిళా సంఘం, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని బుధవారం ఎల్లన్న గ్రౌండ్ సమీపంలో కమిటీ వారు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య కుటుంబ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ సీతారాముల వారి కల్యాణం అనంతరం మహా అన్న ప్రసాద కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అనేకమంది మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు ప్రొద్దుటూరి నాగేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అర్వపల్లి రాధాకృష్ణ, యువజన అధ్యక్షుడు.అను, వాసవి క్లబ్ అధ్యక్షుడు పుల్లూరి సతీష్, పల్లెర్ల చంద్రశేఖర్, యెలుగూరి నగేష్ కుమార్, కండె రమేష్,గందె సురేష్, యెలుగూరి మధుబాబు, రామిడి శంకర్, మేడ రాకేష్, గౌరీశెట్టి పురుషోత్తం, అర్వపల్లి గణేష్, చందా వెంకన్న, భోనగిరి రమేష్, బసవయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పందిళ్లు ఏర్పాటు చేసి ఆయా గ్రామాల కమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కళ్యాణ అనంతరం అన్ని గ్రామాలలో భక్తులకు పులిహోర, పానకం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అంబేద్కర్ నగర్లో...

అత్యంత వైభోపేతంగా అంబేద్కర్ నగర్లో సీతారాముల కళ్యాణం నిర్వహించారు. బుధవారం అంబేద్కర్ నగర్ ఎస్సీ కాలనీలో శ్రీ మహాలక్ష్మి దేవాలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవానికి హాజరై సీతారాములస్వామిని దర్శించుకోని, సీతారాముల కళ్యాణాన్ని దగ్గరుండి తిలకించిన చంద్రుగొండ మాజీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి భక్తులకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రుగొండ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులుబడుగు శంకర్, మాజీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు బడుగు క్రిష్ణవేణి, దాసరి రామారావు, బడుగు రాములు, భేతి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బూర్గంపాడు : మండల కేంద్రమైన బూర్గంపాడుతో పాటు మండల వ్యాప్తంగా గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు బుధవారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెంతో పాటు మోరంపల్లి బంజర, గుట్ట లక్ష్మీపురం, టేకుల చెరువు తదితర గ్రామాల్లోని ఆలయాల్లో అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా శ్రీసీతారాముల కల్యాణ వేడుకలను నిర్వ హించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించి ఆయా ఆలయకమిటీల ఆధ్వర్యంలో అన్నదానాలు ఏర్పాటు చేశారు. శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో యూత్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, పానకం, మంచినీటిని యూత్ బాధ్యు లు పంపిణీ చేశారు. అలా గే భద్రాచలం వెళ్లే భక్తులకు, స్థానిక భక్తులకు మండ లంలోని పలు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు మజ్జిగ, బెల్లం పానకం, పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా కమిటీల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

చర్ల : దేవదేవుని కళ్యాణం అంగరంగ వైభవంగా బుధవారం జరిగింది. శ్రీరామనవమిని పురస్కరించుకొని పాత చర్ల ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కళ్యాణం దొడ్డి రామకృష్ణ జ్యోతి దంపతులు చిప్ప శ్రీనివాస్ సత్యవాణి దంపతులు, జ్యోతి సత్యనారాయణ దంపతులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. సరిహద్దు చతిస్గఢ్ ఊసూరు బ్లాక్ పామేడులో సీతారామ లక్ష్మణ స్వామి ఆలయ ప్రాంగణంలో సీతారాముల కళ్యాణం ఘనంగా జరిగింది అర్చకులు ఎలమందల భాను ప్రకాష్ కళ్యాణ క్రతువు జరిపించగా పామేడు పటేల్ గడప సత్యనారాయణ దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయిల్ బంక్ ఏరియాలో ఉన్న ఆంజనేయ ఆలయం, ఆర్ కొత్తగూడెంలో ఉన్న రామాలయం అదేవిధంగా కొత్తపల్లి లో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయం లో కొత్తూరు లో ఉన్న రామాలయంలో రామాలయంలో సీతారాముల వారి కళ్యాణం అత్యంత వైభోగంగా నిర్వహించారు. ఆయా ఆలయాలలో కళ్యాణ అనంతరం తీర్థం, అన్న ప్రసాదాలు భక్తులకు నిర్వాహకులు అందించారు.

అన్నపురెడ్డిపల్లి : శ్రీ రామ నవమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో గల రామాలయాలు అన్ని భక్తులతో ఎంతో సందడిగా మారాయి. రాజాపురం గ్రామంలో గల శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణాన్ని ఆలయ పూజారి ఎంతో ఘనంగా నిర్వహించారు. కొత్తగూడెం పట్టణానికి చెందిన దాసరి గిరిబాబు అలివేలు మంగ దంపతులు 15,000 రూపాయలు విలువ గల ముత్యాల తలంబ్రాలు శ్రీరాముడికి సమర్పించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం సుమారు 1200 మందికి అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ ఉపేందర్రెడ్డి, అనుపమ, పుల్లారెడ్డి, రామకృష్ణమ్మ భూక్య సిద్ధు, శ్రీను, శేఖర్, అశోక్, సత్యనారాయణ, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


బూర్గంపాడు


పినపాక



అన్నపురెడ్డిపల్లి


చర్ల


బూర్గంపాడు


చంద్రుగొండ


ఇల్లందు

మూడు రోజులుగా భక్తులకు 'గుంటుపల్లి' సేవా కార్యక్రమాలు

నవతెలంగాణ- బూర్గంపాడు



మండల పరిధిలోని సారపాక గ్రామానికి చెందిన గౌరి సివిల్ సప్లై కాంట్రాక్టర్ గుంటుపల్లి రామ కృష్ణ శ్రీరామనవమి పురస్కరించుకుని గత మూడు రోజులుగా భక్తులకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమి పర్వదినం నాడు భక్తులకు వెజ్ బిర్యానీ, రస్నా పానీయం, అరటిపండ్లు, తాగు నీటిని పంపిణీ చేశారు. తన స్నేహితులతో కలిసి ఆయన స్వయంగా భక్తుల కోసం వాటిని తయారుచేసి వారికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

సత్తుపల్లి పీవీఎన్ కాలనీ సమస్యలు పరిష్కరించాలి

- కొత్తగూడెం ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్

నవతెలంగాణ-కొత్తగూడెం

సత్తుపల్లి పీవీఎన్ కాలనీ సమస్యలు పరిష్కరించాలని కొత్తగూడెం ఏరియా ఐఎన్టియూసీ వైస్ ప్రెసిడెంట్ రజాక్ సింగరేణి యాజమాన్యాన్ని కోరారు. బుధవారం సత్తుపల్లి జేవిఆర్ ఓసి ప్రాజెక్ట్ ఆఫీసర్ ప్రహల్లాద్ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రజాక్ మాట్లాడారు. సత్తుపల్లి పీవీఎన్ కాలనీ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగులు, కుటుంబ సభ్యులు ఆహ్లాదకరంగా ఉండేవిధంగా కాలనీలో పార్క్, వాకింగ్ ట్రాక్, కమ్యూనిటీ హాల్ ఏర్పాటుతో పాటు ఇతర మౌలిక సదుపాయాలు మెరుపుపరచాలని కోరారు. సత్తుపల్లి ఉద్యోగుల క్వార్టర్స్ పీనల్ రెంట్ రికవరీ వెంటనే నిలుపుదల చేయాలన్నారు.ప్రాజెక్ట్ ఆఫీసర్ సానుకూలంగా స్పందించి జనరల్ మేనేజర్తో చర్చిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిఓ.దేవదాస్, బ్రాంచ్ సెక్రటరీ తీగల క్రాంతికుమార్, పిట్ సెక్రటరీ (జె.వి.ఆర్సి.హెచ్.పి) నాగేశ్వరరావు, నాయకులు కోటి, పోశం శ్రీనివాస్, రామచందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.



రైతులకు లాభాలను చేకూర్చి పెట్టండి

ఆయిల్ ఫెడ్ ఎండీకి గ్రోవర్స్ సొసైటీ బాధ్యుల వినతి

నవతెలంగాణ-అశ్వారావుపేట

సహకార సంఘాల, రెండు అంచెల నిర్మాణం కింద రైతు సమాజానికి లాభసాటి ధర ఇవ్వడం ద్వారా రాష్ట్రంలో నూనె గింజల ఉత్పత్తిని పెంచడంతో పాటు, నూనె గింజల పెంపకం దారులకు లాభసాటి ధరలను పొందేందుకు ప్రాసెసింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసి రైతులకు లాభాలు చేకూర్చి పెట్టాలని అశ్వారావుపేట ఆయిల్ ఫాం జోన్ గ్రోవర్స్ సొసైటీ అధ్యక్ష కార్యదర్శులు తుంబూరు మహేశ్వరరెడ్డి, కొక్కెరపాటి పుల్లయ్యలు కోరారు. ఆయిల్ ఫెడ్ ఎండీ కే. అశోక్రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగ వారు మాట్లాడారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆయిల్ ఫెడ్ నుండి రైతులు ఆశిస్తున్న అనేక విషయాలు తమ దృష్టికి తీసుకెళ్ళామని తెలిపారు.



సేవాదళ్ దయాకర్కు సన్మానం

నవతెలంగాణ-చంద్రుగొండ

అయ్యన్నపాలెం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర వారి కళ్యాణ మహోత్సవం విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కొదుమూరి దయాకర్ రావుని ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.



'ఎన్నికల కోడ్ను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నవతెలంగాణ-పాల్వంచ

ఎన్నికల కోడ్ను ఉల్లంఘించి కాంగ్రెస్ అనుభంద యూనియన్ ఐఎన్టీయూసీ 3194 డైరీని ఆవిష్కరించిన డీఎంహెచ్ఓ జీవీఎల్ శిరీష, డీసీహెచ్ఎస్ రవిబాబులపై చర్యలు తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన పోలింగ్ బూత్ అధ్యక్షుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత నెల 16వ తేదీ నుండి ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా ఈనెల 15వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిని జేవిఎల్ శిరీష, డీసీహెచ్ఎస్ రవిబాబులు ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పబ్లిక్ హెల్త్, మెడికల్ ఉద్యోగుల ఎంప్లాయిస్ యూనియన్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్టీయూసీ జాతీయ అధ్యక్షుడు,కాంగ్రెస్ పార్టీ మాజీ రాజ్యసభ సభ్యుడు గొంగళ్ళ సంజీవ్రెడ్డి ఫోటో ఉన్న 3194 యూనియన్ డైరీని కలెక్టర్ కార్యాలయంలో ఆవిష్కరించడం ఎన్నికల కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది కాబట్టి కలెక్టర్ వెంటనే స్పందించి ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదే విషయమై రాష్ట్ర ఎన్నికల చీఫ్ ఎలక్టోరల్ అధికారికి ఫోటో, పేపర్ క్లిప్పింగ్స్తో మెయిల్ ద్వారా పిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో లిసాయి, కోళ్ళపూడి ప్రవీణ్ కుమార్, చెనిగరపు నిరంజన్ కుమార్, సందేల సందీప్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందెల స్థావరంపై పోలీసుల దాడి

నవతెలంగాణ-అశ్వారావుపేట

కోడి పందేలు నిర్వహిస్తున్న ఓ స్థావరంపై బుధవారం పోలీసులు దాడులు నిర్వహించారు. స్థానిక ఎస్హెచ్ఓ ఎస్ఐ శ్రీరాముల శ్రీను తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అల్లిగూడెం సమీపంలో గల అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తుండగా,విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి దగ్గర నుంచి రెండు పందెం కోడి పుంజులు, రెండు ద్విచక్రవాహనాలు, రూ.4,500 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సీతారాముల చిత్రపటాలు, జెండాలు పంపిణీ

నవతెలంగాణ-జూలూరుపాడు



జూలూరుపాడు మండలం పాప కొల్లు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ ఉమా సోమలింగేశ్వర స్వామి దేవస్థానం ఆలయ ప్రాంగణంలో సీతారామచంద్ర స్వాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా బుధవారం ఆలయ చైర్మెన్ కొదుమూరి కోటేశ్వరరావు శ్రీ సీతారాముల చిత్రపటాలు, జండాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వందనపు నాగేశ్వరరావు, డాక్టర్ పూసాల శ్రీనివాస చారి, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ భానోతు నవీన్ రాథోడ్, యాస నరేష్, కొండం వీరభద్రం, దారావత్ నరసింహారావు, కూచి మంచి శ్రీనివాస్ సట్టు నరసింహారావు, ధారావత్ కిరణ్ కుమార్, తాళ్లూరి శ్రీనివాసరావు తదితర గ్రామస్తులు, శ్రీరామ భక్త బృందం పాపకొల్లు తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న కృష్ణమూర్తి

నవతెలంగాణ-జూలూరుపాడు



జూలూరుపాడు సొసైటీ మాజీ చైర్మెన్ పోల్దాస్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం జులురుపాడు మండలం కొత్తూరు గ్రామపంచాయతీ పెద్ద హరిజనవాడ గ్రామంలో తల్లిదండ్రులు కోల్పోయిన పొన్నగంటి నాగమణి పెళ్లి కొరకు దాతల సహకారంతో 30 వేల రూపాయలు, రెండు క్వింటాల బియ్యం ధాతలు అందించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మెన్ పోల్దాస్ కృష్ణమూర్తి, జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, జూలూరుపాడు జడ్పిటిసి భూక్యా కళావతి, అన్వర్ పాష, మంగమూడి నాగేశ్వరరావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, గాదే మల్లయ్య, లకావత్ గిరిబాబు, పెండ్యాల రాజశేఖర్, ఎండపల్లి సీతారాములు, కడియాల శ్రీను, నున్నా కృష్ణయ్య, రాయపాటి వెంకటేశ్వర్లు, యల్లంకి వెంకటేశ్వరరావు తదితర సహకారంతో వారి గ్రామం నందు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా పెళ్లికూతురు నాగమణి మాట్లాడుతూ నాకు సహకారంచేసిన అందరికీ రుణపడి ఉంటానని పేర్కొన్నారు.



ఈపీ పిట్టర్స్‌కు వెబ్ కౌన్సెలింగ్‌లో అవకాశం కల్పించాలి

నవతెలంగాణ-మణుగూరు

ఈపీ పిట్టర్స్ 60, 61 బ్యాచ్‌కి నిర్వహించే వెబ్ కౌన్సెలింగ్‌లో 59వ బ్యాచ్‌కి కూడా అవకాశం కల్పించాలని, గుర్తింపు సంఘం నాయకులు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వై.రాంగోపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాంగోపాల్‌కు కార్మికులు సమస్యను వివరిస్తూ ఈపీ పిట్టర్ 59వ బ్యాచ్ ఉద్యోగులము ప్రస్తుతం శిక్షణ పూర్తి చేసుకున్న 60, 61వ బ్యాచ్ వారికి సింగరేణి యాజమాన్యం కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగులు ఇస్తున్నది. 59వ శిక్షణ పూర్తి చేసుకున్న సమయంలో ఈపీ పిట్టర్స్ 56, 57, 58 బ్యాచ్‌లకు చెందిన ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహించగా ఏర్పడిన ఖాళీలలో మాకు పోస్టింగ్ ఇచ్చారు. దీంతో మేము కోరుకున్న ఏరియాలలో పోస్టింగులు దొరకలేదు. కావున వృద్ధాప్యంలో అనారోగ్యంతో బాధపడుతున్న తల్లిదండ్రులు, మా పిల్లల చదువు, కుటుంబ ఆర్థిక పరిస్థితులతో మేము తీవ్ర మానసికవేదనకు గురయ్యాము. కావున మా యందు దయవుంచి 60, 61వ బ్యాచ్ వారికి అవకాశం కల్పించాలని ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా రాంగోపాల్ మాట్లాడుతూ 59వ బ్యాచ్ ఉద్యోగులకు వెబ్ కౌన్సెలింగ్ లో అవకాశం కల్పించాలని సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అవసరమైతే యాజమాన్యంతో పోరాటం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఈపీ ఫిట్టర్స్ పాల్గొన్నారు.



డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకి ఉగాది మయూరి అవార్డు

నవతెలంగాణ - జూలూరుపాడు

రిటైర్డ్ హెడ్మాస్టర్ డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరరావుకి హైదరాబాదులోని త్యాగరాయగా 14న తెలుగు వెలుగు సాహితీ సంస్థ ఐదు రాష్ట్రాల సంయుక్తంగా నిర్వహించిన సన్మాన సభలో డాక్టర్ మద్దిశెట్టి వెంకటేశ్వరావుకి మయూరి అవార్డుతో పాటు గోల్డ్ మెడల్ మెమెంటోతో సత్కరించారు. దైవజ్ఞశర్మ జ్యోతి ప్రద్యులతో ప్రారంభమైన సభలో తెలుగు వెలుగు స్వచ్ఛంద సంస్థ చైర్మెన్ పోలోజు రాజకుమార్, సమాచార పౌర సంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు కన్నెగంటి వెంకటరమణ, రిటైర్డ్ కలెక్టర్ మానేపల్లి సుబ్రమణ్యం, రిటైర్డ్ జస్టిస్ బెజ్జారం చంద్రకుమార్, వంగాల శాంతి కృష్ణ, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్ టి.గౌరీ శంకర్, దైవజ్ఞ శర్మ, మద్దిశెట్టి వెంకటేశ్వర లను ఘనంగా సన్మానించారు. విద్యారంగంలో విశేష కృషి చేస్తున్నందుకు గాను ఇప్పటివరకు 24 అవార్డులు, 11 గోల్డ్ మెడల్స్, 5 నంది అవార్డులు, ఒక మయూరి అవార్డు రావడం నాకు చాలా ఆనందంగా ఉందని అందరికీ ధన్యవాదాలు తెలిపారు. మయూరి అవార్డు రావడం పట్ల విద్యార్థులు, బంధువులు, స్నేహితులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.



ఘనంగా సీతారాముల కళ్యాణం

నవతెలంగాణ-జూలూరుపాడు

శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మండల పరిధిలోని కాకర్ల గ్రామంలో బుధవారం శ్రీ సీతారామచంద్ర స్వాముల దైవ కళ్యాణం భక్తి శ్రద్ధలతో, కన్నుల పండువగా జరిపారు. ఈ సందర్భంగా కళ్యాణ వేడుక ప్రాంగణమంతా సీతారామ నామ స్మరణతో మార్మోగింది. ఎంపీటీసీ పొన్నెకంటి సతీష్ ఆధ్వర్యంలో భక్తులు, గ్రామ పెద్దలు కళ్యాణ వేడుకకు తలంబ్రాలను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ సీతారామచంద్రుల దైవ కళ్యాణాన్ని తిలకించి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

చింతల నారాయణను పరామర్శించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-తల్లాడ

మండల పరిధిలోని అన్నారుగూడెం గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ సిబ్బంది చింతల నారాయణ ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స పొంది బుధవారం ఇంటికి వచ్చారు. ఆయనను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొమ్మినేని వెంకటేశ్వరరావు, పొన్నం కృష్ణయ్య తదితరులు పరామర్శించి యోగక్షేమాలు, అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

జామాయిల్ తోటకు నిప్పు పెట్టిన ఘటనపై కేసు

నవ తెలంగాణ-ఖమ్మం రూరల్

జామాయిల్ తోటకు నిప్పు పెట్టిన ఘటనపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్ లో బుధవారం కేసు నమోదైంది. ఖమ్మం నగరానికి చెందిన సాధిక్ ఆలీ మండలంలోని కాచిరాజుగూడెం పరిధిలో 20 ఎకరాల్లో జామాయిల్ సాగు చేస్తున్నాడు. మంగళవారం సాయంత్రం తోటకు నిప్పు అంటుకొని జామాయిల్ తోట కాలిపోయింది. కాచిరాజుగూడెం గ్రామానికి చెందిన చావిడి రామారావు, లింగేశ్వరరావు, వెంకన్నకృష్ణయ్యలు తమ జామాయిల్ తోటకు నిప్పు పెట్టారని బాధితుడు సాధిక్ ఆలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

వాడ వాడల సీతారాముల కల్యాణం

మణుగూరు: మణుగూరు సబ్ డివిజన్ లో ప్రతి గ్రామంలో ప్రతి వాడలో బుధవారం శ్రీ సీతారాముల కళ్యాణం నిర్వహించారు. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రజల సౌకర్యార్థం బెల్లంతో కూడిన వాటర్‌ని పంపిణీ చేశారు. అనంతరం సహా పంక్తి భోజనాలు నిర్వహించారు. కార్మిక వాడలైన పివి కాలనీలో శ్రీ సీతారాముల కళ్యాణం కనుల పండుగ జరిగింది. సింగరేణి కార్మికులు, అధికారులు, మహిళలు అధిక సంఖ్యలో వచ్చారు. ఒకవైపు ఎండలు మండుతున్న సరే ప్రజలు కదలకుండా అలానే కల్యాణాన్ని తిలకించారు



అన్‌ఫిట్ అయిన వారి వివరాలు మచ్చుకు కొన్ని

మెడికల్ అన్‌ఫిట్ అంటే తీవ్ర అనారోగ్యం పాలై, అసలు చేతకాకుండా పోవడం కానీ ఇక్కడ దీనికి విరుద్ధంగా మెడికల్ అన్‌ఫిట్లు పొందుతున్నారు. అందుకు అన్‌ఫిట్ అయిన వారి వివరాలు మచ్చుకు ఇలా ఉన్నాయి. పాల్వంచలో ఓ మహిళా ఉద్యోగి తన కుమారుడికి ఉద్యోగం ఇప్పించేందుకు మెడికల్ అన్ ఫిట్ సినిమా పక్కీలో నడుముకు ప్లాస్టర్లు వేసుకొని మెడికల్ అధికారులను, జెన్‌కో ఉద్యోగులను నమ్మించి అన్‌ఫిట్ అయి నేడు సంపూర్ణ ఆరోగ్యవంతంగా వాకింగ్ చేస్తుందంటే, ఆమె ఆరోగ్యం నాటకం ఏమిటో ఇట్టే తెలుస్తోంది. మరో వ్యక్తి మెడికల్ అన్‌ఫిట్ అయి నేడు ద్విచక్ర వాహనంపై పాల వ్యాపారం చేస్తున్నారు. ఇంకొకరు మార్కెట్లో ఇస్త్రీ బండి పెట్టుకొని జీవిస్తున్నారు. మరో వ్యక్తి తాను అన్‌ఫిట్ అయినా తన భార్య వెళ్ళిపోయిందని తనకు పిల్లలు లేరని, తమ్ముడి కుమారుడ్ని దత్తకు తీసుకున్నట్లు తప్పుడు ధృవీకరణ పత్ర సమర్పించి ఉద్యోగం ఇప్పించారు. ఆ కార్మిక సంఘం నాయకులే విద్యుత్ సౌదాకు ఆకాశమున ఉత్తరం రాయించి ఉద్యోగం నిలుపుదల చేయించి, పైరవీ చేసి వారి నుంచి ఆ నాయకులు 20 లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా కార్మిక నాయకులు దండుకుంటున్నారు.

ఇదిలా ఉంటే మరో ఉద్యోగి రిటైర్ అయ్యారు. అతని భార్య మరణించింది. కానీ తప్పుడు ధృవీకరణ పత్రం సమర్పించి కోడలు పెన్షన్ పొందుతున్నారంటే జెన్కో అధికారులు తీరు ఎలా ఉందో తెలుస్తోంది. ఇప్పటికైనా సీఎండీ ఈ నియామకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కార్మిక నాయకుల దందాను అరికట్టాలని కార్మిక ఉద్యోగులు కోరుతున్నారు

లక్షలు కొట్టు.. అన్‌ఫిట్ పట్టు


టీఎస్ జెన్‌కో లో కారుణ్య మెడికల్ అన్ ఫిట్ దందా..?

- తప్పుడు మెడికల్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు
- కార్మిక సంఘాల నాయకులు సూత్రధారులు..!
- లంచాలకు మరిగిన విద్యుత్ సౌదా ఉద్యోగులు...?

నవతెలంగాణ-పాల్వంచ

కారుణ్య నియామకాలు మెడికల్ అండ్ అన్ ఫిట్ ఉద్యోగాలు పొందాలంటే వైద్య ధ్రువీకరణ పత్రాల దగ్గర నుంచి సీఎండీని మేనేజ్ చేసి ఉద్యోగంలో చేర్పించే వరకు కర్త, క్రియ కార్మిక సంఘాల నేతలు సూత్రధారులుగా, పాత్రధారులుగా చలాయిస్తున్నారు. ప్రస్తుతం జెన్ కోలో ఈ వ్యాపారం మూడు పూలు ఆరుకాయలుగా విరాజిల్లుతోందని ఆరోపణలు వెలువడుతున్నాయి. గుర్తింపు పొందిన నాయకులు కార్మికుల సంక్షేమాన్ని గాలికి వదిలి ఈ వ్యాపారమే ప్రమాణికంగా పనిచేస్తున్నారని తెలుస్తోంది.

2020 ఏప్రిల్‌లో జీవో నెంబర్ 6 ప్రకారం కారుణ్య నియామకాలు రద్దు చేస్తూ అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక సంఘాల విజ్ఞప్తి మేరకు తిరిగి ఇటీవల పునరుద్ధరించారు. ఈ అవకాశాన్ని జెన్ కోలో కార్మిక సంఘాలు దండుకుంటున్నారని బహిరంగ రహస్యం. విధుల్లో ఉండి ఏ కారణం చేతనైనా మరణిస్తే ఆ కార్మికుడికి కుటుంబ సభ్యుల్లో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం పొందే అవకాశం ఉంది. ఇది నేడు కార్మిక సంఘాల నేతలకు వరంగా మారింది. ఉద్యోగం కావాలంటే అడిగినంత పైకం ఇవ్వడమే కాదు.. మహిళలైతే 'తమ వద్దకు' రావాలంటూ షరతు విధిస్తున్నట్లు నాయకులు వ్యవహరిస్తున్నారంటే దందా ఏ రీతిలో కొనసాగుతుందని ఆరోపణ సర్వత్ర వినిపిస్తున్నాయి. మరోవైపు అనారోగ్యంతో మెడికల్ అన్ ఫిట్ తీసుకుని వారసత్వంగా ఉద్యోగం ఇప్పించే వ్యాపారం కూడా పెద్ద ఎత్తున చెలాయిస్తున్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్న కార్మిక నాయకుల శిక్షణలో అనారోగ్యంగా ఉన్నట్టు తప్పుడు అన్ ఫిట్ ధ్రువీకరణ పత్రాలను కార్పొరేట్ ఆసుపత్రుల నుంచి ఇప్పించి జెన్కో సీఎండీని మెప్పించి వారసులకు ఉద్యోగం ఇప్పించినందుకు లక్షలు వసూలు చేసినట్లు తెలుస్తోంది. దీనికి విద్యుత్ సౌదాలో ఉద్యోగులు, మెడికల్ ఆఫీసర్లు, అటు కార్పొరేట్ వైద్యశాల వైద్యులు, కార్మిక సంఘాల నేతలు ముఠాగా ఏర్పడి మెడికల్ అన్ ఫిట్ దందా కొనసాగిసినట్లు తెలుస్తోంది. వాస్తవంగా కారుణ్య నియామకాలకు రూ.50 వేల నుంచి లక్ష వరకు ఖర్చు అవుతుంది. కానీ కార్మిక సంఘాల నేతలు దళారులుగా వ్యవహరించి రూ.5 నుంచి 10 లక్షల వరకు దండుకుంటున్నారని ఆరోపణలు ఉన్నాయి. మెడికల్ అన్ ఫిట్‌లోను ఇదే దందా కొనసాగుతోంది. జెన్కో వ్యాప్తంగా సుమారు 150 కారుణ్య నియామకాలు 150 మెడికల్ అన్‌ఫిట్ కేసులు పెండింగ్లో ఉన్నట్లు తెలుస్తుంది. ఆయా కార్మిక సంఘాల నేతలు వారికి ఉద్యోగాలు ఇప్పించి లక్షలు దండుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఈ దందా భద్రాది కొత్తగూడెం జిల్లా కేటీపీఎస్ కేంద్రంగా కొనసాగుతుందని విమర్శలు వస్తున్నాయి. ఇటీవల ఓ కార్మిక సంఘం నాయకుడిని విజిలెన్స్ అధికారులు విచారించినట్లు తెలుస్తోంది.



సింగరేణి జీఎంకు ఈపీ ఆపరేటర్ల వినతి

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి వ్యాప్తంగా ఓసీ గనులలో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఈపీ ఆపరేటర్లు బుధవారం డైరెక్టర్ "పా" ఎన్‌వికె శ్రీనివాస్, జీఎం పర్సనల్ బి.హనుమంతరావులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు ఎస్‌డి నాసర్ పాషా మాట్లాడుతూ ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్యకు సంబంధించి గత రెండున్నర ఏండ్ల కిందట కేంద్ర కార్మిక శాఖ అధికారుల మధ్యవర్తిత్వంలో హైదరాబాదులో సింగరేణి యాజమాన్యానికి 6 కార్మిక సంఘాలకు కుదిరిన రాతపూర్వక ఒప్పంద నేటికీ అమలు కాలేదన్నారు. అనారోగ్య కారణంగా ఆపరేటర్లుగా, భారీ యంత్రాలు నడపటానికి అర్హులు కానీ (మెడికల్ అన్ ఫిట్) వారి డిసిగ్నేషన్ మారకుండా న్యాయం చేసే విధంగా ఒక కమిటీని వేసి త్వరగతిన సమస్య పరిష్కరిస్తామని ఆ ఒప్పందపు సారాంశం నేటికీ కమిటీ వేయని కారణంగా అనేకమంది ఆపరేటర్లు డీ ప్రమోట్ జనరల్ మజ్దూర్లుగా పని చేయాల్సిన ప్రత్యేక పరిస్థితి ఉందని అన్నారు. దయచేసి ఉత్పత్తి ఉత్పాదికతలో ప్రధాన భూమిక పోషించే ఆపరేటర్ల సూటబుల్ జాబ్ సమస్య పరిష్కరించాలని కోరారు. అలాగే కొత్తగూడెం రీజియన్ స్థాయిలో "బి" గ్రేడ్ గ్రేట్ టెస్ట్‌లో క్వాలిఫైడ్ అయి అర్హులైన ఆపరేటర్లు ఐదుగురికి బ్యాడ్ డేట్ ఇచ్చి న్యాయం చేయాలి, కొత్తగూడెం రీజియన్ స్థాయితోపాటు సింగరేణి వ్యాప్తంగా అన్ని ఓపెన్ కాస్ట్ గనులలో పనిచేస్తున్న రెండేండ్ల సర్వీసు పూర్తి చేసిన "సి" గ్రేడ్ ఆపరేటర్లకు అందరికీ సత్వరమే గ్రేట్ టెస్టులు నిర్వహించి 'సి' గ్రేడ్ ప్రమోషన్స్ ఇవ్వాలి, కొత్తగూడెం రీజియన్ స్థాయిలో వివిధ ఓసీలలో పనిచేస్తున్న ఆపరేటర్లకు సంబంధించి ఇటీవల మణుగూరులో నిర్వహించిన బి గ్రేడ్ మరియు ఏ గ్రేడ్ క్వాలిఫైడ్ అయినా అర్హులకు ప్రమోషన్స్ ఆర్డర్స్ వెంటనే ఇవ్వాలన్నారు. కొత్తగూడెం రీజియన్ నుండి గోదావరిఖని టీటీసీకి శిక్షణ తరగతులకు హాజరయ్యే ఆపరేటర్లకు రాను బోను ఓడి ఇవ్వాలి, ఇన్సెంటివ్ పునః సమీక్షించాలి, ప్లే డే, పీహెచ్‌డీలపై మైనస్ ఒన్ ఆంక్షలు ఎత్తివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, సీరా శ్రీనివాస్, రాజశేఖర్, ఎండి యాకుబ్, పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.



మాదిగ జాతికి రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

- కాంగ్రెస్ పార్టీని రాజకీయంగా బొంద పెడతా : సునీల్ మాదిగ

నవతెలంగాణ-మధిర

మంద కృష్ణ మాదిగపై అనుచిత వ్యాఖ్యలు, అబద్ధపు మాటలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి మాదిగ జాతికి బే షరతుగా క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ అన్నారు. మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కోట హనుమంతరావు మాదిగ అధ్యక్షతన మధిరలో జరిగిన విలేకరుల సమావేశం ఆయన మాట్లాడుతూ రాజకీయంగా మాదిగల అస్తిత్వం లేకుండా చేయాలని కుట్రపూరితంగానే మాదిగలకు రాజకీయ ప్రాతినిధ్యం ఇవ్వటం లేదని అన్నారు. ప్రస్తుతం కేంద్ర పార్లమెంట్ స్థానాల్లో చేసిన తప్పును సరిదిద్దుకోవటంలో భాగంగా అబద్ధపు మాటలు మాట్లాడుతూ వ్యవహరిచ్చిన రేవంత్ రెడ్డి తీరు చాలా దారుణమని కచ్చితంగా కాంగ్రెస్ పార్టీకి రాజకీయ గోరీ కడతామని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయ పతనం తప్పదని అది మాదిగలకు సాధ్యమని అన్నారు. ఖమ్మం జిల్లాలో కుటుంబ సభ్యుల పదవుల కోసం ఉన్న ఆరాటం, పార్టీని, వ్యక్తులను నమ్ముకుని నడుస్తున్న మాదిగ నాయకులు పట్ల లేదని, జిల్లాలో మాదిగలకు రాజకీయ ప్రాతినిధ్యం శూన్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలక నాగరాజు మాదిగ, ఎంఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఊటుకూరి రత్నాకర్ మాదిగ, ఎమ్మెస్ఎఫ్ సీనియర్ నాయకులు కనకపుడి శీను మాదిగ, రాయబారపు దాసు మాదిగ, రాజారత్నం మాదిగ, పార్శపు ఏనోక మాదిగ, ఆశీర్వాదం మాదిగ తదితరులు పాల్గొన్నారు.



రాములోరి కల్యాణ వేడుకలు

నవతెలంగాణ- బూర్గంపాడు

బూర్గంపాడు మండల కేంద్రంలోని గౌతమి పురం కాలనీ శ్రీకృష్ణ పాండవుల ఆలయం వద్ద శ్రీరామ నవమి వేడుకలను భక్తులు ఎంతో వైభవోపేతంగా నిర్వహించారు. ముఖ్యంగా శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని శ్రీకృష్ణ పాండవుల ఆలయం వద్ద భద్రాద్రిలో జరిగే కల్యాణ వేడుక వేదమంత్రోచ్చరణల మధ్య కన్నులపండువగా రాములోరి కల్యాణం భక్త లందరూ వీక్షించారు. ఒక్కరోజు ముందుగానే ఆలయాలను విద్యుత్ కాంతులతో ముస్తాబు చేసిన ఆలయ కమిటీ సభ్యులు సీతారాముల కల్యాణానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ ఏర్పాట్లలో భాగంగా సీతాసమేతుడైన శ్రీరామచంద్రున్ని పటం ఏర్పాటు చేసి ఉదయం నుంచి స్రీలు, పిల్లలు పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో భద్రాద్రిలో భాజాభజం త్రీలు, వేదమంత్రాలు, ముత్యాల తలంబ్రాలతో సీతారాముల కల్యాణాన్ని ఎంతో కమనీయంగా జరిగిన అనంతరం గ్రామ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో భక్తులు పెద్దఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని మహిళలు భక్తులు యువత గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తల్లాడ మండలంలో సాంప్రదాయ బద్ధంగా శ్రీరామనవమి ఉత్సవాలు

తల్లాడ : మండలంలో బుధవారం సాంప్రదాయపద్ధంగా శ్రీరామనవమి ఉత్సవాలు, సీతారాముల కల్యాణం నిర్వహించారు. పినపాక గ్రామంలో ఆలయ కమిటీ చైర్మెన్ నర్వనేని లక్ష్మణరావు దంపతులు రాములవారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. నూతనకల్, వెంకటాపురం, కుర్నవల్లి, అన్నారు గూడెం, రెడ్డిగూడెం, రామానుజవరం, మల్లవరం తదితర గ్రామాలలో సీతారాముల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని వీక్షించి, అన్నదానాల్లో పాల్గొన్నారు.

టేకులపల్లిలో

నవతెలంగాణ-టేకులపల్లి

టేకులపల్లిలో శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా బుధవారం నిర్వహించారు. మండలంలోని శ్రీ కోదండ రామాలయంతో పాటు పలు గ్రామాలలోని దేవాలయాల్లో సీతారాముల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా జరుపుకున్నారు. శ్రీ కోదండ రామాలయంలో జరిగిన కల్యాణ వేడుకల్లో పలువురు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వేలాది మంది భక్తులు సీతారాముల కల్యాణ వేడుకలను తిలకించడానికి భారీగా తరలివచ్చారు. శ్రీ కోదండ రామాలయం కమిటీ వారి ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేశారు. రాములవారి కల్యాణ వేడుకలకు ప్రత్యేకంగా కళ్యాణ వేదికను ఏర్పాటు చేశారు. రంగ రంగ వైభవంగా జరిగిన రాములోరి పెళ్లిని భక్తులు ఆసక్తిగా తిలకించారు. కల్యాణ మహోత్సవానికి వచ్చిన భక్తులకు ఆయా దేవాలయాల్లో పానకం, అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మధిరలో శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం

మధిర : సీతారామచంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా పచ్చని తోరణాల నడుమ వేదమంత్రోచ్చారణాల మధ్య స్వామి వారు అమ్మవారు పాణిగ్రహం బుధవారం మధిర రామాలయంలో వేలాది మంది భక్తుల రామనామ స్మరణలతో మంగళ వాయిద్యములతో పూర్తి భక్తి ఆధ్యాత్మికత శోభతో నయనానందకరంగా కల్యాణ మహోత్సవం ముగిసినది. ఉదయం 11:59 నిమిషాలకు అభిజిత్ సముహూర్తంలో స్వామివారి కళ్యాణం శాస్త్రోత్సకంగా నిర్వహించినారు. బ్రహ్మోత్సవంలో దేవాలయ అర్చక స్వాములు శేషచార్యులు, నారాయణ, వారి ఆధ్వర్యంలో శాస్త్రోక్తకంగా కల్యాణ క్రతువును అధ్యంతం భక్తి కట్టేలా నిర్వహించారు.

మర్లపాడులోఅన్నదాన కార్యక్రమం

శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని మధిర మండలం మర్లపాడు గ్రామంలో బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు వేమిరెడ్డి, పెద్దనాగిరెడ్డి, సూరం శెట్టి కిషోర్‌లు మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలను ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ఘనంగా నిర్వహించామని చెప్పారు. గ్రామ పెద్దలు సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టడం సంతోషంగా ఉందని, విరాళాలు ఇచ్చిన దాతలకు పేరు, పేరున ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

వాడ వాడలా రాములోరి కల్యాణం

నవతెలంగాణ-కొత్తగూడెం

సీతా రామ కళ్యాణ వేడుకలు జిల్లాలోని గ్రామ, పట్టణ, వాడవాడలా ఘనంగా నిర్వహించారు. బుధవారం మధ్యాహ్నం అభిజిత్ లగ్నంలో కల్యాణ వేడుకలు వైభవంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో శ్రీసీతారామ, ఇతర ఆలయాల్లో ఉదయం నుండి కల్యాణ వేడుకల సందడి కనిపించింది. పట్టణాల కంటే పల్లెల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు అత్యంత భక్తితో చేసుకున్నారు. గ్రామ వాసులందరూ ఆ ఊరి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెల్లం పానకం, మజ్జిగ, అన్నదాన కార్యక్రమాలు చేశారు.

గ్రామ గ్రామాన వైభవంగా రాములోరి కళ్యాణం

జై శ్రీరామ్ నినాదాలతో మారుమోగిన పల్లెలు

జూలూరుపాడు : శ్రీరామనవమిని పర్వదినాన్ని పురస్కరించుకొని జూలూరుపాడు మండలంలోని పల్లెలన్నీ బుధవారం కాషాయ జెండాలతో జైశ్రీరామ్ నినాదాలతో మారుమోగాయి. గ్రామాలన్నీ పండగ శోభన సంతరించుకున్నాయి. గ్రామ గ్రామాన సీతారామచంద్రస్వామివారి కల్యాణాలు వైభవంగా నిర్వహించారు. అయా కల్యాణాల కార్యక్రమాలలో చిన్నలు, పెద్దలు, మహిళలు ఉత్సాహంగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు బెల్లం, పానకం, వడపప్పు, మజ్జిగ, దద్దోజనం తదితర ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు. జూలూరుపాడు, వెంగన్నపాలెం, గుండెపుడి, అనంతారం, కాకర్ల, పడమటి నర్సాపురం, కరి వారి గూడెం, పాపకొల్లు తదితర గ్రామాలు గిరిజన తండాలు అన్నింట ఉత్సాహంగా కళ్యాణాలు నిర్వహించారు. జూలూరుపాడు మెయిన్ రోడ్‌లోని మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. పాపకొల్లు గ్రామంలో ఉమా సోమలింగేశ్వర స్వామి వారి దేవాలయ కమిటీ చైర్మన్ కొదుమూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా కళ్యాణం నిర్వహించారు.



నేటి నుంచి నామినేషన్లు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం నేటి నుంచి మొదలు కానుంది. గత నెలలో షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్నికల సంఘం గురువారం నోటిఫికేషన్ విడుదల చేయగానే ఎన్నికలకు కౌంట్‌డౌన్ ప్రారంభం కానుంది. పార్లమెంట్‌తో పాటు పలు అసెంబ్లీలకు దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నెల 19న మొదలైన ప్రక్రియ జూన్ 1న ముగియనుంది. నాలుగో దశలో భాగంగా రాష్ట్రంలో మే 13న పోలింగ్ జరగనుంది. నామినేషన్లకు సంబంధించి రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆదివారం మినహా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ఎంపీ అభ్యర్థులు కలెక్టర్ చాంబర్లో, ఎమ్మెల్యే అభ్యర్థులు ఆయా నియోజక వర్గాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల్లో దాఖలు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే లోనికి అనుమతిస్తారు. నామినేషన్ కేంద్రాల వద్ద 100 మీటర్ల లోపు 144 సెక్షన్ విధించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బారికేడ్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ప్రతి ఒక్కరి కదలికలను గమనించేందుకు ప్రతీ నామినేషన్‌ను వీడియో గ్రఫీ చేయనున్నారు.

పెరగనున్న పొలిటికల్ హీట్

గురువారం నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలు కానుండటంతో రాష్ట్రంలో పొలిటికల్ హీట్ మరింత పెరిగే అవకాశం ఉంది. సూటిపోటి మాటలు ఘాటైన విమర్శల నేపథ్యంలో ఇప్పటికే ఉద్వేగ భరితమైన వాతావరణం నెలకొంది. నేతలు తమ పార్టీ మ్యానిఫెస్టోలను ఏ కరువు పెడుతూనే ఒకరిపై ఒకరు మాటల తూటాలను పేల్చుకుంటున్నారు. షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి అభ్యర్థులు ఒకరిపైనొకరు విమర్శలు గుప్పించుకుంటున్నారు. కాగా బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు మొత్తం 17 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించగా, కాంగ్రెస్ మాత్రం 15 స్థానాల్లో మాత్రమే అభ్యర్థులను ప్రకటించింది. కరీంనగర్, ఖమ్మం, హైదరాబాద్ స్థానాల్లో నెలకొన్న పోటీ నేపథ్యంలో అక్కడ అభ్యర్థిత్వాలు ఓ కొలిక్కి రాలేదు. ఎప్పటిలాగే ఎంఐఎం హైదరాబాద్ స్థానం నుంచి ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ బరిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో సీపీఐ(ఎం) భువనగిరి స్థానం నుంచి బరిలో నిలిచింది. బూర్జువా పార్టీలకు భిన్నంగా ప్రచారం నిర్వహిస్తూ తనదైన శైలిలో దూసుకుపోతోంది. డబ్బు, అధికారం, కులం, తదితర అంశాలు ప్రాతిపదికగా హోరాహోరీగా సాగుతున్న ప్రస్తుత ఎన్నికల సంగ్రామంలో ఓటర్లు ఎవరిని కనికరిస్తారో జూన్ 4న తేలనుంది.

ఎన్నికల షెడ్యూల్

నేటి నుంచి (గురువారం) నామినేషన్ల స్వీకరణ
ఈ నెల 25 నామినేషన్లకు చివరి రోజు
ఈ నెల 26 నామినేషన్ల పరిశీలన
ఈ నెల 29 ఉపసంహరణ గడువు
మే 13 పోలింగ్
జూన్ 4న ఫలితాల ప్రకటన

బెంగాల్ గవర్నర్ కూచ్‌బెహార్ పర్యటన కోడ్ ఉల్లంఘనే : ఈసీ

న్యూఢిల్లీ : కూచ్‌బెహార్ పర్యటనపై పశ్చిమ బెంగాల్ గవర్నర్ సి.వి. ఆనంద్‌బోస్‌ని ఎలక్షన్ కమిషన్ (ఈసీ) బుధవారం హెచ్చరించింది. నార్త్‌బెంగాల్‌లోని కూచ్ బెహార్‌లో ఏప్రిల్ 18, 19 తేదీలలో పర్యటించాలని గవర్నర్ నిర్ణయించారు. అయితే ఏప్రిల్ 19న మొదటి దశ పోలింగ్ జరగనున్నందున నేటి సాయంత్రం నుండి సైలెన్స్ అవర్ ప్రారంభమవుతుందని ఇసి పేర్కొంది. దీంతో ఈ సమయంలో గవర్నర్ పర్యటన ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ)ని ఉల్లంఘించినట్లేనని హెచ్చరించింది. సైలెన్స్ అవర్ ప్రారంభమైన తరుణంలో సంబంధిత నియోజకవర్గంలోని ఓటర్లు కాని విఐపిలు, రాజకీయ నేతలు ఆ ప్రాంతాన్ని వీడాల్సి వుందని ఇసి ప్రామాణికంగా ఆదేశించింది. ఇది నియోజకవర్గంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగడానికి అత్యసరమని ఇసి పేర్కొంది. విఐపిలు ఆ ప్రాంతాన్ని సందర్శిస్తే వారికి రక్షణ కల్పించాల్సిన అదనపు బాధ్యత భద్రతా దళాలపై పడుతుందని హెచ్చరించింది.

ట్యాప్ చేస్తున్న దర్యాప్తు సంస్థలు..డీఎంకే

చెన్నై : కేంద్ర దర్యాప్తు సంస్థలు తమ మొబైల్ ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నాయంటూ తమిళనాడు అధికార పార్టీ డిఎంకె మంగళవారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)కి ఫిర్యాదు చేసింది. సార్వత్రిక ఎన్నికలకు ముందు లోక్‌సభ అభ్యర్థులు సహా తమ పార్టీ నేతలు, వారి స్నేహితులు, సమీప బంధువుల ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నారని డీఎంకే నేత ఆర్.ఎస్. భారతి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నికల్లో నిర్దిష్ట సమూహానికి ప్రయోజనం కల్పించేందుకు దర్యాప్తు సంస్థలు అక్రమ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించి తమ ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నాయని వెల్లడించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ, ఐటీ లతో పాటు కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉన్న ఇతర దర్యాప్తు సంస్థలు తమ అభ్యర్థులు, ఫ్రంట్ లైన్ నేతలు, వారి స్నేహితులు, సమీప బంధువుల ఫోన్‌లను ట్యాప్ చేస్తున్నారని గుర్తించామని ఆర్.ఎస్. భారతి ఈసీఐకి లేఖ రాశారు. పెగాసెస్ వంటి సాఫ్ట్‌వేర్‌ను రాజకీయ ప్రత్యర్థుల ఫోన్‌లలో చొప్పించిన వాస్తవాన్ని విస్మరించలేమని అన్నారు.

బీజేపీ అభ్యర్థుల మార్పు?


- పెద్దపల్లి బరిలో వెంకటేశ్‌ను దింపే యత్నం
- నల్లగొండ అభ్యర్థి సైదిరెడ్డి అభ్యర్థిత్వంపైనా గుర్రు
- మార్చాల్సిందేనంటూ పట్టుబడుతున్న జిల్లా నేతలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ ఎంపీ అభ్యర్థుల మార్పు అంశం మరోమారు చర్చనీయాంశమవుతున్నది. పెద్దపల్లిలో గోమాస శ్రీనివాస్ స్థానంలో సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్‌ను బరిలోకి దింపాలని యత్నిస్తోంది. ఆ దిశగా ఢిల్లీ నాయకత్వం వడివడిగా అడుగులు వేస్తున్నట్టు తెలుస్తోంది. అభ్యర్థుల ప్రచారంపై నిఘా పెట్టిన నాయకత్వం ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అభ్యర్థులు నియోజకవర్గాలు దాటకుండా ప్రతిరోజూ ప్రచారపర్వంలో దూకుడు పెంచాలని ఇప్పటికే ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూడా తన నియోజకవర్గాన్ని, హైదరాబాద్‌ను విడిచి ఎక్కడకు వెళ్లడం లేదు. ఆయన ప్రచార పర్వంలో మునిగిపోయిన సంగతి తెలిసిందే. పెద్దపల్లి నుంచి ఆ పార్టీ తరపున బరిలో దిగిన శ్రీనివాస్ బలమైన అభ్యర్థి కాదనీ, ప్రచారంలోనూ వెనుకబడుతున్నాడని అమిత్‌షా టీమ్ గుర్తించింది. ఈ నేపథ్యంలో దిద్దుబాటు చర్యలకు పూనుకున్నది. ఆ నియోజకవర్గంలో సొంత పార్టీ నుంచి వివేక్ పోయిన తర్వాత బీజేపీకి పెద్దపల్లిపై పెద్దగా పట్టు లేకుండా పోయింది. వివేక్ కాంగ్రెస్‌కుపోయి ఎమ్మెల్యేగా గెలుపొందాడు. ఆయన కొడుకు గడ్డం వంశీ పెద్దపల్లి ఎంపీ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మారాడు. గులాబీ పార్టీలో సీటు దక్కదనే నిర్ధారణకు వచ్చిన సిట్టింగ్ ఎంపీ నేతకాని వెంకటేశ్ కాంగ్రెస్‌లో చేరాడు. నేతకాని వెంకటేశ్‌కు కాంగ్రెస్‌లోనూ నిరాశే ఎదురైంది. చర్చోపచర్చల తర్వాత వంశీ అభ్యర్థిత్వాన్ని ఆ పార్టీ ఖరారు చేసింది. దీంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్న నేతకాని వెంకటేశ్‌ను బీజేపీ దగ్గరకు తీసుకుంటున్నది. ఆ నియోజకవర్గం నుంచి ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించే అవకాశముందనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తున్నది. దీనికి ససేమిరా అంటున్న గోమాస శ్రీనివాస్‌ను బుజ్జగించేందుకు యత్నిస్తోంది. సీటు కన్ఫామ్ చేస్తేనే పార్టీలోకి వస్తానని వెంకటేశ్ మెలిక పెట్టినట్టు తెలిసింది. పెద్దపల్లి అభ్యర్థి మార్పుపై రెండు, మూడు రోజుల్లో మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది. నల్లగొండ పార్లమెంట్ స్థానం నుంచి బరిలో నిలిచిన సైదిరెడ్డి అభ్యర్థిత్వాన్ని ఆ జిల్లా యంత్రాంగం అంగీకరించే పరిస్థితిలో లేదు. రాష్ట్ర నాయకత్వంలోని కొందరు కీలక నేతలు కూడా ఆయన అభ్యర్థిత్వాన్ని నేటికీ బలంగా వ్యతికిస్తున్నారనే ప్రచారముంది. ఆర్థిక అంగుఅర్భాటాలున్న తేరా చిన్నపురెడ్డినిగానీ, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో బలమైన ఓటుబ్యాంకు ఉన్న బీసీ సామాజిక తరగతికి చెందిన రామరాజు యాదవ్‌ను గానీ బరిలో దింపాలనే ఒత్తిడి రాష్ట్ర నాయకత్వంపై ఉంది. సామాజికంగా ఓకేగానీ, ఆర్థికంగా మిగతా ఇద్దరితో రామరాజు సరితూగడనే చర్చనడుస్తున్నది. మొత్తంగా ఈ రెండు నియోజకవర్గాల అభ్యర్థులను మారుస్తారా? అట్లాగే కొనసాగిస్తారా? అలాగైతే సీటుపై ఆశపెట్టుకుని పార్టీలో చేరిన నేతలకు ఏవిధంగా సర్దిచెప్తారు? తదితర అంశాలపై మరింత క్లారిటీ రావాల్సి ఉంది.

మత రాజకీయాలు చెల్లవ్

- కులం, మతం పేరుతో వచ్చే వారిని జనం నమ్మరు
- సంజయ్ కనీసం గుడి, బడి కూడా తేలేదు
- పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకనవుతా..
- కరీంనగర్‌కు ఎంపీగా స్మార్ట్‌సిటీని సాధించా
- రైల్వేలైన్లు, జాతీయ రహదారులు తీసుకొచ్చా..
- అభివృద్ధి కాంక్ష, తెలంగాణ బాగోగుల గురించే పరితపించేవాన్ని
- ఏ కేసులూ ప్రభావితం చేయబోవు
- కరీంనగర్ ట్రైయాంగిల్ పోటీలో విజయం పక్కా నాదే.. : 'నవతెలంగాణతో' బీఆర్ఎస్ కరీంనగర్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్



దేశంలో నెల వ్యవధిలో పార్లమెంట్ ఎన్నికల పోరు జరగనుంది. ప్రస్తుతం ఆ ఎన్నికల సమర సన్నాహాల్లో మునిగిన రాజకీయ పార్టీలన్నీ గెలుపోటములపై సర్వేలు చేసుకుంటూ క్యాడర్‌తో సమావేశాలు.. జనంలో ప్రచారానికి దిగాయి. ఈ నేపథ్యంలో ఉత్తర తెలంగాణకు కీలక స్థానంగా ఉన్న కరీంనగర్‌పైనే అందరి దృష్టి ఉందనడంలో అతిశయోక్తి లేదు. అలాంటి స్థానం నుంచి బీఆర్ఎస్ ఆవిర్భావం నుంచీ కేసీఆర్ వెన్నంటి ఉంటూ వస్తున్న బోయిన్‌పల్లి వినోద్‌కుమార్ మరోమారు రంగంలోకి దిగారు. తెలంగాణ సాధన మొదలు.. రాష్ట్ర అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషించడమేగాకుండా గతంలో ఎంపీగా కరీంనగర్‌కు తెచ్చిన ప్రాజెక్టులు, భవిష్యత్‌లో చేయబోయే పనులూ వివరిస్తూ ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రంలో మత రాజకీయాలు చెల్లవన్నారు. కులం, మతం పేరుతో వచ్చే వారిని జనం నమ్మే పరిస్థితి లేదని చెబుతున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిన దశలో పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తామా? అన్న అనుమానాల నుంచి ఖచ్చితంగా గెలుస్తామనే ధైర్యం వచ్చిందంటూ చెబుతున్న కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌తో 'నవతెలంగాణ' ముఖాముఖి.

నవతెలంగాణ : అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, ప్రస్తుతం ఈడీ కేసులు, ఫోన్‌ట్యాపింగ్ వంటి ప్రతికూల అంశాలు మీ గెలుపును ప్రభావితం చేసే అవకాశం ఉందా?

వినోద్‌కుమార్ : రాష్ట్రంలో పార్టీ అధికారం కోల్పోయిన వారం, పది రోజుల్లోనే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుస్తామా? అంటూ పార్టీ క్యాడర్ నుంచే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ సమయంలో గెలుపోటములు, సయయానుకూలంగా మారే రాజకీయ పరిస్థితులను క్యాడర్‌కు వివరించాను. సరిగ్గా మూన్నెళ్ల తరువాత ఆ క్యాడరే ఇప్పుడు మనం గెలుస్తున్నాం అన్నా! అంటూ ధీమా వ్యక్తం చేస్తోంది. కాంగ్రెస్ హామీలకు మోసపోయామనే భావన ప్రజల్లో పెరిగింది. ప్రధానంగా రైతాంగమంతా రాష్ట్ర ప్రభుత్వంపై భగ్గుమంటోంది. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు ఉద్దెర గ్యారంటీలనేది తేలిపోయింది. అదే పార్లమెంట్ ఎన్నికల్లో ఖచ్చితంగా ప్రజలు ఆశీర్వదిస్తారనడానికి తార్కాణంగా చెప్పొచ్చు. ఇక ప్రస్తుతం కవితపై కేసులు, అరెస్టులు, ఫోన్‌ట్యాపింగ్ వంటి రాజకీయ క్రీడను సాగిస్తున్న కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ వ్యవహారాన్ని ప్రజలు గమనిస్తున్నారు. మా నాయకత్వంపై వస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవాలని త్వరలోనే తేలుతుంది.



మీరు నాన్‌లోకల్ అనే అంశంపై మీ ప్రత్యర్థి పార్టీలు చేస్తున్న ప్రచారానికి ఎలా స్పందిస్తారు?

పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు ఎక్కడి నుంచి అయినా పోటీ చేయొచ్చు. నేను నాన్‌లోకల్ అని ఆరోపిస్తున్న వారికి ఒకటే సమాధానం. నేను పుట్టింది కరీంనగర్‌లోనే. నా తల్లిగారి ఊరూ ఇక్కడే. 2004లో హన్మకొండ ఎంపీగా నేను పని చేసిన సమయంలో.. అప్పుడు వరంగల్ నుంచి కరీంనగర్ సిటీని ఆనుకుని ఉన్న మానకొండూర్ వరకూ తన పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే ఉండేవి. నాన్‌లోకల్ అంటూ మాట్లాడుతున్న రెండు జాతీయపార్టీల అధినేతలు రాహుల్‌గాంధీ, మోడీ తమ రాష్ట్రాలను వదిలి వేరే రాష్ట్రాల్లో పోటీ చేసిన విషయం ప్రజలకు తెలియంది కాదు. నన్ను రాజకీయంగా, ప్రజల్లో తనపై ఉన్న ఆదరణను ఎదుర్కోలేకనే ఈ అంశాన్ని లేవనెత్తుతున్నారు.

గతంలో ఎంపీగా మీరు చేసిన అభివృద్ధి పనులు ఏంటి..?

స్మార్ట్‌సిటీ హోదాకు 10లక్షల జనాభా ఉండాలని నిబంధన ఉన్నప్పటికీ.. కేవలం 3లక్షల జనాభానే ఉన్న కరీంనగర్‌కు అప్పటి సీఎం కేసీఆర్ సహకారంతో తీసుకొచ్చిన. సుమారు రూ.వెయ్యికోట్ల స్మార్ట్‌సిటీ ప్రాజెక్టును సాధిస్తే.. ఇప్పుడు ఆ ఫలాలు ప్రజలు అందుకుంటున్నదీ తెలిసిందే. కొత్తపల్లి - మనోహరాబాద్ ప్రాజెక్టును రైల్వేశాఖ పక్కన పెడితే రాష్ట్ర సర్కారుతో కావాల్సిన భూమి సేకరించి, వ్యయంలో సగం భరించేలా ఒప్పించాను. ఆ కృషే రైల్వే లైను పట్టాలెక్కేలా చేసింది. 2014 కంటే ముందు కరీంనగర్‌లో ఒక్క జాతీయ రహదారి లేదు. విషయం పార్లమెంట్‌లో లేవనెత్తడమేగాకుండా సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖతో కొట్లాడి ఎల్కతుర్తి, హుస్నాబాద్ టూ సిద్దిపేట, మెదక్ వరకు 133కిలో మీటర్ల ఎన్‌హెచ్765డీజీ, జగిత్యాల-కరీంనగర్-వరంగల్ వరకు 216కిలోమీటర్ల ఎన్‌హెచ్-563 జాతీయ రహదారులు తీసుకొచ్చాను. కేంద్రం నుంచి రూ.3400కోట్లు మంజూరు చేయించాను. రామగుండం వయా కరీంనగర్ టూ హైదరాబాద్‌గా ఉన్న రాష్ట్ర రహదారిని సైతం ఎక్స్‌ప్రెస్ హైవేగా మార్చాలని లోక్‌సభలో గళమెత్తాను. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంపీగా, తరువాత ఐదేండ్లు రాష్ట్ర ప్లానింగ్‌బోర్డ్ వైస్‌చైర్మెన్‌గా కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో విద్య, వైద్యం, క్రీడలు, ఇరిగేషన్ వంటి రంగాల్లో అనేక అభివృద్ధి పనులు చేయించాను.



మీ ప్రచార అస్త్రాలు ఏమిటి?

కాంగ్రెస్ పార్టీ ఇంకా తమ అభ్యర్థిని ప్రకటించలేదు. పైగా రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ ఉచిత పథకాలన్నీ ఉద్దెర పథకాలని తేలిపోయింది. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న ప్రస్తుత ఎంపీ బండి సంజయ్.. కనీసం గుడి, బడి కూడా తేలేని అసమర్థ ఎంపీగా మిగిలిపోయారు. ఇప్పుడు కులం, మతం పేరుతో మళ్లీ రాజకీయం చేస్తామంటే ప్రజలు ఛీత్కరిస్తారు. 2019 ఎన్నికల్లో డిపాజిట్ కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ ఓట్లు, అప్పుడు ఎమ్మెల్యేగా ఓడిపోయాడనే సానుభూతే సంజయ్ గెలుపునకు కారణమయ్యాయి. అభివృద్ధి ఎజెండా, ప్రజల ఆకాంక్షలేంటనే సోయి కూడా లేని సంజయ్ ఐదేండ్ల తన పదవీకాలంలో చేసిందేమీ లేక, లోకల్, నాన్‌లోకల్ అనే అంశాన్ని ఎత్తుకున్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. మన ప్రాంతానికి ఎవరు అభివృద్ధి చేశారు? ఎవరు పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా నిలుస్తారనే స్పష్టత ప్రజల్లో ఉంది. ఈ ఎన్నికల్లో ప్రజలు నన్ను ఆశీర్వదిస్తారనే నిజం రాబోయే ఎన్నికల ఫలితాల్లోనే తేలిపోతుంది.

బండోజు శ్రీకాంత్,
కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి, నవతెలంగాణ

మావోయిస్టులకు టెక్నాలజీ దెబ్బ

- ఐదేండ్లలో అతి భారీ ఎన్‌కౌంటర్ ఇదే
- మృతి చెందిన 29 మంది మావోయిస్టుల్లో సగానికి పైగా మహిళలే..
- 27 లక్షల రివార్డు గల శంకర్రావు మృతి
- ముగ్గురు భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు : బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ కళ్యాణ్ ఐలెసెల్లి



నవతెలంగాణ-చర్ల

టెక్నాలజీ మావోయిస్టుల కొంప ముంచిందని పలువురు విశ్లేషిస్తున్నారు. టెక్నాలజీని ద్వారా మొబైల్ ఫోన్ ట్యాపింగ్, సిగ్నల్ క్యాచింగ్‌తోపాటు కొరియర్ వ్యవస్థను పోలీసులు ఉపయోగించుకొని మావోయిస్టుల స్థావరాలను గుర్తించి మట్టుపెట్టారని అంటున్నారు. ఇదే విషయం మంగళవారం జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌ను సూచిస్తుంది. కమాండర్ స్థాయి, ఏరియా కమిటీ కార్యదర్శి మావోయిస్టులకు నాలుగైదంచుల భద్రత ఉన్నప్పటికీ పోలీసులు చాకచక్యంగా మావోయిస్టుల స్థావరంపైకి వెళ్లి ఎన్‌కౌంటర్ చేశారు. దీంతో గడిచిన 15 ఏండ్లలో ఎన్నడూ ఇలాంటి నష్టం మావోయిస్టులకు కలగలేదని పలువురు చర్చించుకుంటున్నారు.

ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో.. మావోయిస్టు అగ్రనేత, దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఆర్‌కేబీ డివిజన్ కమిటీ కార్యదర్శి, రూ.27 లక్షల రివార్డు కలిగిన ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా ఆత్మకూరు మండలం వద్ద రామాపురం గ్రామానికి చెందిన సుగులూరి చిన్నాన్న అలియాస్ శంకర్రావు ఉన్నట్టు బస్తర్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు. అంతేకాకుండా దండకారణ్య స్పెషల్ జోన్ స్టేట్ మిలటరీ కమిషన్ ఇన్‌చార్జి రాందర్ అలియాస్ మజీదేవ్ కూడా మరణించినట్టు పోలీసు వర్గాలు తెలుపుతున్నాయి. మృతుల్లో మసీదేవ్ భార్య లలిత కూడా ఉన్నట్టు తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం పోలీసులకు, మావోయిస్టులకు మధ్య కాకులు దూరని కారడవిలో కాల్పులు మొదలై రాత్రి వరకు హోరాహోరీగా జరిగాయి. ఈ కాల్పుల్లో ఇప్పటికి 29 మంది మృతి చెందగా, మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని, ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు జరుగుతున్నాయని బస్తర్ ఐజీ పి.సుందర్ రాజ్, కాంకేర్ ఎస్పీ కళ్యాణ్ ఐలెసెల్లి తెలిపారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళలున్నట్టు తెలిసింది. పలువురు జవాన్లు కూడా గాయపడ్డారు. మావోయిస్టులు పక్కా స్థావరాలు ఏర్పాటు చేసుకొని ఛత్తీస్‌గఢ్‌లో ఈనెల 19 నుండి ప్రారంభమయ్యే పార్లమెంట్ ఎన్నికల్లో విధ్వంసం సృష్టించాలని ప్రణాళికలు వేస్తున్నారని తెలిసింది. వాటిని తిప్పికొట్టేందుకే పోలీసు బలగాలు పక్కా ప్రణాళికతో అడవులను జల్లెడ పడుతున్నాయి. ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు సుమారు 70 మంది మావోయిస్టులు మృతిచెందారు. కాగా దండ కారణ్యంలో ప్రతి ఆదివాసీ గ్రామంలో భద్రతాబలగాలు పోలీస్ క్యాంపులు పెట్టాలనే యోచనలో ఉన్నాయని తెలుస్తోంది. ఏదేమైనప్పటికీ అడవుల్లో ఎర్రటి రక్తపు టేర్లు పారుతున్నాయని పలువురు వాపోతున్నారు.

బీజేపీ గూండాల ముఠాగా ఈడీ

సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి గోవిందన్ విమర్శ



అలపుజ: బీజేపీ గూండాల ముఠాగా ఈడీ వ్యవహరిస్తుందని సీపీఐ(ఎం) కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోనిందన్ బుధవారం విమర్శించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి విజయన్ కుమార్తె టి వీణా యాజమాన్యంలోని ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన నెలవారీ చెల్లింపులు వివాదంపై ఈడీ దర్యాప్తు గురించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ దర్యాప్తుపై సీపీఐ(ఎం) స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. అయితే 2024 ఎన్నికలకు ముందు బీజేపీకి అనుకూలమైన రాజకీయ వాతావరణాన్ని సృష్టించేందుకు ఇడి ప్రయత్నిస్తోందని విమర్శించారు. 'ఈడీ విచారణ చేసి ఎవరినైనా అరెస్టు చేయనివ్వండి. ఈడీ అనేది బీజేపీ, కేంద్ర ప్రభుత్వ గూండాల ముఠా. ఇది ఎన్ని ప్రయత్నాలు చేసినా బీజేపీ ఎన్నికల్లో విజయం సాధించడం లేదు. ఏప్రిల్ 26 తరువాత ఈడీ దర్యాప్తు హంగామా ముగుస్తుంది' అని గోవిందన్ అన్నారు. ఈ వివాదంలో ముఖ్యమంత్రిపై విమర్శలు చేయడాన్ని ఖండించారు. అలాగే, కరువన్నూరు బ్యాంకు కుంభకోణం విషయంలోనూ ప్రధానమంత్రి మోడీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 'ఈ కుంభకోణం దర్యాప్తులో క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తులో కనుగొన్న విషయాలకు మించి ఈడీ ఏమీ కనుగొనలేదు. మెచ్యూర్డ్ డిపాజిట్లలో కేవలం రూ 51 కోట్లు మాత్రమే రావాల్సి ఉంది. ఎక్కువ మంది బ్యాంక్‌లో తమ ఖాతాలను పునరుద్ధరించుకున్నారు. కానీ ప్రధానిమంత్రి మాత్రం ఒక దిగువస్థాయి ఆర్ఎస్ఎస్ కార్యకర్తలా మట్లాడుతున్నారు' అని గోవిందన్ పేర్కొన్నారు.

టార్గెట్ డీఎస్సీ...

ఉపాధ్యాయ కొలువు వైపు అభ్యర్థుల చూపు

- టెట్‌కు ఆదరణ అంతంతే...
- ఇప్పటి వరకు 2.51 లక్షల దరఖాస్తులు
- గతేడాది కంటే తగ్గిన అప్లికేషన్లు
- ఫీజు పెంచడమే కారణం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉపాధ్యాయ అభ్యర్థుల లక్ష్యం జిల్లా సెలెక్షన్ కమిటీ (డీఎస్సీ)పైనే ఉన్నది. ఉపాధ్యాయ కొలువు సాధించడంపైనే వారు దృష్టి కేంద్రీకరించారు. ఆవైపుగానే వారు మొగ్గుచూపుతున్నారు. 2017, అక్టోబర్ 21న 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆ పోస్టుల భర్తీ ప్రక్రియ ముగిసింది. ఆ తర్వాత ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయలేదు. రాష్ట్రంలో 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జిల్లాస్థాయి నియామక కమిటీ (డీఎస్సీ) నోటిఫికేషన్‌ను గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసింది. 1,77,502 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. డిసెంబర్ ఏడో తేదీన ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. గత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఫిబ్రవరి 28న రద్దు చేసింది. 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను అదేనెల 29న విడుదల చేసింది. జూన్ 20 వరకు దరఖాస్తుల సమర్పణకు గడువున్నది. రాష్ట్రంలో మెగా డీఎస్సీ రాతపరీక్షలు జులై 17 నుంచి 31 వరకు ఆన్‌లైన్‌లో జరుగుతాయి.

టెట్‌పై డీఎస్సీ ప్రభావం

రాష్ట్రంలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నోటిఫికేషన్‌ను మార్చి 14న పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతున్నది. టెట్ దరఖాస్తుల సమర్పణకు ఈనెల 20 వరకు గడువున్నది. ఇప్పటి వరకు దరఖాస్తులపై ఆ ప్రభావం పడింది. టెట్ పేపర్-1కు 90,789 మంది, పేపర్-2కు 1,60,857 మంది కలిపి 2,51,646 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గతం కంటే దరఖాస్తులు భారీగా తగ్గడం గమనార్హం. టెట్ దరఖాస్తు ఫీజు రూ.వెయ్యి చెల్లించాలని విద్యాశాఖ నిర్ణయించింది. వచ్చేనెల 20 నుంచి జూన్ మూడో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో నిర్వహిస్తారు. ఆన్‌లైన్‌లో రాతపరీక్షల వల్ల దరఖాస్తు ఫీజు పెంచాల్సి వచ్చిందని అధికారులు చెప్తున్నారు. ఆఫ్‌లైన్‌లో టెట్ నిర్వహించినపుడు దరఖాస్తు ఫీజు రెండు పేపర్లకు కలిపి రూ.400 ఉన్నది. ఇప్పుడు ఒక్కో పేపర్‌కు రూ.వెయ్యి కట్టాలని నిర్ణయించారు. ఫీజు తగ్గించాలంటూ అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థి, యువజన, ఉపాధ్యాయ సంఘాలు కూడా ఫీజు తగ్గించాలంటూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. అయినా ఎలాంటి మార్పు లేదు. టెట్ దరఖాస్తులు తగ్గడానికి ఫీజు పెరగడం కూడా ఓ కారణంగా ఉన్నది. టెట్ కాలపరిమితి జీవితకాలం ఉండడంతో ఎక్కువ మంది మార్కులు సంపాదించిన వారు దరఖాస్తు చేసేందుకు మొగ్గు చూపలేదు. మరోవైపు జులైలోనే డీఎస్సీ రాతపరీక్షలున్నాయి. ఎక్కువ మంది ఉపాధ్యాయులు డీఎస్సీ రాసేందుకే ఆసక్తి కనబరుస్తున్నారు.

అందుకే టెట్ దరఖాస్తులు తగ్గాయి. గతేడాది సెప్టెంబర్ 15న నిర్వహించిన టెట్ పేపర్-1కు 2,69,557 మంది, పేపర్-2కు 2,08,498 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. గతేడాది కంటే పేపర్-1కు 1,78,768 పేపర్-2కు 47,641 దరఖాస్తులు తగ్గడం గమనార్హం. ఇంకోవైపు సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) పోస్టులకు బీఎడ్ అభ్యర్థులు దరఖాస్తు చేసేందుకు అవకాశం లేదు. టెట్ దరఖాస్తులు తగ్గడానికి ఇదీ ఓ కారణంగా ఉన్నది.

ఉపాధ్యాయుల్లో ఇంకా గందరగోళమే...

ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో టెట్‌పై ఇంకా గందరగోళం కొనసాగుతూనే ఉన్నది. పలు అంశాల్లో వివరణ ఇవ్వాలంటూ జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ)ని పాఠశాల విద్యాశాఖ కోరింది. కానీ ఇంత వరకు వివరణ రాలేదు. దీంతో ఉపాధ్యాయులు టెట్ రాయాలా? వద్దా? అంటూ ఆందోళన చెందుతున్నారు. అయితే ఉపాధ్యాయుల కోసం ప్రత్యేకంగా టెట్ నిర్వహించే అవకాశం లేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్రంలో 1.04 లక్షల మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. వారిలో నాలుగు వేల మంది గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు (జీహెచ్ఎం) ఉన్నారు. మిగిలిన లక్ష మందిలో సుమారు 30 వేల మంది ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణులయ్యారు. ఇంకా 70 వేల మంది ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత కావాల్సి ఉన్నది. పదోన్నతి పొందాలంటే టెట్ ఉత్తీర్ణత తప్పనిసరి ఎన్‌సీటీఈ స్పష్టం చేసింది. ఎన్‌సీటీఈ నుంచి వివరణ రాకపోవడంతో ఉపాధ్యాయులు టెట్ దరఖాస్తు చేయలేదని తెలుస్తున్నది.

టెట్ దరఖాస్తుల వివరాలు

సంవత్సరం	దరఖాస్తులు	
	పేపర్-1	పేపర్-2
2024, మే 20 నుంచి జూన్ 3 వరకు	90,789	1,60,857
2023, సెప్టెంబర్ 15న	2,69,557	2,08,498
2022, జూన్ 12న	3,51,476	2,77,893
2017, జులై 23న	1,11,647	2,56,265
2016, మే 22న	1,01,213	2,74,339



వేసవి వచ్చిందంటే చాలు.. అందరి చూపు మామిడివైపే. మామిడికాయలు తినకుండా వేసవి సీజన్ ముగియదు. పచ్చిమామిడితో చేసే అనేక రకాల వంటకాలు ఆహార ప్రియులను నోరూరిస్తూనే ఉంటాయి. మామిడితో రకరకాల నిల్వ పచ్చళ్లు తయారు చేస్తారు. పచ్చళ్లు, పప్పే కాకుండా మామిడి కాయతో చేసే రకరకాల వంటల పరిచయం మీ కోసం...

నోరూరించే...

పులిహోర

కావలసిన పదార్థాలు: ఒక కప్పు బియ్యం, సగం కప్పు పచ్చి మామిడికాయ తురుము, పావు కప్పు కొబ్బరి తురుము, రుచికి సరిపడా ఉప్పు, సగం స్పూను మిరియాలు, నాలుగు పచ్చి మిర్చి, నాలుగు ఎండు మిర్చి, సగం స్పూను ఆవాలు, ఒక స్పూన్ మినపప్పు, ఒక టేబుల్ స్పూను శనగపప్పు, పావు స్పూను పసుపు, రెండు టేబుల్ స్పూన్ల జీడిపప్పు, పావు కప్పు పల్లీలు, రెండు కరివేపాకు రెబ్బలు, తాలింపుకు సరిపడా నూనె.



తయారీ విధానం: ముందుగా బియ్యాన్ని కడిగి నీళ్ల పోసి స్టవ్ మీద పెట్టి పొడిపొడిగా అన్నం వండి పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కడాయి పెట్టి నూనె వేసి వేడి చేసుకోవాలి. నూనె వేడెక్కిన తర్వాత ఆవాలు, మిరియాలు, మినపప్పు, జీడిపప్పు, శనగపప్పు, పల్లీలు, ఎండు మిర్చి, పచ్చిమిర్చి వేసి బాగా వేయించుకోవాలి. తర్వాత కరివేపాకు, మామిడి తురుము, కొబ్బరి తురుము, రుచికి సరిపడా ఉప్పు వేసి బాగా కలుపుకోవాలి. ఇలా చేసుకున్న మిశ్రమాన్ని అన్నం పైన వేసి బాగా కలుపుకోవాలి. అంతే ఎంతో రుచికరమైన మామిడికాయ, కొబ్బరి పులిహోర రెడీ.

చట్నీ :

కావలసిన పదార్థాలు : మామిడికాయ- ఒకటి, మినపప్పు-ఒక చెంచా, శనగలు- ఒక స్పూన్, మెంతులు - పావు చెంచా, ఎండుమిర్చి - నాలుగు, పచ్చిమిర్చి - రెండు, ఆవాలు - ఒక స్పూన్, ఇంగువ కొంచెం, వెల్లుల్లి రెండు, కరివేపాకు కొంచెం, ఉప్పు రుచికి తగ్గట్టుగా, జీలకర్ర కొద్దిగా.

తయారీ విధానం : స్టౌవ్ వెలిగించుకొని బాండీ పెట్టుకోవాలి. బాండీలో నూనె వేయాలి. తర్వాత శనగలు, మినపప్పు వేసి వేయించాలి. ఇప్పుడు ఎండు మిర్చి వేసి వేయించాలి. కారంగా కావాలంటే నాలుగు పచ్చి మిర్చి కూడా వేసి వేయించుకోవచ్చు. తర్వాత మిక్సీ జార్ తీసుకుని అందులో వేయించిన మసాలాలు, జీలకర్ర, వెల్లుల్లి, మామిడికాయ ముక్కలు, ఉప్పు వేసి బాగా మెత్తగా కాకుండా గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత స్టవ్ మీద బాండీ పెట్టి నూనె వేసి కాగాక ఆవాలు, ఇంగువ, ఎండు మిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. దాని తర్వాత మిక్సీ పట్టుకున్న పదార్థాలు వేయాలి. కాసేపు వేయించాలి. రుచికరమైన మామిడికాయ చట్నీ సిద్ధంగా ఉంది.

మ్యాంగో వడ

కావలసిన పదార్థాలు : పచ్చి మామిడి తురుము - ఒక కప్పు, మినప్పిండి - రెండున్నర కప్పులు, క్యారెట్ తురుము - పావు కప్పు, శెనగపప్పు - రెండు టేబుల్



స్పూన్లు, పెరుగు - పావు కప్పు, పచ్చిమిర్చి సరిపడ, ఉల్లి ముక్కలు - కొద్దిగా, జీలకర్ర, వాము - కొద్దిగా, ఉప్పు - తగినంత, నూనె - డీప్ ఫ్రైకి సరిపడా.

తయారీ విధానం : ముందుగా ఒక పాత్రలో మినప్పిండి, పచ్చి మామిడి తురుము, క్యారెట్ తురుము, పెరుగు, కారం, గరం మసాలా, చాట్ మసాలా, ఉల్లి ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, జీలకర్ర, వాము, నువ్వులు వేసుకోవాలి. తర్వాత తగినంత ఉప్పు కలుపుకుని.. అవసరం అనిపిస్తే కొద్దిగా నీళ్ల పోసుకుంటూ కలుపుకోవాలి. ఆ మిశ్రమాన్ని కాగుతున్న నూనెలో వడల్లా వేసుకుని వేయించాలి. వాటిని సాస్‌లో లేదా చట్నీతో తినొచ్చు లేదా పెరుగులో నానబెట్టుకుని ఆవడల్లా తిన్నా బాగుంటాయి.

షరబత్

కావాల్సిన పదార్థాలు: పచ్చి మామిడి కాయ ఒకటి, పుదీనా -టేస్ట్‌కు సరిపడా, చక్కెర - ఒక కప్పు, నల్ల ఉప్పు -ఒక స్పూన్, వేయించిన జీలకర్ర పొడి -ఒక టేబుల్ స్పూన్, మిరియాల పొడి -అర స్పూను, ఉప్పు -రుచికి సరిపడా, ఐస్ స్క్యూబ్స్ - మూడు, నీరు- 2 లీటర్లు

తయారీ విధానం: ముందుగా పచ్చి మామిడికాయలను తీసుకుని శుభ్రం చేసుకోవాలి.. తొక్క తీసి.. చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. పుదీనా



ఆకులను శుభ్రం చేసుకొని పక్కన పెట్టుకోవాలి. తర్వాత స్టౌ వెలిగించి.. పాన్ పెట్టి.. మామిడి ముక్కలను వేసుకుని కొంచెం సేపు మరిగించాలి. అనంతరం పంచదార, ఉప్పు, నల్ల ఉప్పు, మిరియాలు, వేయించిన జీలకర్ర పొడి వేసి.. పుదీనా ఆకులూ వేసుకుని చిన్నమంటలో 20 నిమిషాలు మరిగించాలి. తర్వాత స్టౌ మీద నుంచి దించి.. మామిడి మిశ్రమాన్ని చల్లారనివ్వాలి. ఈ మిశ్రమాన్ని.. మిక్సీలో వేసి.. గ్రైండ్ చేయాలి. దీన్ని ఫ్రిజ్‌లో పెట్టుకుంటే.. దాదాపు 15 రోజులు నిల్వ ఉంటుంది. తాగే ముందు.. ఒక గ్లాసులో తయారు చేసుకున్న మామిడి సిరప్, ఐస్ క్యూబ్స్, కొన్ని పుదీనా ఆకులు వేసుకుని తగినంత నీరు కలుపుకోవాలి. అంతే పుల్లపుల్లని టేస్టీ టేస్టీ మామిడి షరబత్ రెడీ.. ఇది చల్లగా తాగితే చాలా రుచిగా ఉంటుంది. ఆరోగ్యానికి మంచిది.

మ్యాంగో చికెన్ కర్రీ..!

కావలసిన పదార్థాలు: చికెన్ 500 గ్రాములు, ఉల్లిగడ్డలు - రెండు, మామిడి కాయ - ఒకటి (తొక్క తీసి చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి), అల్లం వెల్లుల్లి పేస్ట్ రెండు స్పూన్లు, లవంగాలు కొద్దిగా, పచ్చిమిర్చి నాలుగైదు, ఎండు మిర్చి - నాలుగైదు, పసుపు - ఒకస్పూను, కారం - ఒక స్పూను, గరం మసాలా పొడి -రెండు స్పూన్లు, రుచికి సరిపడా ఉప్పు.

తయారీ విధానం : వెల్లుల్లి, అల్లం, పచ్చి



మిరపకాయలు, ఎండు మిరపకాయలు కలిపి పేస్ట్‌ను తయారు చేయండి. మీరు బ్లెండర్‌ని ఉపయోగించవచ్చు లేదా చేతితో రోలులో రుబ్బుకోవచ్చు. తర్వాత చికెన్‌ను ఈ పేస్ట్‌తో మెరినేట్ చేసి రెండు గంటలు ఫ్రిజ్‌లో పెట్టుకోవాలి. తర్వాత స్టౌ మీద పాన్ పెట్టి అందులో నూనె వేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలను వేసి వేయించాలి. ఇది మంచి వాసన, కొద్దిగా గోధుమ రంగులోకి వచ్చాక అందులో మారినేట్ చేసి పెట్టుకున్న చికెన్ వేసి ఉడికించుకోవాలి. తర్వాత కొద్దిగా నీరు పోసి చికెన్ బాగా ఉడికాక.. తరిగిన మామిడికాయ ముక్కలను వేయాలి. మూతపెట్టి చిన్న మంట మీద 8-10 నిమిషాలు ఉడికించాలి. మామిడికాయ, చికెన్ కర్రీ రడీ.

టిప్స్



పచ్చిమిర్చిలో కాసింత పసుపు చేర్చి డబ్బాలో కానీ సీసాలో కానీ నిలవ ఉంచితే ఎరుపురంగులోకి మారకుండా ఉంటాయి.

పీరియడ్స్ సమయంలో ఈ ఆహారం తీసుకోండి..



పీరియడ్స్ సమయంలో చాలా మంది నీరసంగా, చికాకుగా కనిపిస్తారు. మరికొంత మందిని అధిక రక్తస్రావం, కడపు నొప్పి వంటి సమస్యలు బాధిస్తాయి. ఏం తినాలన్నా పెద్దగా ఆసక్తి చూపరు. అయితే పీరియడ్స్ సమయంలో మంచి పోషకాహారం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. అలాగే వ్యక్తిగతమైన పరిశుభ్రత, జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. కేవలం నెలసరి సమయంలోనే కాకుండా.. కాస్త ముందు జాగ్రత్తలు తీసుకోవటం ద్వారా నెలసరి సమయంలో వచ్చే సమస్యలను సులభంగా అధిగమించవచ్చని పేర్కొన్నారు.

- పీరియడ్స్ సమయంలో వేడి వేడి అల్లం టీ ఒక కప్పు తాగితే.. కండరాల నొప్పిలో ఎంతో ఉపశమనం లభిస్తుంది.
- ఫ్రెష్‌గా ఉండే పండ్ల రసాలు, తక్షణ శక్తిని ఇచ్చే ఆహారపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. నీళ్ల ఎక్కువగా తాగాలి. పెరుగు, ఒమేగా-3 అధికంగా ఉండే నట్స్, కూరగాయలు, పండ్లు వంటి వాటిని తీసుకోవాలి.
- ఈ సమయంలో అధిక రక్తస్రావం వల్ల శరీరం ఎక్కువ మొత్తంలో రక్తాన్ని కోల్పోతుంది. నీరసం వంటివి లేకుండా ఉండేందుకు పౌష్టికాహారం తీసుకోవడం మంచిది.
- అలాగే ఐరన్ అధికంగా లభించే ఆహారాలను తీసుకోవాలి. ఎందుకంటే కోల్పోయిన రక్తాన్ని తిరిగి భర్తీ చేసేందుకు ఈ తరహా ఆహారాలు తోడ్పడతాయి. బచ్చలికూర, అరటి పండు, గుమ్మడికాయ, ప్రొటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి. పప్పులు, మిల్క్ షేక్‌లు, పాలు, గుడ్లు, చేపలు, మొలకెత్తిన ధాన్యాలు మొదలైనవి తీసుకోవాలి.
- శరీరంలో కాల్షియం కొరత ఉండకూడదు. లేదంటే కీళ్ల నొప్పుల సమస్యను ఎదుర్కొంటారు. ఇందుకోసం కాల్షియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవటం మంచిది. ముఖ్యంగా డార్క్ చాక్లెట్ చాలా మేలు చేస్తుంది. డార్క్ చాక్లెట్‌లో ఐరన్, మెగ్నీషియం ఎక్కువగా ఉండడం వల్ల పీరియడ్స్ సమయంలో వచ్చే సమస్యలకు ఉపశమనం కలుగుతుంది.
- అదే క్రమంలో ఎక్కువ మోతాదులో ఉప్పు, పంచదార, కాఫీ, మద్యం, స్పైసీ ఫుడ్స్, రెడ్ మీట్, వంటివాటిని తీసుకోవద్దని నిపుణులు సూచిస్తున్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

(మొదటిపేజీ తరువాయి)

మహోత్సవాన్ని గురువారం నిర్వహిస్తారు.

ప్రభుత్వం తరఫున సీఎస్ పట్టువస్త్రాల సమర్పణ

లోక్‌సభ ఎన్నికల కోడ్ నేపథ్యంలో సీతారాములకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పట్టువస్త్రాలను సమర్పించారు. కల్యాణోత్సవానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దంపతులు, రెవెన్యూ శాఖ పొంగులేటి శ్రీనివాస రెడ్డి దంపతులు, మంత్రి కొండా సురేఖ, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు దంపతులు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు హాజరయ్యారు. అలాగే సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నర్సింహ, హైకోర్ట్ జడ్జి భీమపాక నగేష్ కల్యాణంలో పాల్గొన్నారు. రామయ్య కల్యాణాన్ని కనులారా వీక్షించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మిథులా స్టేడియం.. సర్వాంగ సుందరం..

శ్రీ సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా మిథులా స్టేడియాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయాన్ని అందంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణం మొత్తం విద్యుత్ దీపాలతో మిరమిట్లు గొలుపుతోంది. అలాగే మిథిలా కల్యాణ మండపంలో 24 సెక్టార్లు ఏర్పాటు చేశారు. 31 వేల మందికి పైగా భక్తులు ఈ కల్యాణం వీక్షించారు. 1800 మంది పోలీసులు బందోబస్తు విధుల్లో ఉన్నారు. శ్రీ రామ పట్టాభిషేకం గురువారం ఉదయం నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాటు చేశారు. భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, ఎస్పీ రోహిత్ రాజ్, ఈవో రమాదేవి క్రతువుల ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

రాములమ్మ ఎక్కడ..!

(మొదటిపేజీ తరువాయి)



తుక్కుగూడలో నిర్వహించిన జనజాతర బహిరంగసభకు ఆమెను కూడా ఆహ్వానించలేదని తెలిసింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ప్రచారం మొదలైంది. అందులోనూ ఆమె ఎక్కడా కానరావడం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒక్కసారి గాంధీభవన్‌కు వచ్చిన ఆమె ఆ తర్వాత ఇంటికే పరిమితమయ్యారు. ఆ ఎన్నికల సమయంలో కూడా పార్టీ ఆమె సేవలను ఉపయోగించుకోలేదు. అయితే ఆ సమయంలో విజయశాంతి బీఆర్ఎస్‌పై పార్టీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. నిజానికి అధికార బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్ పార్టీ గెలుపొందడం పట్ల విజయశాంతి సంతోషంగా ఉన్నారు.

బీజేపీలో ఇమడలేకనే...

గత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీని వీడిన రాములమ్మ కమలం గూటికి చేరారు.అయితే బీజేపీలో కూడా ఆమెకు సరైన గౌరవం ఇవ్వలేదు. ముఖ్యంగా ఆ పార్టీ నేతల మధ్య అంతర్గత విభేధాలు తారాస్థాయికి చేరాయి. అయినా ఆమె ఎక్కడ వెనుకడుగు వేయకుండా అనేక ప్రజా సమస్యలపై స్పందించారు. కమలం పార్టీలో ఉంటే ఏదో గ్రూపులో చేరిపోవడం తప్ప మరో గత్యంతరం లేదు. దీంతో పార్టీలో ఇమడలేక ఆమె మళ్లీ కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. కానీ అక్కడ కూడా ఇమడలేక, బయటకు రాలేక ఇంటికి పరిమితవుతున్నారనే వార్తలొస్తున్నాయి. ఎంతో ఉత్సహంగా పార్టీలో చేర్చుకోవడం, ఆ తర్వాత సముచిత స్థానం కల్పించకపోవడంతో ఆమె తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్టు తెలిసింది. సినినటిగా విజయశాంతికి పాపులార్టీ ఉన్నది. రాజకీయ ఫైర్ బ్రాండ్‌గా కూడా ఆమెకు పేరుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ....పార్లమెంటు ఎన్నికల్లో కూడా ఆమె సేవలు ఉపయోగించుకునేలా ప్లాన్ చేయాలని ఆ పార్టీ వర్గాలు అధిష్టానాన్ని కోరుతున్నాయి. కొంత మంది సీనియర్ నేతలు ఆమెతో రాయబారం కూడా నడిపినట్టు సమాచారం. అయినప్పటికీ విజయశాంతి శాంతించలేదని తెలిసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుంటే తప్ప ఆమె గాంధీభవన్ గడప తొక్కేలా లేరని పార్టీ వర్గాలు అంటున్నాయి.

పోరాటాల గడ్డపై ఎర్రజెండా ఎగరాలి

(మొదటిపేజీ తరువాయి)

దేశాన్ని నాశనం చేస్తారని అన్నారు. బుధవారం నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణ కేంద్రంలోని నర్రా రాఘవరెడ్డి భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ఎన్నికల ముందు ప్రకటించిన మ్యానిఫెస్టోకు, అధికారంలోకి వచ్చిన తర్వాత అనుసరిస్తున్న విధానాలకు సంబంధం లేదన్నారు. పదేండ్లలో మోడీ ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ కంపెనీలకు అప్పగించారని విమర్శించారు. ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి ఓట్లు వేయించుకొని అధికారంలోకొచ్చాక విస్మరిస్తారన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేపీలో చేరుతారని ప్రకటించడం సరైంది కాదన్నారు. రేవంత్ రెడ్డి బీజేపీలో చేరుతారని ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా ఏమైనా చెప్పారా.. చెబితే ప్రజలకు వివరించాలన్నారు. అర్థంపర్థం లేని విమర్శలు చేసి తమ స్థాయిని దిగజార్చుకుంటున్నారన్నారు.

ఎంతో పోరాట చరిత్ర కలిగిన భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో అవకాశవాదులను ఓడించి.. ప్రజల గొంతుకగా ఉన్న సీపీఐ(ఎం) అభ్యర్థి జహంగీర్‌ను పార్లమెంటుకు పంపించాలని కోరారు. విద్యార్థి దశ నుంచే జహంగీర్ కమ్యూనిస్టు ఉద్యమంలో పని చేస్తున్నారన్నారు. మూసీ ప్రక్షాళన పోరాటం, కార్మిక, కర్షక వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. పేదలకు, రైతులకు, ప్రజలకు ఎర్రజెండా ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆలోచించి ఉద్యమ చరిత్ర కలిగిన కమ్యూనిస్టు అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈనెల 19న జహంగీర్ నామినేషన్ కార్యక్రమం భువనగిరిలో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు హాజరుకానున్నట్టు తెలిపారు.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ.. కమ్యూనిస్టుల పోరాట వారసత్వాన్ని కొనసాగించేందుకు పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి ఎంపీ అభ్యర్థి ఎండీ.జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. సీపీఐ(ఎం) అభ్యర్థిని పార్లమెంటుకు పంపిస్తే భువనగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయొద్దన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందాల ప్రమీల, నాయకులు బొజ్జ చిన్న వెంకులు, రాచకొండ వెంకట్‌గౌడ్, వంటిపాక వెంకటేశ్వర్లు, సిహెచ్ లూర్దు మారయ్య, ఒంటెపాక కృష్ణ, చెన్నబోయిన నాగమణి, ఏర్పుల రాజేశ్వర్ పాల్గొన్నారు.

కేసీఆర్.. నీ పార్టీని మూడు నెలల్లో బొంద పెడతాం

(మొదటిపేజీ తరువాయి)

ఎవరూ బీఆర్ఎస్‌లో ఉండరని అన్నారు. "నువ్వు ఓ పాస్‌పోర్ట్ దొంగవు. నువ్వు సీఎం కాగా లేనిది.. కష్టపడి సీఎం పదవిని అలంకరించిన రేవంత్ రెడ్డికి నీకు పోలికా.. రేవంత్ రెడ్డికి మొఖం చూపించలేక రెండు సార్లు అసెంబ్లీ సమావేశాలైనా నువ్వు రాలేదు. నీ కొడుకు, నీ అల్లుడు తీహార్ జైలుకు వెళ్లడం ఖాయం" అని అన్నారు. కేసీఆర్‌ను చూస్తే జాలేస్తుందన్నారు. తాము తలుచుకుంటే 30 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడో చేరేవారని అన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటు కూడా బీఆర్ఎస్‌కు రాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి 13 నుంచి 14 ఎంపీ సీట్లు రావడం ఖాయమని, జూన్ 5 నుంచి ప్రభుత్వ పాలనపై దృష్టి పెడతామని తెలిపారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాద్రిలో ఇండ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. ఎన్నికల కోడ్ ముగిశాక ప్రతి నియోజకవర్గానికీ 3500 ఇండ్లు ఇస్తామన్నారు. 10 సంవత్సరాల కాలంలో ఒక్క ఇల్లైనా కట్టించావా, ఒక్క రేషన్ కార్డు అయినా మంజూరు చేశావా.. అసలు పేదల కోసం ఏం చేశావని కేసీఆర్‌ను ప్రశ్నించారు. విటమిన్ డీ తీసుకొని దొంగ దీక్షలు చేసి చావు నోట్లో తల పెట్టి ఉద్యమం చేశానని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. అవినీతి చేసిన కేసీఆర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కవిత జైలుకు పోయాక కేసీఆర్ మానసిక స్థితి దెబ్బతిన్నదని, రేవంత్ బీజేపీలోకి పోతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్ని కుట్రలు చేసినా పసిగట్టుతాం.. మీ కుటుంబానికి సరిపోయే డబుల్ బెడ్ రూమ్ ఇల్లు చర్లపల్లి జైల్లో కట్టిస్తామని చెప్పారు.

తినటానికి తిండి లేని జగదీశ్ రెడ్డి వేల కోట్లు ఎలా సంపాదించాడో చెప్పాలన్నారు. ఎస్ఎల్బీసీ సొరంగం పనులు రూ.3000 కోట్లతో నడుస్తున్నాయని, ఆగస్టులోపు కాలువలు కూడా తీసి అదనంగా సొరంగాన్ని పూర్తి చేసి నీటి సమస్యకు పరిష్కారం చూపబోతున్నామని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీకి కట్టుబడి ఉన్నామన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ వంగూరు లక్ష్మయ్య కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రజాస్వామ్య ఫలాలు అందడం లేదు

(మొదటిపేజీ తరువాయి)

కూడా మెరుగుపరచాలని ఆయన సూచించారు. 'ప్రజాస్వామ్య ఫలాలను పొందే మార్గంలో మనం సగం దూరం ప్రయాణించాం. అయితే ఆ ప్రయోజనాలను అందిపుచ్చుకోలేకపోవడమే సమస్యగా మారింది' అని చెప్పారు. జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలో మంగళవారం జరిగిన సదస్సులో రఘురామ్ రాజన్ ప్రసంగించారు.

ఉద్యోగాల కల్పనపై దృష్టి పెట్టాలి

ఈ కారణం చేతనే తాను ఆరు శాతం వృద్ధిని గురించి మాట్లాడానని రఘురామ్ రాజన్ తెలిపారు. ప్రజాస్వామ్య ఫలాలు అందకపోవడానికి యువతకు ఉద్యోగాలు కల్పించలేకపోవడమే కారణమని ఆయన చెప్పారు. ఉద్యోగాల సంఖ్యను పెంచాలంటే ప్రజల సామర్థ్యాలను మెరుగుపరచాలని, ఉద్యోగాల స్వభావాన్ని మార్చాలని అభిప్రాయపడ్డారు. నిరుద్యోగ యువతకు అప్రెంటిస్‌షిప్ కల్పిస్తామని కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ విలువైనదేనని చెప్పారు. అయితే దీనిని సమర్థవంతంగా అమలు చేయాలంటే చేయాల్సింది ఎంతో ఉందని అన్నారు. మంచి ఉద్యోగాలు చేయడానికి మనకు మరింత మంది విద్యార్థులు అవసరమవుతారని తెలిపారు. ఉద్యోగాల కల్పనపై మరింతగా దృష్టి సారించాలని కోరారు.

ఉద్యోగావకాశాలు ఉన్న రంగాలపై చిన్నచూపు

చిప్ తయారీపై భారత్ పెద్ద ఎత్తున ఖర్చు చేయడాన్ని రఘురామ్ రాజన్ తప్పు పట్టారు. 'ఈ చిప్ ఫ్యాక్టరీలను గురించి ఆలోచించండి. చిప్ తయారీ కోసం అనేక బిలియన్ డాలర్ల సొమ్మును సబ్సిడీగా అందజేస్తున్నారు' అని చెప్పారు. తోలు పరిశ్రమ వంటి ఉద్యోగ అవకాశాలు అధికంగా ఉన్న రంగాల పనితీరు సంతృప్తికరంగా లేదని అన్నారు. 'ఆయా రంగాలలో మనం సరిగా పనిచేయడం లేదు. ఉద్యోగాల సమస్య పెరిగితే ఆశ్చర్యపడాల్సిన అవసరమే లేదు. ఉద్యోగ సమస్య అనేది గత పది సంవత్సరాలలో వచ్చింది కాదు. గత కొన్ని దశాబ్దాలుగా అది పెరుగుతూ వస్తోంది. అయితే ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్న రంగాలను మనం నిర్లక్ష్యం చేస్తున్నాము. తప్పు ఎక్కడ జరుగుతోందో తెలుసుకొని దానిని సరిచేసుకోవాల్సిన అవసరం ఉంది' అని అభిప్రాయపడ్డారు. దేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వ్యాపారాల స్థాపన కోసం సింగపూర్, సిలికాన్ వ్యాలీ వెళుతున్నారని, ఎందుకంటే అక్కడి మార్కెట్లలో ప్రవేశం వారికి సులభతరంగా ఉంటోందని చెప్పారు.

యంగ్ ఇండియాది కోహ్లీ మనస్తత్వం

'దేశంలోనే ఉండకుండా బయటకు ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో వారిని అడగాలి. అయితే వారు ప్రపంచాన్నే మార్చేయాలని కోరుకోవడం ఆనందదాయకం. మరిన్ని దేశాలలో విస్తరించాలని వారు భావిస్తున్నారు. ఒక యంగ్ ఇండియా ఉన్నదని నేను అనుకుంటున్నాను. దానిది విరాట్ కోహ్లీ మనస్తత్వం. ప్రపంచంలో రెండో స్థానంలో ఉండడాన్ని వారు ఇష్టపడరు' అని రఘురామ్ రాజన్ అన్నారు.

కమల సంకల్పం.. న్యాయ హస్తం

(మొదటిపేజీ తరువాయి)

న్యాయం అనే నినాదాలతో కాంగ్రెస్ ప్రజల ముందుకు వెళుతోంది. కులగణన చేపడతామని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ ఇప్పటి వరకూ ఓట్ల కోసం కుల సమీకరణపై దృష్టి పెట్టలేదు. ఇప్పుడు ఆ దిశగా ప్రయత్నాలు చేస్తోంది. అయితే దేశ రాజకీయాలలో గణనీయమైన ప్రభావం చూపగలిగిన పార్టీలకు కులాల అంశం తొలి ప్రాధాన్యత కాదు.

ఆ నాలుగు వర్గాల పైనే కన్ను

ఇక బీజేపీ ప్రధానంగా నాలుగు వర్గాలపై...గ్రామీణులు, యువత, రైతులు, మహిళలపై దృష్టి సారించింది. మోడీ ప్రభుత్వ విధానాలు కూడా ఈ వర్గాల చుట్టూనే తిరుగుతున్నాయి. గిరిజనుల ఓట్లపై కూడా కమలదళం కన్నేస్తోంది. కులగణనపై బీజేపీ పెదవి విప్పడం లేదు. అయితే ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) పది శాతం రిజర్వేషన్ల అమలుకు తీసుకుంటున్న చర్యలను ఓటర్లకు గుర్తు చేయడం మాత్రం మరచిపోవడం లేదు. ఏదేమైనా కులాల వారీగా లెక్కల సేకరణ రాబోయే కాలంలో ఒక రూపుదిద్దుకుంటుందని చెప్పవచ్చు.

అంతా మోడీ మయం

బీజేపీకి కర్త, కర్మ, క్రియ...అంతా ప్రధాని మోడీయే. 'మోడీ కీ గ్యారంటీ' అంటూ ఆయన తన పేరు మీదుగానే హామీలు కురిపిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఓటర్లను చేరుకునేందుకు బీజేపీ అధ్యక్ష తరహా మ్యానిఫెస్టోను రూపొందించిందని అనిపిస్తోంది. ఆర్టికల్ 370 రద్దు, అయోధ్యలో రామమందిర నిర్మాణం అంశాలను కూడా తన ఘనతలుగా కమలదళం చెప్పుకుంది. ఉమ్మడి పౌరస్మృతిని తీసుకొస్తామని, పౌరసత్వ సవరణ చట్టాన్ని అమలు చేస్తామని పునరుద్ఘాటించింది. అయితే 2019 మ్యానిఫెస్టోలో కన్పించిన 'జాతీయ పౌరుల రిజిస్టర్' ఇప్పుడు కనబడడం లేదు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ నరేంద్ర మోడీ ప్రభుత్వంపై తన మ్యానిఫెస్టోలో నిప్పులు చెరిగింది. రాజ్యాంగ సంస్థల పవిత్రతను పునరుద్ధరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చింది.

ఆయన అవినీతికి ఛాంపియన్

ఘజియాబాద్ : మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల పథకం ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ స్కీమ్ అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రధాని మోడీని ఆయన అవినీతికి ఛాంపియన్‌గా అభివర్ణించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్ జిల్లా కౌషంబీలో ఆయన బుధవారం సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్‌తో కలిసి పాత్రికేయులతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్ష ఇండియా కూటమికి అనుకూలంగా బలమైన గాలులు వీస్తున్నాయని, బీజేపీ 150 సీట్లకే పరిమితం అవుతుందని రాహుల్ చెప్పారు. ఎన్నికల నిధులలో పారదర్శకత కోసమే బాండ్ల పథకాన్ని తీసుకొచ్చామని ప్రధాని చెబుతున్నారని అంటూ.... అలాంటప్పుడు దానిని సుప్రీంకోర్టు ఎందుకు కొట్టివేసిందని రాహుల్ ప్రశ్నించారు. 'ఎన్నికల బాండ్ల పథకం ప్రపంచంలోనే అతి పెద్ద దోపిడీ పథకం. ఆ విషయం మన దేశంలో వ్యాపారులకు బాగా తెలుసు. ప్రధాని ఎంతగా వివరణ ఇస్తున్నప్పటికీ దాని ప్రభావమేమీ ఉండదు. ఎందుకంటే అవినీతికి ప్రధాని ఛాంపియన్ అని విషయం దేశానికంతా తెలుసు' అని అన్నారు. కాలపరిమితితో నిమిత్తం లేకుండా పేదరికాన్ని కాంగ్రెస్ నిర్మూలిస్తుందంటూ తాను చేసిన వ్యాఖ్యలను మోడీ విమర్శించడాన్ని రాహుల్ ప్రస్తావించారు. పేదరికం అనేది ఒక్కసారిగా పోయేది కాదని, అయితే అందుకోసం తాము బలమైన ప్రయత్నాలు చేస్తామని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో అమేఠీ నుండి పోటీ చేయడంపై అడిగిన ప్రశ్నకు రాహుల్ సమాధానమిస్తూ ఈ విషయంలో పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. అలాంటి నిర్ణయాలను పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ తీసుకుంటుందని అన్నారు. కాగా పశ్చిమ యూపీలోని ఘజియాబాద్ నుండి ఘాజీపూర్ వరకూ రాజకీయ పవనాలలో మార్పు కన్పిస్తోందని, రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి ఘనంగా వీడ్కోలు పలుకుతామని అఖిలేష్ తెలిపారు. ఎన్నికల్లో ఒక్క ఓటు కూడా చీలకుండా ప్రయత్నిస్తామని అన్నారు.

ఐపీఎల్ 2024 పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	వి	ఓ	పా
1 రాజస్థాన్	07	06	01	12
2 కోల్‌కత	06	04	02	08
3 చెన్నై	06	04	02	08
4 హైదరాబాద్	06	04	02	08
5 లక్నో	06	03	03	06
6 ఢిల్లీ	07	03	04	06
7 గుజరాత్	07	03	04	06
8 పంజాబ్	06	02	04	04
9 ముంబయి	06	02	04	04
10 బెంగళూర్	07	01	06	02

మ్యా : మ్యాచులు, వి : విజయాలు, ఓ : ఓటములు, పా : పాయింట్లు

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X ముంబయి
వేదిక : ముల్లాపూర్ , రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..



ఐపీఎల్ టికెట్లకు ఆస్తులు అమ్ముకోవాల్సిందే!

జెంటిల్‌మెన్ గేమ్ క్రికెట్‌ను ఫక్తు కార్పోరేట్ క్రీడగా మార్చింది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్). క్రికెట్ కార్పోరేటీకరణతో బీసీసీఐ ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డుగా ఎదిగింది. కానీ ఐపీఎల్ మ్యాచ్ టికెట్ల ధరలు ఫ్రాంచైజీల కాసుల కక్కుర్తితో ఆకాశాన్ని తాకుతున్నాయి. ఐపీఎల్ టికెట్ల ధరలు, అమ్మకం అంశం ఫ్రాంచైజీలకు అప్పగించటంతో.. అభిమాన క్రికెటర్ల ఆట చూసేందుకు అభిమానులు ఆస్తులు అమ్ముకోవాల్సిన దుస్థితి దాపురించింది.

- ఫ్రాంచైజీల ఇష్టారాజ్యంగా టికెట్ ధరలు
- బెంగళూర్‌లో గరిష్ట టికెట్ ధర రూ.52,938
- హైదరాబాద్‌లో కార్పొరేట్ టికెట్ ధర రూ.30,000



నవతెలంగాణ-హైదరాబాద్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌ను స్టేడియంలో చూసేందుకు టికెట్ ధర ఎంత వరకు ఉంటుందని అనుకుంటారు? మహా అయితే.. రూ. ఐదు వేలు. స్టేడియంలో ఏదో ఒక గ్యాలరీలో కూర్చుని చూసేందుకు కనీసం రూ.500 ఉంటే సరిపోతుందని అందరూ అనుకుంటారు. ఐపీఎల్ రాకతో ఆ రోజులు పోయాయి. ఇప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు ఆస్తులు అమ్ముకోవాల్సిందే. నిజమే.. ఐపీఎల్ ఫ్రాంచైజీలు టికెట్ల ధరలను చివరకు ఆ స్థాయికి తీసుకెళ్లాయి. ఐపీఎల్ నిబంధనల్లో భాగంగా టికెట్ల ధరల నిర్ధారణ, అమ్మకం పూర్తిగా ఫ్రాంచైజీల అంశం. ప్లే ఆఫ్స్, ఫైనల్ మ్యాచ్ టికెట్లను మాత్రమే బీసీసీఐ స్వయంగా పర్యవేక్షిస్తుంది. లీగ్ దశ మ్యాచుల టికెట్ల ధరలను ఆతిథ్య ఫ్రాంచైజీ నిర్ణయిస్తుంది. టికెట్ల అమ్మకంతో భారీగా ఆదాయం ఆర్జించాలనే లక్ష్యం పెట్టుకున్న ఫ్రాంచైజీలు ధరలను అమాంతం పెంచేస్తున్నాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మ్యాచ్‌ను చిన్నస్వామి స్టేడియంలో చూడాలని అనుకుంటే గరిష్టంగా రూ.52,938 వెచ్చించాల్సిందే. ఐపీఎల్ 17వ సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ చెత్త ప్రదర్శన చేస్తున్నా.. విపరీత అభిమాన గణం అండతో స్టేడియం నిండిపోతుంది. మైదానంలో జట్టు చెత్త ప్రదర్శన చేసినా.. అభిమాన సంద్రంతో ఆర్సీబీ యాజమాన్యం ఖజానా నింపుకునే పనిలో నిమగ్నమైంది.

డైనమిక్ ధరలు : సాధారణంగా క్రికెట్ మ్యాచులకు టికెట్ల ధరలను ముందుగానే నిర్ణయిస్తారు. ఏ విభాగంలో టికెట్‌కు ఎంత ధర అనేది వెల్లడిస్తారు. కానీ ఐపీఎల్ ఫ్రాంచైజీలు విమానయాన సంస్థల బాటలో నడుస్తున్నాయి. విమానం టికెట్ ధరలు డిమాండ్‌ను బట్టి మారుతుంటాయి. అధిక డిమాండ్ ఉంటే ధరలు అంతే అధికంగా ఉంటాయి. డిమాండ్ తగ్గిపోతే.. టికెట్ ధరలు సైతం నేలకు దిగుతాయి. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ ఫ్రాంచైజీ సహా మరికొన్ని డైనమిక్ ధరలను అనుసరిస్తున్నాయి. ఆర్సీబీ యాజమాన్యం గరిష్ట టికెట్ ధర రూ.42,350గా నిర్ణయించింది. కానీ మ్యాచ్‌కు ముందు రోజు వరకు డిమాండ్ పెరగటంతో టికెట్ ధరలు సైతం అమాంతం పెరుగుతుంది. ప్రస్తుతం చిన్నస్వామి స్టేడియంలో గరిష్ట టికెట్ ధర రూ.53 వేల వరకు చేరుకుంది.

కాసుల కక్కుర్తి : ఐపీఎల్ ఫ్రాంచైజీలకు టికెట్ల అమ్మకం నుంచి వచ్చే ఆదాయం ప్రధాన ఆదాయ వనరు ఏమాత్రం కాదు. ప్రసారదారు, సెంట్రల్ పూల్ (బీసీసీఐ) నుంచి ఫ్రాంచైజీలు ప్రధానంగా ఆదాయం ఆర్జిస్తాయి. అంతర్గత ఆదాయ మార్గాలను సైతం ఫ్రాంచైజీలు బలోపేతం



చేసుకుంటున్నాయి. ఇందులో భాగంగానే కిట్ స్పాన్సర్, టికెట్ అమ్మకాలపై దృష్టి సారించాయి. మొహాలి, చండీగడ్ వంటి నగరాల్లో టికెట్ ధరలు సాధారణంగా ఉండగా.. మెట్రోపాలిటన్ నగరాల్లో టికెట్ ధరలు అధికంగా ఉన్నాయి. టికెట్‌కు ఎంత ధరైనా వెచ్చిస్తారనే నమ్మకంతోనే ఫ్రాంచైజీలు అధిక ధరలకు టికెట్లను విక్రయిస్తున్నాయి. ఇక నగరాలతో సంబంధం లేకుండా ఎం.ఎస్ ధోని, విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వంటి దిగ్గజ క్రికెటర్లు ఆడుతున్న మ్యాచ్‌కు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో సహజంగానే ఆ మ్యాచులకు టికెట్ల ధరలను సైతం పెంచుతున్నారు. ఈవెనింగ్ గేమ్‌తో పోల్చితే నైట్ గేమ్‌కు టికెట్ ధరలు ఎక్కువగా ఉన్నాయి.

అయినా.. సౌకర్యాలేవీ : రూ. వేలు వెచ్చించి ఐపీఎల్ టికెట్ కొనుగోలు చేసిన అభిమానులకు మైదానంలో నిరాశే ఎదురవుతుంది. ఫ్రాంచైజీలు, రాష్ట్ర క్రికెట్ సంఘాలు అభిమానులకు సరైన సౌకర్యాలు అందించటం లేదు. కొన్ని స్టేడియాల్లో సరైన 'వ్యూ పాయింట్స్' లేవు. అభిమానులకు అడ్డుగా తాత్కాలిక, శాశ్వత నిర్మాణాలు సహా ప్రసారదారు కెమెరాలు అడ్డుగా వస్తున్నాయి. స్టేడియంలో తాగునీరు, ఆహార పదార్థాల ధరలు సైతం అధికంగా ఉంటున్నాయి. మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు కొన్ని సార్లు నీటి సదుపాయం ఉండటం లేదు. కార్పోరేట్ టికెట్లు కొనుగోలు చేసిన వారికి సైతం చేదు అనుభవాలే ఎదురవుతున్నాయి. రూమ్‌లో ఏసీ పని చేయకపోవటం, హాస్పిటాలిటీ అధ్వానంగా ఉండటంతో సోషల్ మీడియా వేదికగా అభిమానులు ఫిర్యాదు చేస్తున్నారు. అయినా, అభిమానులకు కనీస సౌకర్యాలు కల్పించటంపై ఫ్రాంచైజీలు అశ్రద్ధ చేస్తున్నాయి.

అభిమానుల ఆగ్రహం : ఐపీఎల్ టికెట్ ధరలను అమాంతం పెంచటంపై సగటు క్రికెట్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టికెట్ ధరల అంశంలో బీసీసీఐ జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు. ఫ్రాంచైజీలకు ఇష్టం వచ్చిన ధరలకు టికెట్ల అమ్మకుండా.. బీసీసీఐ స్వయంగా టికెట్ ధరలను నిర్ణయించాలని అడుగుతున్నారు. టికెట్ల అమ్మకం అంశంలోనూ ఫ్రాంచైజీలు పూర్తి పారదర్శకత వహించేలా బోర్డు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మన దగ్గరా ఇదే దుస్థితి



సన్‌రైజర్స్ హైదరాబాద్ సైతం టికెట్లను భారీ ధరలకు అమ్ముతుంది. ఉప్పల్ స్టేడియంలో కనీస టికెట్ ధర రూ.750 కాగా... గరిష్ట టికెట్ ధర రూ.30 వేలు. నార్త్, సౌత్ పెవిలియన్ టెర్రస్ టికెట్లను తక్కువ ధరలకు విక్రయిస్తారు. కానీ ఆన్‌లైన్‌లో ఈ టికెట్లను అందుబాటులో ఉంచటం లేదు. కాంప్లిమెంటరీ పాసుల రూపంలో ప్రభుత్వ విభాగాలు, అధికారులు, హెచ్‌సీఏకు పంచేందుకు ఫ్రాంచైజీ ఈ టికెట్లను నామమాత్రంగా అందుబాటులో ఉంచుతుంది. దీంతో సగటు క్రికెట్ అభిమాని టికెట్ కొనే పరిస్థితి ఉండటం లేదు. వెస్ట్, ఈస్ట్ స్టాండ్స్ టికెట్లను సైతం ఫ్రాంచైజీ ఆన్‌లైన్‌లో తక్కువ మొత్తంలోనే ఉంచుతుందనే ఆరోపణలు ఉన్నాయి. అభిమానులకు సకల సౌకర్యాలు కల్పించే చెన్నై చెపాక్ స్టేడియంలో కనీస టికెట్ ధర రూ.1700, గరిష్ట టికెట్ ధర రూ.6 వేలు. మరి అభిమానులకు కనీస సౌకర్యాలు కల్పించని ఉప్పల్ స్టేడియంలో ఎందుకు టికెట్‌కు రూ.30 వేలు వెచ్చించాలని అభిమానులు ప్రశ్నిస్తున్నారు.

శ్రీజ, మనిక ఔట్

ఐటీటీఎఫ్ వరల్డ్‌కప్ 2024



మకావు : టేబుల్ టెన్నిస్ ప్రపంచకప్‌లో భారత ప్యాడ్లర్లు శ్రీజ ఆకుల, మనిక బత్ర గ్రూప్ దశ నుంచి నిష్క్రమించారు. వరల్డ్ నం.39 ఆకుల శ్రీజ 1-3తో రెండో మ్యాచ్‌లో ఓడింది. 4-11, 4-11, 15-13, 2-11తో వరల్డ్ నం.4 చెన్ మెంగ్ చేతిలో పోరాడి ఓడింది. తొలి మ్యాచ్‌లో 4-0తో నెగ్గిన శ్రీజ గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. వరల్డ్ నం.37 మనిక బత్ర 0-4తో నిరాశపరిచింది. 6-11, 4-11, 9-11, 4-11తో వరల్డ్ నం.2 వాంగ్‌కు తలొంచింది. మనిక సైతం గ్రూప్‌లో రెండో స్థానంలో నిలిచింది. మహిళల విభాగంలో 16 గ్రూపులు ఉండగా.. గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిస్తేనే నాకౌట్ దశకు చేరుకుంటారు.

షూటింగ్ ప్రాబబుల్స్ ఎంపిక

ఒలింపిక్ సెలక్షన్ ట్రయల్స్ షురూ



న్యూఢిల్లీ : పారిస్ ఒలింపిక్స్‌లో భారత తరఫున గురి ఎక్కుపెట్టేదెవరో తేల్చేందుకు భారత రైఫిల్ సంఘం (ఎన్ఆర్ఏఐ) సిద్ధమైంది. 2024 ఒలింపిక్స్‌కు భారత్ 16 స్థానాలు కైవసం చేసుకుంది. ఈ స్థానాల్లో ఎవరు పోటీపడేది జాతీయ సెలక్షన్ ట్రయల్స్‌తో సెలక్షన్ కమిటీ తేల్చనుంది. 16 స్థానాల కోసం 37 మంది షూటర్లు పోటీపడతారని ఎన్ఆర్ఏఐ బుధవారం ప్రాబబుల్స్‌ను ప్రకటించింది. శుక్రవారం నుంచి న్యూఢిల్లీలో ట్రయల్స్ షురూ కానుండగా.. ఈషా సింగ్, మను భాకర్, రిథమ్ సంగ్వాన్ వంటి స్టార్ షూటర్లు బరిలో ఉండనున్నారు. ఓవరాల్‌గా నాలుగు ట్రయల్స్ అనంతరం ఉత్తమ షూటర్లను ఒలింపిక్స్‌కు పంపించనున్నారు.



టైటాన్స్ ఢమాల్

89 పరుగులకే గుజరాత్ ఆలౌట్
6 వికెట్ల తేడాతో ఢిల్లీ ఘన విజయం

నవతెలంగాణ-అహ్మదాబాద్

ఢిల్లీ క్యాపిటల్స్ అదరహో. గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసిన పంత్‌సేన కీలక సమయంలో భారీ విజయం సాధించింది. తొలుత ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ల దెబ్బకు గుజరాత్ టైటాన్స్ ఢమాల్ అయ్యింది. సొంతమైదానంలో ఆ జట్టు 89 పరుగులకే కుప్పకూలింది. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ఇదే అత్యల్ప స్కోరు. పేసర్లు ముకేశ్ కుమార్ (3/14), ఇషాంత్ శర్మ (2/8), స్పిన్నర్ ట్రిస్టన్ స్టబ్స్ (2/11) విజృంభించటంతో అహ్మదాబాద్‌లోని మొతెరా స్టేడియంలో తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ 17.3 ఓవర్లలో 89 పరుగులకు ఆలౌటైంది. టెయిలెండర్ రషీద్ ఖాన్ (31, 24 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) గుజరాత్ టైటాన్స్‌కు ఆ మాత్రం స్కోరు అందించాడు. 90 పరుగుల ఛేదనలో కెప్టెన్ రిషబ్ పంత్ (16 నాటౌట్, 11 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), జేక్ ఫ్రేసర్ (20, 10 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), అభిషేక్ పోరెల్ (15, 7 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), షాయ్ హోప్ (19, 10 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్‌లు) రాణించారు. 8.5 ఓవర్లలోనే (మరో 67 బంతులు ఉండగానే) 92 పరుగులు బాదిన ఢిల్లీ క్యాపిటల్స్ ఆరు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది ఏడు మ్యాచుల్లో మూడో విజయం కాగా.. గుజరాత్ టైటాన్స్‌కు ఏడు మ్యాచుల్లో ఇది నాల్గో పరాజయం.

పేసర్ల ప్రతాపం : తొలుత బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్‌కు ఢిల్లీ పేసర్లు చుక్కలు చూపించారు. ఇషాంత్ శర్మ ముకేశ్ కుమార్‌లు నిప్పులు చెరిగే బంతులు సంధించారు. వృద్ధిమాన్ సాహా (2), శుభ్‌మన్ గిల్ (8), సాయి సుదర్శన్ (12), డెవిడ్ మిల్లర్ (2), అభినవ్ మనోహర్ (8), రాహుల్ తెవాటియ (10), షారుక్ ఖాన్ (0) పది ఓవర్లలోపే డగౌట్‌కు చేరుకున్నారు. 48/6తో గుజరాత్ టైటాన్స్ మరింత స్వల్ప స్కోరుకు పరిమితం అయ్యేలా కనిపించింది. రషీద్ ఖాన్ (31) ఎదురుదాడి ఇన్నింగ్స్‌తో టైటాన్స్ ఆ మాత్రం స్కోరు అందించాడు. మోహిత్ శర్మ (2), నూర్ అహ్మద్ (1) సైతం నిరాశపరిచారు. 17.3 ఓవర్లలోనే గుజరాత్ టైటాన్స్ పది వికెట్లు కోల్పోయింది. ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లలో ఇషాంత్ శర్మ, ముకేశ్ కుమార్ సహా స్పిన్నర్ ట్రిస్టన్ స్టబ్స్ వికెట్ల వేటలో మెరిశారు. ఖలీల్ అహ్మద్, అక్షర్ పటేల్ చెరో వికెట్ పడగొట్టారు.

నవచిత్రం



నితిన్

రాబిన్‌హుడ్

క్రిస్మస్ కానుకగా రిలీజ్

వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాబిన్ హుడ్' సినిమాలో హీరో నితిన్ మునుపెన్నడూ లేని తరహా పాత్రలో అద్భుతంగా కనిపించబోతున్నారు. ఆయన గెటప్ నుండి క్యారెక్టరైజేషన్ వరకు నితిన్‌ని పూర్తిగా డిఫరెంట్ క్యారెక్టర్‌లో దర్శకుడు ప్రెజెంట్ చేస్తున్నారు. అతన్ని దొంగగా పరిచయం చేసిన టీజర్ హాస్యభరితంగా ఉండగా, బర్త్ డే గ్లిమ్ప్స్ పూర్తి యాక్షన్ ప్యాక్డ్‌గా ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో అత్యున్నత స్థాయి నిర్మాణ, సాంకేతిక విలువలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఇదిలా ఉంటే, ఈ సినిమాని డిసెంబర్ 20న విడుదల చేయాలని మేకర్స్ డిసైడ్ అయ్యారు. క్రిస్మస్ సెలవులు, ఆ తర్వాత న్యూ ఇయర్ సెలవులు ఈ సినిమాకి కలిసి రానున్నాయి. కమర్షియల్ అంశాలే కాకుండా తగినంత వినోదాన్ని కలిగి ఉండే సినిమాకి ఇది సరైన విడుదలని భావిస్తున్నారు.

మేడమ్ సార్.. మేడమ్ అంతే



రమ్య పసుపులేటి

రావు రమేష్ హీరోగా నటించిన సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి మరో జంటగా, హర్షవర్ధన్ కీలక పాత్రలో నటించారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై సినిమా రూపొందుతోంది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు.

సినిమాలో రెండో పాట 'మేడమ్ సార్ మేడమ్ అంతే'ను మేకర్స్ బుధవారం విడుదల చేశారు. ఈ సినిమాలో రావు రమేష్ కుమారుడిగా అంకిత్ కొయ్య నటించారు. ఆయన ప్రేమించే అమ్మాయిగా రమ్య పసుపులేటి కనిపించనున్నారు. వాళ్లిద్దరి మీద 'మేడమ్ సార్ మేడమ్ అంతే' పాటను తెరకెక్కించారు. ఈ సినిమాలో అల్లు అర్జున్ అభిమానిగా అంకిత్ కొయ్య కనిపించనున్నారు. అందుకని, ఆయన అల్లు అర్జున్ సినిమాల్లో హీరోయిన్ ఇంట్రడక్షన్ సన్నివేశాలను ఊహించుకుంటూ తన ప్రేమ పాటను పాడుకున్నారు. 'తొలి తొలి సారి తొలిసారి గుండె గంతులేస్తున్నదే!... మేడమ్ సారు మేడమ్ అంతే' అంటూ సాగే ఈ పాటను గాయకుడు సిద్ శ్రీరామ్ పాడారు. కళ్యాణ్ నాయక్ అందించిన అద్భుతమైన బాణీని తన గాత్రంతో ఆయన మరో స్థాయికి తీసుకువెళ్లారు. భాస్కరభట్ల పాటను రాశారు.

ఈ సందర్భంగా దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'తాజాగా సన్నాఫ్ సుబ్రమణ్యంగా నటించిన అంకిత్ కొయ్య సాంగ్ విడుదల చేశాం. ఆయన పోషించిన పాత్రకు, అల్లు అర్జున్‌కి సినిమాలో చిన్న కనెక్షన్ ఉంటుంది. అది ఏమిటనేది ప్రస్తుతానికి సస్పెన్స్. లిధా మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్ ద్వారా మా సినిమాలో పాటల్ని విడుదల చేస్తున్నాం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. త్వరలో సినిమా విడుదల తేదీ వెల్లడిస్తాం' అని చెప్పారు.

ఆద్యంతం నవ్వించే టీచర్



నిఖిల్ దేవాదుల, నవీన్ మేడారం, నిత్యశ్రీ

ఆసాంతం కడుపుబ్బ నవ్వించే నవ్వుల జల్లుతో తెరకెక్కుతోంది 'టీచర్'. తెలంగాణలోని అంకాపూర్ అనే గ్రామంలో ఉన్న ముగ్గురు డల్ స్టూడెంట్స్‌కి సంబంధించిన కథతో తెరకెక్కుతోందీ చిత్రం.

ఈ చిత్రంలో టీచర్‌గా కలర్స్ స్వాతి నటిస్తున్నారు. అడ్డూఅదుపూ లేకుండా అల్లరి చేసే ముగ్గురు విద్యార్థులు టీచర్‌ని కలిసిన తర్వాత ఏం జరిగింది? వాళ్ల జీవితాలు ఎలా మారాయి? అనేది హృద్యంగా ఉంటుంది. సరదా సన్నివేశాలు, సంభాషణలు, అందమైన, అమాయకమైన ప్రేమ, భావోద్వేగాలతో కూడిన ప్రయాణం... ప్రేక్షకుల మనసులను టచ్ చేస్తుందనడంలో అసలు సందేహం లేదు. ఇటీవల 90స్- ఎ మిడిల్ క్లాస్ బయోపిక్‌తో బ్లాక్ బస్టర్ అందుకున్న టీమ్ నుంచి వస్తోందీ చిత్రం.

ఆదిత్య హసన్ ఈ సినిమాను డైరెక్ట్ చేశారు. నవీన్ మేడారం నిర్మించారు. ఎంఎన్ఓపీ (మేడారం నవీన్ అఫిషియల్ ప్రొడక్షన్స్) సంస్థ నిర్మిస్తోన్న రెండో సినిమా ఇది.

స్వాతి రెడ్డి (కలర్స్ స్వాతి), నిఖిల్ దేవాదుల (బాహుబలి ఫేమ్), నిత్యశ్రీ (కేరాఫ్ కంచరపాళెం ఫేమ్), రాజేంద్ర గౌడ్, సిద్ధార్థ్ (90స్ ఫేమ్), హర్ష, పవన్ రమేష్, నరేందర్ నాగులూరి, సురేష్ నటిస్తున్న ఈ చిత్రానికి సంగీత దర్శకత్వం: సిద్ధార్థ్ సదాశివుని, ఎడిటర్: అరుణ్ తాచోత్, ఆర్ట్ డైరెక్టర్: తిపోజి దివ్య.

విక్రమ్ నట విశ్వరూపం




విక్రమ్

విక్రమ్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ మూవీ 'తంగలాన్'. దర్శకుడు పా రంజిత్ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్, జియో స్టూడియోస్ బ్యానర్స్ పై ప్రొడ్యూసర్ కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. బుధవారం విక్రమ్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు బర్త్ డే విషెస్ చెబుతూ ఈ సినిమా నుంచి స్పెషల్ గ్లింప్స్ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా దర్శకుడు పా. రంజిత్ మాట్లాడుతూ, 'ఈ సినిమాను చరిత్రలో జరిగిన కొన్ని యదార్థ ఘటనల నేపథ్యంతో తెరకెక్కిస్తున్నాం. ఆ అడ్వెంచర్ స్టోరీని రూపొందించడంలో హీరో విక్రమ్‌తో పాటు మూవీ టీమ్ నాకు ఎంతో సపోర్ట్ చేసింది. ప్రముఖ ప్రొడక్షన్ కంపెనీ జియో స్టూడియోస్ ఈ సినిమా కోసం స్టూడియో గ్రీన్‌తో చేతులు కలపడం సంతోషంగా ఉంది. జియో స్టూడియోస్ రాకతో మా సినిమా గ్లోబల్ ఆడియెన్స్‌కు మరింతగా రీచ్ అవుతుందని ఆశిస్తున్నాం. హీరో విక్రమ్ ఈ సినిమా కోసం ఎంతగా కష్టపడ్డారో ఈ గ్లింప్స్ మీకు చూపిస్తుంది' అని అన్నారు. ఈ సినిమాలో పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ నేపథ్యంలో యదార్థ ఘటనల ఆధారంగా ఈ సినిమా రూపొందింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ సినిమాని త్వరలోనే అన్ని భారతీయ భాషల్లో వరల్డ్ వైడ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

వీర ధీర శూరన్



విక్రమ్

హీరో విక్రమ్ పుట్టిన రోజు బుధవారం. ఈ సందర్భంగా మేకర్స్ ఆయన కథానాయకుడిగా నటిస్తోన్న 62వ చిత్రానికి సంబంధించి టైటిల్ టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి 'వీర ధీర శూరన్' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. త్వరలోనే తెలుగు టైటిల్‌ను ప్రకటించనున్నారు. ఎస్.జె.సూర్య, దుసరా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హెచ్.ఆర్.పిక్చర్స్ బ్యానర్‌పై ఎస్.యు.అరుణ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో పక్కా మాస్ అవతార్‌లో విక్రమ్ అభిమానులను మెప్పించటం ఖాయంగా కనిపిస్తుంది.

జి.వి.ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. త్వరలోనే మరిన్ని వివరాలను తెలియజేస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి నిర్మాత: రియా శిబు, రచన-దర్శకత్వం: ఎస్.యు. అరుణ్‌కుమార్, అసోసియేట్ ప్రొడ్యూసర్: రోని జకారియా.

అందరూ కనెక్ట్ అవుతారు



సత్యం రాజేష్

'పొలిమేర-2'తో ఊహించని సక్సెస్ అందుకున్న సత్యం రాజేష్ హీరోగా నటించిన చిత్రం 'టెనెంట్'. వై.యుగంధర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మేఘా చౌదరి, చందన పయ్యావుల, ఎస్తర్ నోరోన్హా, భరత్ కాంత్ కీలక పాత్రలు పోషించారు. మహాతేజ క్రియేషన్స్ బ్యానర్‌పై మోగుళ్ల చంద్రశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న ప్రేక్షకుల ముందుకొస్తోంది.

ఈ నేపథ్యంలో హీరో సత్యం రాజేష్ మీడియాతో ముచ్చటించారు.

'ఇది ఎదురింట్లో లేదా పక్కింట్లో జరిగే కథ. భార్యాభర్తల మధ్య వచ్చే ప్రాబ్లమ్స్ గురించి చూపించే కథ. ఒక అపార్ట్‌మెంట్‌లో జరిగే స్టోరీ. అన్నీ రియల్ లైఫ్ ఇన్సిడెంట్స్‌లాగే ఉంటాయి. డైరెక్టర్ ఏం చెప్పారో అది పర్‌ఫెక్ట్‌గా తీశారు. ప్రతి సీన్ చాలా బాగుంటుంది. సినిమా థియేటర్‌లో చూసిన ప్రతి ఒక్కరూ బాగుందని చెప్పేలా ఉంటుంది. ఆడియన్స్‌కు ఈ సినిమా బ్యూటిఫుల్ ఫీల్ ఇస్తుంది. ఇలాంటి ఆఫ్ బీట్ సినిమాలకు రైటింగ్ చాలా ముఖ్యం. ఈ సినిమా కథను వర్మ శ్రీనివాస్ రాశారు. ఆయన రైటింగ్ చాలా నేచురల్‌గా ఉంది. అలాగే థ్రిల్లర్ సినిమాలకు మ్యూజిక్ కూడా చాలా ఇంపార్టెంట్. ఈ సినిమాకు సాహిత్య సాగర్ సంగీతం అందించారు. ఈ సినిమాకు మ్యూజిక్కే ప్రాణం. క్లైమాక్స్‌లో డబ్బింగ్ చెప్తున్నప్పుడు నేనే అలా అలా పాజ్ అయ్యా. ఒక ఆడియన్‌లాగా నాకే కన్నీళ్లు వచ్చాయి. సినిమాలో మ్యూజిక్ ఫీల్ అంతగా ఉంటుంది. ప్రస్తుతం స్ట్రీట్ ఫైట్, రవితేజ 'మిస్టర్ బచ్చన్' సినిమాలో నటిస్తున్నాను'.

పాన్ ఇండియా స్థాయిలో జర్నీ టు అయోధ్య



వేణు దోనేపూడి

జగదభిరాముడు, సకల గుణధాముడు.. ధర్మ రక్షకుడు, ఏకపత్నీవ్రతుడైన అయోధ్య రామయ్యను స్మరిస్తూ అనంత కోటి భక్తజనం అత్యంత వైభవంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండగ శ్రీరామనవమి. ఈ పర్వదినాన ప్రొడ్యూసర్ వేణు దోనేపూడి తన చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం.2ను అనౌన్స్ చేశారు. 'జర్నీ టు అయోధ్య' అనేది వర్కింగ్ టైటిల్. దర్శకుడు వి.ఎస్.ఆదిత్య కథను అందిస్తున్నారు.

రామాయణంపై, రామాయణంను ఆధారంగా చేసుకుని ఇప్పటి వరకు చాలా సినిమాలు వచ్చాయి. ఎందరో గొప్ప గొప్ప నటీ నటులు సీతా రాములుగా, రావణ, లక్ష్మణ, ఆంజనేయులుగా నటించి ప్రేక్షకులను అలరించారు. ఇప్పుడు అదే బాటలో రామాయణంను తెరకెక్కించటానికి నిర్మాత వేణు దోనేపూడి సిద్ధమయ్యారు. వి.ఎస్.ఆదిత్య నేతృత్వంలో ఒక టీమ్ ఈ చిత్రానికి సంబంధించి అయోధ్య సహా పలు చోట్ల లోకేషన్స్ రెక్కీ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

ఒక యంగ్ డైరెక్టర్ దర్శకత్వంలో తెరకెక్కించబోతున్న ఈ సినిమాలో నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే తెలియజేస్తామన్నారు మేకర్స్. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో, భారీగా నిర్మించబోతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి నిర్మాణ సారథ్యం తమ్మారెడ్డి భరద్వాజ వహిస్తున్నారు.

ప్రస్తుతం చిత్రాలయం స్టూడియోస్ బ్యానర్ పీపుల్ మీడియా బ్యానర్‌తో కలిసి గోపీచంద్, శ్రీనువైట్ల కాంబినేషన్‌లో 'విశ్వం' సినిమాను రూపొందిస్తోన్న సంగతి తెలిసిందే.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886